ఆదివారం 22 నవంబరు 2026

https://www.telugudesam.org





పారిశ్రామికాభివృద్ధిలో
మరో ముందడుగు

3

పనిచేసే ప్రభుత్వానికి ప్రజల అండ

కూటమిగా నిలిచాం... ఐక్యంగా గెలిచాం

- జనాభా దామాషా పద్ధతిన అన్ని వర్గాలకు రాజ్యాధికారం
- సామాన్య కార్యకర్తలను జెడ్పీ పీఠాలపై కూర్చోబెట్టాం
- వైసీపీ కుట్రలను తిప్పికొట్టిన ఓటర్లకు హ్యాట్సాఫ్
- స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై సీఎం చంద్రబాబు వ్యాఖ్య

2

ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికి ప్రజలెప్పుడూ అండగా ఉంటారని స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు మరోసారి నిరూపించాయని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రజలు పట్టంగట్టారని, 2024 సార్వత్రిక ఎన్నికలకంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి మరింత ఆదరణ లభించడమే ఇందుకు నిదర్శనమన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా ప్రజలు కూటమి అభ్యర్థులను అక్కున చేర్చుకున్నారని, ఈ విజయం రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన ప్రతిఫలంగా భావిస్తున్నామన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు మరింత బాధ్యతతో పనిచేస్తామని స్పష్టం చేశారు.



గోదావరి పుష్కరాల కోసం చేపట్టే ప్రతి పనీ ఆయా జిల్లాలకు శాశ్వత ఆస్తిగా మిగలాలి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలి. పనుల నాణ్యతలో రాజీ పడొద్దు.. గడువులోగా పూర్తి చేయాలి. ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణహితంగా పుష్కరాలను నిర్వహించాలి.
2027 ఏప్రిల్ 1 నాటికి అన్ని పనులు పూర్తి కావాలి.

-సీఎం చంద్రబాబు నాయుడు



గోదావరి పరివాహక జిల్లాలకు ఆస్తిగా..

పుష్కర పనులు

- భక్తుల సేవలకు మొబైల్ యాప్
- రాజమహేంద్రవరంలో సూర్య భగవానుడు, బృహస్పతి ఆలయం
- వచ్చే ఏడాది ఏప్రిల్ 1నాటికి పుష్కర పనులు పూర్తి కావాలి

4

- 2027 గోదావరి పుష్కరాల నిర్వహణపై సీఎం చంద్రబాబు సమీక్ష



ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు సీఈఓ కావ్య మారన్‌ల వివాహ రిసెప్షన్ వేడుక చెన్నైలో వైభవంగా జరిగింది. వేడుకకు ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరై.. వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీకి పెట్టుబడులు వస్తుంటే..

గొడ్డలి పార్టీకి కడుపుమంట



3

- తప్పుడు ప్రచారాలతో రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం
- గతంలో పరిశ్రమలు తరిమేసి ఇప్పుడు విష ప్రచారం
- కుమార్తె పెళ్లికి షర్మిల ఆహ్వానిస్తే రోత రాతలా?
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు నిప్పులు

రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే, దాన్ని ఓర్చుకోలేక గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారానికి దిగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమరావతి క్వాంటం వ్యాలీలో

సరికొత్త అధ్యాయం

- రాష్ట్రానికి 'నీలిట్' డీమ్డ్ టు బి యూనివర్సిటీ
- ప్రపంచలోనే తొలి క్వాంటం, ఏఐ వర్సిటీ ప్రత్యేక క్యాంపస్
- ఆచార్య నాగార్జునలో తాత్కాలిక తరగతులు ప్రారంభం
- త్వరలో రూ.730 కోట్లతో రాజధానిలో శాశ్వత క్యాంపస్

అమరావతిని గ్లోబల్ క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దుతాం: సీఎం

4



11



ఆక్వాకు కొత్త ఊపు!

ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

8

పనిచేసే ప్రభుత్వానికి ప్రజల అండ

- కూటమిగా నిలిచాం... ఐక్యంగా గెలిచాం
- జనాభా దామాషా పద్ధతిన అన్ని వర్గాలకు రాజ్యాధికారం
- సామాన్య కార్యకర్తలను జెడ్పీ పీఠాలపై కూర్చోబెట్టాం
- వైసీపీ కుట్రలను తిప్పికొట్టిన ఓటర్లకు హ్యాట్సాఫ్
- స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై సీఎం చంద్రబాబు వ్యాఖ్య



అమరావతి (చైతన్య రథం): ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వానికి ప్రజలెప్పుడూ అండగా ఉంటారని స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు మరోసారి నిరూపించాయని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రజలు పట్టంగట్టారని, 2024 సార్వత్రిక ఎన్నికలకంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి మరింత ఆదరణ లభించడమే ఇందుకు నిదర్శనమన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా ప్రజలు కూటమి అభ్యర్థులను అక్కున చేర్చుకున్నారని, ఈ విజయం రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన ప్రతిఫలంగా భావిస్తున్నామన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు మరింత బాధ్యతతో పనిచేస్తామని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా, పోస్టల్ బ్యాలెట్ అయినా ప్రజల తీర్పు కూటమికి అనుకూలంగానే ఉందన్నారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో కూటమి 96.42 శాతం స్ట్రయిక్ రేట్ సాధించిందని, ఎంపీపీల్లో 93.15 శాతం స్థానాలను గెలుచుకుందని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ 94 శాతం స్ట్రయిక్ రేట్ నమోదు చేసినట్టు తెలిపారు. 2024 ఎన్నికల్లో వైసీపీకి 39.81 శాతం ఓట్లు రాగా, ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో అది 33.56 శాతానికి పడిపోయిందని, ఆ పార్టీకి 6.25 శాతం ఓట్లు తగ్గాయని వివరించారు. రాష్ట్రంలో కూటమి మరింత బలపడిందని, వైసీపీపట్ల ప్రజల్లో ఆదరణ తగ్గిందని ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయన్నారు. కూటమి సాధించిన విజయంతో ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడిందని సీఎం వ్యాఖ్యానించారు.

చెప్పాం... చేశాం... చేస్తాం

కూటమి ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమం, చేపడుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సుపరిపాలనను ప్రజలు గుర్తించారని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. చెప్పినవి చేస్తున్నాం.. చేయాల్సినవి చేస్తామని, సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన విషయంలో ఎక్కడా రాజీ పడబోమన్నారు. ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజం నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విశాఖపట్నానికి, కృష్ణా డెల్టాకు తరలించే దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. గత పాలకులు తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజల భూముల భద్రతను ప్రశ్నార్థకం చేశారని విమర్శించారు. ఆ చట్టాన్ని రద్దు చేసి, వ్యక్తుల ఫొటోలతో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాల స్థానంలో రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను అందిస్తున్నామని వివరించారు. రైతుల భూములకు భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యమన్నారు. తీవ్ర స్థాయి ఎల్‌నినో ప్రభావంతో పాటు వరుసగా రెండు తుఫాన్లు రాష్ట్రాన్ని తాకినప్పటికీ ప్రభుత్వం తక్షణమే స్పందించిందని చంద్రబాబు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి సాధారణ పరిస్థితులు పునరుద్ధరించేందుకు కృషి చేశామని, విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించామని చెప్పారు. పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రైతులకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం రూ.1.30 లక్షల కోట్లకు పైగా అప్పులతో విద్యుత్ సంస్థలను నష్టాల్లోకి నెట్టిందని విమర్శించారు. అలాగే నాటి పాలకులు ప్రజలపై రూ.32 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారం మోపారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా.. విద్యుత్ ఛార్జీలు పెంచలేదన్నారు.

ప్రజల అజెండానే... ప్రభుత్వ అజెండా

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడం, అన్ని వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించడం, అభివృద్ధి ఫలాలను ప్రతి కుటుంబానికి చేరవేయడం ద్వారా ప్రజల నమ్మకాన్ని మరింత పెంచుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో లభించిన ఘన విజయం కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి ప్రతీక అని, ఈ విజయాన్ని మరింత బాధ్యతగా భావించి పాలనను కొనసాగిస్తామని తెలిపారు. రాజకీయాల్లో ధన ప్రభావం తగ్గి, సేవాభావం ఉన్న నాయకత్వం ఎదగాలన్నదే తమ అభిమతమని చంద్రబాబు పేర్కొన్నారు. ఇటీవల ఒక ఓటరు అభ్యర్థి ఇచ్చిన డబ్బును తన ఓటుతో సహా బ్యాలెట్ బాక్సులో వేసి తిరస్కరించడం ప్రజల్లో వస్తున్న చైతన్యానికి నిదర్శనమన్నారు. ఓటు విలువను గుర్తించి, డబ్బుకు లొంగకుండా ప్రజలు నిర్ణయం తీసుకునే పరిస్థితి రావడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామమని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో డబ్బు కంటే ప్రజలకు చేసిన సేవ, నాయకుడి పనితీరు, విశ్వసనీయతే కీలకం కావాలన్నారు. తాము చేసిన అభ్యర్థుల కసరత్తులోనూ ఇవే అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. స్థానిక సంస్థల పదవుల ఎంపికలో కులం, వర్గం, ప్రాంతం, మహిళా ప్రాతినిధ్యంతో పాటు అభ్యర్థుల విద్యార్హతలు, వయసు, అంకితభావం, పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకున్నామని సీఎం వివరించారు. జనాభా దామాషా ప్రకారం బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, మహిళలు, బలహీన వర్గాలకు తగిన ప్రాధాన్యం కల్పించామన్నారు. రాజ్యాధికారంలో తమకూ భాగస్వామ్యం దక్కిందన్న సంతృప్తి అన్ని వర్గాల్లో కలగాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. చట్టసభల్లోనే కాకుండా స్థానిక సంస్థల్లోనూ ఆయా వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. కర్నూలు జెడ్పీ వైస్ ఛైర్ పర్సన్‌గా 25 ఏళ్ల వయసులోనే ఎంబీబీఎస్ పూర్తి చేసిన షేక్ షాదికను ఎంపిక చేశామని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలోని గంపలగూడెం జెడ్పీటీసీ జనరల్ మహిళ స్థానానికి ఎస్సీ యువతి, ఎంటెక్ చదివిన కోట పుల్లమ్మకు అవకాశం కల్పించామని వివరించారు. 22 జెడ్పీ ఛైర్ పర్సన్ స్థానాలకు గాను 12 స్థానాలను మహిళలకు కేటాయించామని, వీరిలో 14 మంది గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉన్నారని తెలిపారు. 20 జెడ్పీ వైస్ ఛైర్ పర్సన్ స్థానాలకు గాను 11 స్థానాలను మహిళలకు ఇచ్చామని, వారిలో 17 మంది ఉన్నత విద్యావంతులు ఉన్నారని వివరించారు. విద్యావంతులైన యువతకు నాయకత్వ బాధ్యతలు అప్పగించడం ద్వారా స్థానిక సంస్థల్లో సమర్థవంతమైన పాలనకు బాటలు వేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు.

పని చేసేవారికే పట్టం..

పార్టీ కోసం కష్టపడే సామాన్య కార్యకర్తలకు ఉన్నతమైన రాజకీయ అవకాశాలు కల్పించడమే తమ విధానమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఎంపీటీసీ స్థాయి నుంచి ఎంపీ స్థాయికి ఎదిగే అవకాశం కల్పించామని, ఇప్పుడు సామాన్య కార్యకర్తలను జిల్లా పరిషత్ ఛైర్మన్లుగా నియమించి రాజ్యాధికారంలో భాగస్వాములను చేశామని తెలిపారు. కార్యకర్తే అధినేత అనే సిద్ధాంతాన్ని ఆచరణలో చూపించామని, కార్యకర్త లేకపోతే పార్టీ లేదన్న విషయాన్ని గుర్తుంచుకుని పదవుల ఎంపికలో పార్టీకి సేవ చేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చామని టీడీపీ అధినేత చెప్పారు. పదవులు కొందరికే పరిమితం కాకుండా కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, అవకాశం లభించాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్ల ఎంపికలో మహిళలకు పెద్దపీట వేశామని వెల్లడించారు. పల్నాడు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా యాదవ సామాజిక వర్గానికి చెందిన సామాన్య కార్యకర్త పుచ్చకాయల రమాదేవిని ఎంపిక చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. తూర్పుగోదావరి జెడ్పీ ఛైర్ పర్సన్‌గా శెట్టిబలిజ వర్గానికి చెందిన కాడ పద్మకు అవకాశం కల్పించామన్నారు. కడప జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్‌గా ముస్లిం మహిళ హబీబున్నీసాను, ప్రకాశం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పార్టీ యూనిట్ ఇన్‌ఛార్జి కొక్కిలిగడ్డ ప్రభాకర్ రావును, నంద్యాల జెడ్పీ ఛైర్మన్‌గా క్లస్టర్ ఇన్‌ఛార్జి షేక్ బురహానుద్దీన్‌ను ఎంపిక చేశామని తెలిపారు. పశ్చిమ గోదావరి జెడ్పీ వైస్‌ఛైర్మన్‌గా బూత్ కన్వీనర్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావుకు, అన్నమయ్య జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్‌గా బోయ సామాజిక వర్గానికి చెందిన తలారి శరణ్యకు అవకాశం కల్పించామని చెప్పారు. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పనిచేసిన వారికి, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఉన్నత పదవులు కట్టబెట్టడం ద్వారా రాజకీయాల్లో కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

కూటమికే ప్రజాశీర్వాదం

స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులను అన్ని చోట్లా గెలిపించిన విధానం చూస్తుంటే... కూటమికి మరింతగా ప్రజాదరణ పెరిగిందని అర్థమవుతోందని ముఖ్యమంత్రి అన్నారు. సీట్ల సర్దుబాటు మొదలుకుని అభ్యర్థుల ఎంపిక వరకు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. అలాగే మిత్రపక్షాలతో సర్దుబాట్లు, సమన్వయం కోసం ప్రత్యేకంగా కృషి చేశామని వెల్లడించారు. అందరూ ఐకమత్యంతో పనిచేయడం వల్లే కూటమికి ఈ స్థాయి విజయం సాధ్యమైందన్నారు. కొన్ని చోట్ల వచ్చిన ఫలితాలపై కూడా అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు లాంటి జిల్లాల్లో వచ్చిన ఫలితాలను విశ్లేషించుకుంటున్నాం. ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు తాము చేయని ప్రయత్నం లేదన్నారు. బలవంతపు మత మార్పిళ్ల ద్వారా కొందరు ఆ ప్రాంత ప్రజలను ప్రలోభపెడుతున్నారని విమర్శించారు. ప్రజాప్రతినిధుల పనితీరును కూడా అంచనా వేస్తున్నామని... స్థానిక నాయకత్వంతో సమస్యలు ఉంటే సరిదిద్దుకుంటామని తెలిపారు. కొందరు ఎమ్మెల్యేల పనితీరును ప్రజలు మెచ్చలేదు... అలాంటి వారు తమను తాము సరిదిద్దుకోవాల్సి ఉందని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. కూటమి ధర్మాన్ని పాటించకుండా కొందరు నేతలు అలగడం సరికాదన్నారు. టీడీపీలోనూ ముగ్గురు నేతలు అలిగారని.. తాను ఇంత కష్టపడి కసరత్తు చేస్తుంటే అలగడమేంటంటూ సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. అలిగిన నేతల విషయంలో తాను హ్యాపీగా లేనన్నారు.

గొడ్డలి పార్టీ విధ్వంసాలను ప్రజలు తిరస్కరించారు

స్థానిక సంస్థల ఎన్నికలు వస్తే రాష్ట్రంలోని ఓ పార్టీ వివిధ విన్యాసాలు చేసిందని సీఎం చంద్రబాబు ఆరోపించారు. కుట్రలు, కుతంత్రాలతో 63 పిటిషన్లు వేసి స్థానిక ఎన్నికలను అడ్డుకునే ప్రయత్నం చేసిందని గొడ్డలి పార్టీపై విమర్శలు చేశారు. బీసీ రిజర్వేషన్లను, సర్ పేరిట, డీలిమిటేషన్ పేరిట ఎన్నికల్ని ఆపాలని వైసీపీ కుట్ర చేసిందన్నారు. హింసకు పాల్పడింది వైసీపీనే... ఫిర్యాదు చేసింది వైసీపీనేనని... అయితే ఈ డ్రామాలను ప్రజలు విశ్వసించలేదన్నారు. అందుకే గొడ్డలి పార్టీ ఆటలు సాగలేదన్నారు. వైసీపీ కుట్రలను తిప్పికొట్టిన ప్రజలకు హ్యాట్సాఫ్ అంటూ ప్రజలను అభినందించారు. అంతిమంగా స్థానిక ఎన్నికల్లోనూ వైసీపీకి ప్రజల మద్దతు దక్కలేదన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాష్ట్రాభివృద్ధి ఆగదని సీఎం వెల్లడించారు. పదేళ్లలో ఏపీ నంబర్ వన్ రాష్ట్రం అవుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. ఇప్పుడు రాష్ట్రం నిలదొక్కుకుని నడుస్తోంది... అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని పరుగులు పెట్టించే శక్తిని ప్రజలే ఇస్తారనే విశ్వాసం ఉందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల అభిమానం, మద్దతుతో ఐక్యంగా పనిచేసి ఎన్నికల్లో విజయం సాధించామని... స్థానిక సంస్థల్లో ప్రజాతీర్పును వినయంతో స్వీకరిస్తున్నామని... తమ బాధ్యత కూడా పెరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.

పెళ్లూరు రోడ్డు ప్రమాదంపై మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి



అమరావతి (చైతన్య రథం): ప్రకాశం జిల్లా పెళ్లూరు వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడంపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు నివాళులర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



మత్స్యకారుల సంక్షేమానికి కూటమి కట్టుబడి ఉంది: లోకేష్



అమరావతి (చైతన్య రథం): ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా గంగపుత్రులందరికీ మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘ సముద్ర తీరం ఆంధ్రప్రదేశ్‌కు, రాష్ట్ర మత్స్యకారులకు ఒక వరమని పేర్కొన్నారు. 'మత్స్యకారుల సేవలో' పథకం ద్వారా కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తోందని ఎక్స్ ట్వీట్‌లో ఆయన వెల్లడించారు.

ఏపీకి పెట్టుబడులు వస్తుంటే..

గొడ్డలి పార్టీకి కడుపుమంట

- **తప్పుడు ప్రచారాలతో రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం**
- **గతంలో పరిశ్రమలు తరిమేసి ఇప్పుడు విష ప్రచారం**
- **కుమార్తె పెళ్లికి షర్మిల ఆహ్వానిస్తే రోత రాతలా?**
- **మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిప్పులు**



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే, దాన్ని ఓర్చుకోలేక గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారానికి దిగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి సహకరించకపోగా, పెట్టుబడులు రాకుండా అడ్డంకులు సృష్టించడం, రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించడమేంటని మండిపడ్డారు. క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు గొడ్డలి పార్టీ అరాచకాలను, విధ్వంసాలను తప్పుపట్టారు. రాష్ట్రానికి ద్రోహం చేసే విధంగా గొడ్డలి పార్టీ వ్యవహరిస్తోందన్నారు. కియా మోటార్స్, దాని అనుబంధ సంస్థలు ఏపీకి వస్తుంటే మళ్లీ అడ్డుపడే ప్రయత్నాలు చేస్తున్నారని, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం, పరిశ్రమలు విస్తరించడం, యువతకు ఉద్యోగాలు లభించడం వారికి ఇబ్బందిగా మారిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం పెట్టుబడిదారుల్లో విశ్వాసం కల్పిస్తూ ముందుకు వెళుతుంటే, మరోవైపు గొడ్డలి పార్టీ విధ్వంసకర రాజకీయాలకు పాల్పడుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధ్వంసమే గొడ్డలి పార్టీ చరిత్రగా మారిందని విమర్శించారు. ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం, రాష్ట్ర ప్రయోజనాలకే విఘాతం కలిగించేలా వ్యవహరించడం సరికాదని ముఖ్యమంత్రి హితవు పలికారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావడం, పెట్టుబడులు పెరగడం అందరికీ ప్రయోజనకరమని, రాజకీయాలకు అతీతంగా వాటిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు.

పొరుగు రాష్ట్రాలతో అభివృద్ధిలోనే పోటీ

కియా మోటార్స్ సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి, తన కార్యకలాపాలను విస్తరిస్తున్న నేపథ్యంలో దాని అనుబంధ సంస్థలు కూడా ఏపీకి వస్తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. దీనిపై కొందరు కావాలనే అపోహలు సృష్టిస్తున్నారని, తమిళనాడులోని కొన్ని రాజకీయ పార్టీలు కూడా ఈ అంశంపై అనవసరంగా వివాదం సృష్టించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కియా సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో ఉందని, హోండా సంస్థ తమిళనాడులో ఉందని గుర్తు చేశారు. రాష్ట్రాల మధ్య పరిశ్రమల విషయంలో పోటీ ఉన్నా, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వాల బాధ్యత కావాలని ముఖ్యమంత్రి హితవు పలికారు. పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను గత ప్రభుత్వంలో మాదిరిగా పెండింగ్‌లో పెట్టకుండా, ఇప్పుడు ఎస్క్రో ఖాతా విధానం ద్వారా పారదర్శకంగా అందిస్తున్నామని వివరించారు.

పారిశ్రామికవేత్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం ద్వారా పెట్టుబడులకు భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. గత పాలనలో పారిశ్రామిక రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశారని చంద్రబాబు విమర్శించారు. జాకీవంటి సంస్థలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయని, అమర్ రాజా బ్యాటరీస్ సంస్థను కూడా రాష్ట్రం నుంచి తరిమేసే పరిస్థితులు కల్పించారన్నారు. పెట్టుబడిదారుల్లో భయాందోళనలు సృష్టించి పరిశ్రమలు వెళ్లిపోయేలా చేసిన గత పాలకులు, ఇప్పుడు కొత్త పరిశ్రమలు రాష్ట్రానికి వస్తుంటే వాటిపైనా తప్పుడు ప్రచారం చేయడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. గతంలో విధ్వంసంతో పరిశ్రమలను తరిమేసిన వారు, ఇప్పుడు పెట్టుబడుల రాకను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర యువత భవిష్యత్తు, ఉద్యోగావకాశాలు, ఆర్థికాభివృద్ధి కంటే రాజకీయ ప్రయోజనాలే వారికి ముఖ్యమయ్యాయని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవాలని, విధ్వంసకర రాజకీయాలను పక్కనపెట్టి ప్రజాహితం కోసం పనిచేయాలని చంద్రబాబు హితవు పలికారు. ఇలా వ్యవహరించని వారిని రాజకీయంగా దూరం పెట్టాల్సిన బాధ్యత ప్రజలదేనన్నారు.

రాజకీయ వైరుధ్యాలున్నా మానవ సంబంధాలను గౌరవించాలి


వ్యక్తిగత సంబంధాలు, కుటుంబ బంధాల విషయంలోనూ రాజకీయ హుందాతనం పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన కుమార్తె వివాహానికి ఆహ్వాన పత్రిక అందించేందుకు వస్తే, దానిపై గొడ్డలి పార్టీ సొంత పత్రికలో రోత రాతలు రాయడమేంటని నిలదీశారు. ఆహ్వాన పత్రిక ఇవ్వడం ఒక మర్యాదపూర్వకమైన సంప్రదాయమని, దాన్ని కూడా రాజకీయ కోణంలో చూసి వ్యక్తిగతంగా అవమానించేలా నీచపు వార్తలు రాయడం అత్యంత బాధ్యతారాహిత్యమని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత చెల్లెలు పెళ్లికి ఒక ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తే, దానిపైనా ఇంత నీచంగా కథనాలు రాస్తారా? కుటుంబ బంధాలను కూడా రాజకీయాలకు వాడుకుంటారా? అని నిలదీశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, తాను మంచి స్నేహితులుగా ఉన్నామని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలు, వైరుధ్యాలు ఉన్నప్పటికీ తమ మధ్య మానవ సంబంధాలు ఎప్పుడూ దెబ్బతినలేదని చెప్పారు. రాజకీయ విభేదాలను వ్యక్తిగత సంబంధాలకు ముడిపెట్టకూడదని, ప్రజా జీవితంలో ఉన్నవారు కనీస మర్యాద, హుందాతనం పాటించాలన్నారు. ఒక కుటుంబంలో జరిగే శుభకార్యానికి ఆహ్వానించడం వంటి సాధారణ మానవీయ అంశాలను కూడా వివాదాస్పదం చేయడం దుర్మార్గమన్నారు. రాజకీయ పార్టీలు ప్రజల కోసం పనిచేయాలి తప్ప వ్యక్తిగత వివాదాలు, కక్ష సాధింపుల కోసం కాదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విలువలు, సంస్కారం, హుందాతనం ఉండాలని, ప్రజా సమస్యలపై పోరాడటం, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడటమే రాజకీయ పార్టీల బాధ్యత అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

తిరుమల శ్రీవారికి 121 కిలోల బంగారు ఆభరణాల విరాళం

- కలియుగ ప్రత్యక్ష దైవానికి ఓ భక్తుడి అపూర్వ కానుక

- రూ.150 కోట్ల విలువైన కానుక సమర్పణకు భక్తుడి సిద్ధత

తిరుమల (చైతన్యరథం): కలియుగ ప్రత్యక్ష దైవం, భక్తజనుల కోర్కెలను తీర్చే శ్రీ వేంకటేశ్వర స్వామివారిపై అచంచలమైన భక్తి, అపారమైన విశ్వాసానికి ప్రతీకగా ఓ మహాభక్తుడు అపూర్వమైన మహా కానుకను సమర్పించేందుకు సిద్ధమయ్యారు. దాదాపు 121 కిలోల బంగారు ఆభరణాలను శ్రీవారికి విరాళంగా అందించనున్నారు. ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం ఈ బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.150 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ మహా విరాళానికి సంబంధించి సదరు భక్తుడు ఇప్పటికే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులతో సంప్రదింపులు జరిపి, అవసరమైన అధికారిక ప్రక్రియలను పూర్తి చేసినట్లు సమాచారం. ఈ నెల 26వ తేదీన తిరుమలకు విచ్చేసే భక్తుడు.. టీటీడీ అధికారుల సమక్షంలో శ్రీవారి ఆలయంలో ఈ బంగారు ఆభరణాలను అధికారికంగా టీటీడీకి సమర్పించనున్నారు. తిరుమల చరిత్రలో ఒకే భక్తుడు వ్యక్తిగతంగా ఇంత భారీ స్థాయిలో బంగారు ఆభరణాలను కానుకగా సమర్పించడం ఇదే తొలిసారి అని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు టీటీడీకి ఒకేసారి అందిన విరాళాల్లో ఇది అత్యంత విలువైన విరాళంగా నిలిచే అవకాశం ఉందని వారు వెల్లడిస్తున్నారు. శ్రీవారి కృపాకటాక్షాలకు కృతజ్ఞతగా, సంపద అంతా స్వామివారి అనుగ్రహమే అన్న భావనతో ఈ మహా కానుకను సమర్పిస్తున్న భక్తుని సేవాభావం ఇతర భక్తులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. భక్తుల సమర్పణలు కేవలం ఆర్థిక విలువను మాత్రమే కాకుండా, వారి అచంచల విశ్వాసం, ఆధ్యాత్మిక అనుబంధం, దైవభక్తికి ప్రతీకగా నిలుస్తాయని ఆధ్యాత్మిక వర్గాలు పేర్కొంటున్నాయి.



పారిశ్రామికాభివృద్ధిలో మరో ముందడుగు

- ఓర్వకల్లులో ఆసియాలోనే అతిపెద్ద పానీయాల తయారీ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభంపై మంత్రి లోకేష్

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సంస్థ ఏర్పాటు చేసిన ఆసియాలోనే అతిపెద్ద పానీయాల తయారీ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభం కావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. శంకుస్థాపన జరిగిన కేవలం 12 నెలల్లోనే పరిశ్రమలో ఉత్పత్తి ప్రారంభం కావడం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు నిదర్శనంగా అభివర్ణించారు. ఈ ప్లాంట్‌లో కాంపా కోలా, పండ్ల రసాలు, ప్యాకేజ్డ్ తాగునీటి ఉత్పత్తి ప్రారంభమైందని లోకేష్ వెల్లడించారు. తరతరాల భారతీయుల జ్ఞాపకాలతో ముడిపడిన స్వదేశీ బ్రాండ్ కాంపా కోలా రాయలసీమ గడ్డపై పునర్జన్మ పొందుతోందని, ఇక్కడి నుంచి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు విస్తరించనుందన్నారు. అంతర్జాతీయ బ్రాండ్లతో పోటీపడే సత్తా స్వదేశీ సంస్థలకు ఉందని పేర్కొన్నారు. ఈ పరిశ్రమ ద్వారా స్థానికులకు 1,200 ప్రత్యక్ష ఉద్యోగాలు లభించనున్నాయని, రవాణా, వ్యవసాయం, అనుబంధ రంగాల్లోనూ మరిన్ని ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. నంద్యాలకు చెందిన మహేష్ హరి, కర్నూలుకు చెందిన ఆర్.కె. స్ఫూర్తి వంటి యువత తమ ప్రాంతంలోనే ప్రపంచస్థాయి పరిశ్రమలో ఉద్యోగాలు పొందడం ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగాల కోసం యువత ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా, ఉద్యోగాలే యువతను వెతుక్కుంటూ వచ్చేలా రాయలసీమను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌పై నమ్మకంతో భారీ పరిశ్రమను ఏర్పాటు చేసిన రిలయన్స్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపిన మంత్రి, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఇలాంటి మరిన్ని పారిశ్రామిక విజయగాథలు ఆవిష్కృతం కావాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.



గోదావరి పరివాహక జిల్లాలకు ఆస్తిగా పుష్కర పనులు

- భక్తుల సేవలకు మొబైల్ యాప్ - పనుల పురోగతికి డాష్‌బోర్డు
- రాజమహేంద్రవరంలో సూర్య భగవానుడు, బృహస్పతి ఆలయం
- వచ్చే ఏడాది ఏప్రిల్ 1నాటికి పుష్కర పనులు పూర్తి కావాలి
- **2027 గోదావరి పుష్కరాల నిర్వహణపై సీఎం చంద్రబాబు సమీక్ష**





గోదావరి పుష్కరాల కోసం చేపట్టే ప్రతి పని ఆయా జిల్లాలకు శాశ్వత ఆస్తిగా మిగలాలి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలి. పనుల నాణ్యతలో రాజీ పడొద్దు.. గడువులోగా పూర్తి చేయాలి. ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణహితంగా పుష్కరాలను నిర్వహించాలి. 2027 ఏప్రిల్ 1 నాటికి అన్ని పనులు పూర్తి కావాలి.

- సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి (చైతన్య రథం): గోదావరి పుష్కరాల నిర్వహణకు చేపడుతున్న పనులు ఆయా జిల్లాలకు శాశ్వత ఆస్తిగా మిగలాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు పనుల నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ వద్దని సీఎం తేల్చి చెప్పారు. 2027 గోదావరి పుష్కరాలకు దాదాపు 10నుంచి 12 కోట్లమంది భక్తులు పుణ్యస్నానాలకు వస్తారన్న అంచనాల నేపథ్యంలో దానికి అనుగుణంగా ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2027 జూన్ 26 నుంచి ప్రారంభమయ్యే మహాపర్వానికి దేశ విదేశాల నుంచి కోట్లమంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు, రవాణా, భద్రత, వైద్య సేవలు, పారిశుధ్యం తదితర అంశాలపై ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. 22 ప్రభుత్వ శాఖల పరిధిలో రూ.3,723.69 కోట్ల అంచనా వ్యయంతో 4,862 పనులను ప్రతిపాదించామని వివరించారు. వీటిలో ఇప్పటికే రూ.2,051.70 కోట్ల విలువైన 2,260 పనులకు పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు గోదావరి పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సీఎం ఆదేశించారు.

కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజల భాగస్వామ్యంతో పుష్కరాలను నిర్వహించాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు, యువత, మహిళా సంఘాలు, ఇతర సంస్థలను భాగస్వాములను చేయాలని నిర్దేశించారు. పుష్కర విధుల్లో పాల్గొనే సిబ్బందికి ముందుగానే శిక్షణ ఇవ్వడంతో పాటు వివిధ శాఖల మధ్య సమన్వయ సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. అన్ని శాఖలు జిల్లాల వారీగా పనుల పురోగతి, నిధుల వినియోగ వివరాలను ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పుష్కరాలు నిర్వహించే జిల్లాల్లో చేపడుతున్న పనులు ఆయా ప్రాంతాల అభివృద్ధికి అవకాశంగా చూడాలని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు గోదావరి పుష్కరాల ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని మరింత చాటేలా రాజమహేంద్రవరంలో రూ.1.8 కోట్లతో సూర్య భగవానుడు, బృహస్పతికి ఆలయం నిర్మించేందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు.

పుష్కరాల ప్రత్యేకత, గోదావరి నది గొప్పతనాన్ని చాటేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పుష్కరాల నిర్వహణకు ప్రజల నుంచి మంచి పేరు సూచనలు స్వీకరించడంతో పాటు ప్రత్యేక ప్రచార గీతాలను రూపొందించాలని చెప్పారు. గోదావరి నదీ హారతి, సామూహిక కూచిపూడి నృత్య ప్రదర్శన, భారీ దీపాలంకరణ, గోదావరి ముగ్గు, సామూహిక యోగా వంటి కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు.

ఘాట్లలో మౌలిక సదుపాయాల కల్పన


ఇంకా పుష్కరాలకు 217 రోజుల సమయమే ఉన్నందున పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని 440 ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దాదాపు రూ.649.70 కోట్ల విలువైన 659 పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. ఇప్పటికే రూ.25.53 కోట్ల విలువైన పనులు పూర్తయినట్టు తెలిపారు. తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ, వ్యర్థాల తొలగింపు, తాగునీరు, లైటింగ్ తదితర అవసరాల కోసం రూ.464 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్టు వివరించారు. వైదిక ఆచారాలకు అనుగుణంగా ఘాట్ల అభివృద్ధి, భక్తుల వసతి, పార్కింగ్, ఇతర మౌలిక సదుపాయాలపైనా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. పుష్కరాల సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ రహదారులను అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు 268.12 కిలోమీటర్ల మేర బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. రూ.300 కోట్లతో 78 రహదారుల అభివృద్ధి పనులు చేపట్టగా.. 2027 ఏప్రిల్ నాటికి పూర్తవుతాయని అధికారులు తెలిపారు. పట్టిసీమ నుంచి పోలవరం వరకు, కొవ్వూరు నుంచి ధవళేశ్వరం వరకు, పోలవరం లెఫ్ట్ బండ్‌పై రహదారుల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పోలవరం ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన అనుమతులు తీసుకుని పనులు ప్రారంభించాలని సూచించారు.

4 వేల ప్రత్యేక బస్సులు.. 1,560 రైళ్లు

భక్తుల రవాణా అవసరాలకు 4,000 ప్రత్యేక బస్సులు, 649 గ్రీన్ బస్సులు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. పుష్కరాల సమయంలో 1,560 ప్రత్యేక రైళ్వే సర్వీసులు నిర్వహించేందుకు రైల్వే శాఖ ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో అదనపు ప్లాట్‌ఫారం, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. పుష్కరాలు జరిగే జిల్లాల్లో ప్రత్యేక సబ్సిడీతో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేలా చూడాలని సీఎం సూచించారు. దేశవ్యాప్తంగా వచ్చే భక్తులను ఆకట్టుకునేలా విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం విమానాశ్రయాలను సుందరీకరించాలని ఆదేశించారు. పుష్కరాల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఆధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం స్పష్టం చేశారు. దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులకు 135భాషల్లో సమాచారం అందించేలా ఏఐ ఆధారిత చాట్‌బాట్ వ్యవస్థతో పాటు వర్చువల్ రియాలిటీ, డిజిటల్ స్క్రీన్‌లను కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. మహా కుంభ మేళా నిర్వహణలో అనుసరించిన మెరుగైన విధానాలను అధ్యయనం చేసి గోదావరి పుష్కరాల్లోనూ అమలు చేయాలని సీఎం సూచించారు. భక్తులకు అవసరమైన సమాచారం, రవాణా, వసతి, ఘాట్లు, వైద్య సేవల వివరాలు సులభంగా అందేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలన్నారు.

పుష్కరాల సమయంలో అత్యవసర వైద్య సేవల కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో అదనంగా 100 పడకలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అంబులెన్సులు, వైద్య బృందాలు, అత్యవసర చికిత్సా కేంద్రాలను కూడా నియమించేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల సేవలను సమన్వయం చేసుకోవడంతో పాటు మొబైల్ ఆసుపత్రులను కూడా అందుబాటులో ఉంచాలని సీఎం అన్నారు. భక్తులు తాగునీరు, ఆహారం విషయంలో అప్రమత్తంగా ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. గోదావరి పుష్కరాల కంటే ముందే సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ఆధునికీకరణ, అభివృద్ధి పనులను 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. పోలవరం ప్రాజెక్టు పనులను కూడా పుష్కరాలకు ముందే పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

రాజమహేంద్రవరం–పోలవరం మధ్య 40 కిలోమీటర్ల జలమార్గంలో ఆరు ఫ్లోటింగ్ పంటూన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. జూన్ నెలలో సాధారణంగా గోదావరిలో ఉండే నీటి ప్రవాహాలపై ముందుగానే అంచనాలు రూపొందించి, అందుకు అనుగుణంగా ఘాట్ల వద్ద భద్రతా ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. గోదావరి పుష్కరాలను పర్యావరణ హితంగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించడం, గోదావరి జలాల పవిత్రత కాపాడటం, పునరుత్పాదక ఇంధనాన్ని వినియోగించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. పుష్కరాలు జరిగే జిల్లాల్లోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక టూరిజం సర్క్యూట్ రూపొందించి ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమీక్షకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



అమరావతిని గ్లోబల్ క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దుతాం

- ఏసీఎన్‌యూలో నీల్‌ఐటీ ట్రాన్సిట్ క్యాంపస్ ప్రారంభంపై సీఎం చంద్రబాబు హర్షం

అమరావతి (చైతన్య రథం): అమరావతిని అంతర్జాతీయ స్థాయి క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక ముందడుగు పడిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నీల్‌ఐటీ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ట్రాన్సిట్ క్యాంపస్ ప్రారంభం కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నీల్‌ఐటీ యాజమాన్యానికి, అధ్యాపకులకు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రత్యేకంగా అంకితమైన తొలి విశ్వవిద్యాలయ క్యాంపస్‌లలో ఒకటి ఆంధ్రప్రదేశ్‌లో రూపుదిద్దుకోవడం చారిత్రాత్మక మైలురాయని సీఎం అభివర్ణించారు. అమరావతిని గ్లోబల్ క్వాంటం వ్యాలీగా మార్చడంతో పాటు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలతో యువతను తీర్చిదిద్దేందుకు ఈ క్యాంపస్ దోహదపడుతుందని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

చైతన్యరథం





కూటమి పాలనలో పల్లెల్లో వెలుగులు

- వైసీపీ పాలనలో అంధకారంలో పల్లెలు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మౌలిక సదుపాయాల కల్పన ఎంత ముఖ్యమో ప్రజలకు రాత్రివేళ భద్రతతో కూడిన వెలుగులు అందించడం కూడా అంతే ముఖ్యం. పల్లెల్లో ప్రతి వీధి వెలిగితేనే ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, మహిళలకు భద్రత, రాకపోకలకు సౌకర్యం కలుగుతాయి. ఈ లక్ష్యంతో గతంలో తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన ఎల్ఈడీ వీధి దీపాల ప్రాజెక్టు గ్రామీణ ప్రాంతాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహణ, బిల్లుల చెల్లింపుల విషయంలో నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాజెక్టు క్రమంగా నిర్వీర్యమైంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి తెరదించుతూ బకాయిలను చెల్లించి గ్రామీణ ప్రాంతాల్లో మళ్లీ వెలుగులు నింపేందుకు చర్యలు చేపట్టింది.

2014-19 మధ్య గ్రామాల్లో ఎల్ఈడీ వెలుగులకు శ్రీకారం

2014లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ ం ఆధ్వర్యంలోని ఇంధన సామర్థ్య సేవల సంస్థ (ఈఈఎస్ఎల్) సహకారంతో గ్రామాల్లో ఎల్ఈడీ వీధి దీపాల ప్రాజెక్టును ప్రారంభించారు. అప్పటి గ్రామీణ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 23 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఏటా సుమారు 250 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అయ్యింది. 2018 ఆగస్టులో గోదావరి జిల్లాల్లో వరదల అనంతరం 2.80 లక్షల ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటుచేసి దశలవారీగా ఇతర జిల్లాల్లోనూ అమలు చేశారు. ఈ ప్రాజెక్టు కారణంగా గ్రామాల్లో వీధులు వెలుగులతో నిండడమే కాకుండా విద్యుత్ ఖర్చులు తగ్గి గ్రామీణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి.

2019-24 వైసీపీ పాలనలో వెలుగులకు గ్రహణం

2019లో వైసీపీ అధికారంలోకి రాగానే పల్లెలు అంధకారంలోకి వెళ్లిపోయాయి. టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన ఎల్ఈడీ వీధి దీపాల ప్రాజెక్టును పూర్తిగా నీర్వర్యం చేసింది. ఈఈఎస్ఎల్‌కు చెల్లించాల్సిన బిల్లులను సక్రమంగా చెల్లించకపోవడంతో సంస్థకు బకాయిలు పేరుకుపోయాయి. గ్రామాల్లో ఎక్కడైనా ఎల్ఈడీ వీధి దీపాలు మరమ్మతులకు గురైతే వాటిని బాగు చేయించే పరిస్థితి లేకుండా పోయింది. 2028 డిసెంబరు వరకు కొనసాగాల్సిన ఒప్పందం ఉన్నప్పటికీ బిల్లుల చెల్లింపుల్లో నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు నిర్వహణ దెబ్బతింది. ఫలితంగా ఒకప్పుడు ఎల్ఈడీ వెలుగులతో కళకళలాడిన గ్రామీణ వీధులు మళ్లీ చీకటిమయంగా మారాయి. ప్రజలు రాత్రివేళ రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులకు భద్రతాపరమైన సమస్యలు తలెత్తాయి.



2024-26 కూటమి ప్రభుత్వంలో మళ్లీ వెలుగులు

2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాధాన్యమిచ్చింది. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన సుమారు రూ.600 కోట్ల బకాయిలను ఈఈఎస్ఎల్‌కు చెల్లించడం ద్వారా నిలిచిపోయిన ప్రాజెక్టుకు తిరిగి జీవం పోసింది. ఈఈఎస్ఎల్ బకాయిలను చెల్లించడంతో పాటు,వీధి దీపాల నిర్వహణ ప్రాజెక్టు పునరుద్ధరణపై దృష్టి సారించింది. పనిచేయని పాత వీధి దీపాలకు మరమ్మతులు చేయించడం, అవసరమైన ప్రాంతాల్లో కొత్త ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేయడం, పంచాయతీల్లో వీధి దీపాల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించింది. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మళ్లీ ఎల్ఈడీ వెలుగులు విరజిమ్మేలా కూటమి ప్రభుత్వం ముందడుగు వేసింది.

గ్రామీణ అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, డ్రైనేజీలు, భవనాల నిర్మాణం మాత్రమే కాదు.. ప్రతి గ్రామంలోని ప్రతి వీధి వెలుగులతో నిండడం కూడా అభివృద్ధిలో కీలకమైన భాగమే. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభించిన ఎల్ఈడీ వీధి దీపాల ప్రాజెక్టు గ్రామీణ ప్రాంతాల్లో మంచి మార్పునకు నాంది పలికింది. అయితే వైసీపీ పాలనలో నిర్వహణ నిర్లక్ష్యం, బకాయిల చెల్లింపుల్లో జాప్యం కారణంగా ఆ వెలుగులు మసకబారాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సుమారు రూ.600 కోట్ల బకాయిలను చెల్లించి ప్రాజెక్టు పునరుద్ధరణకు చర్యలు చేపట్టడం ద్వారా గ్రామీణాభివృద్ధిపై తన చిత్తశుద్ధిని చాటుతోంది. పల్లెల్లో ప్రతి వీధి వెలగాలి.. ప్రతి ఇంటికి భద్రత కలగాలి.. ప్రతి గ్రామం అభివృద్ధి బాటలో ముందుకు సాగాలి అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులేస్తుంది.



మంగినపల్లి ఎలీషా, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి

- **జీవనోపాధి కల్పిస్తూ అభ్యున్నతి బాటలో నడిపించేలా తోడ్పాటు**
- **ఆక్వా రంగాన్ని బలోపేతం చేసి బ్లూ ఎకానమీలో దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతున్నాం**
- **మత్స్యకార దినోత్సవం సందర్భంగా శు భాకాంక్షలు తెలిపిన మంత్రి కొల్లు రవీంద్ర**

అమరావతి (చైతన్యరథం): మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సయిజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని మత్స్యకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. మత్స్యకారులకు 50 సంవత్సరాలకే పెన్షన్, వేట నిషేధ సమయంలో భృతి ప్రకటించిన ఘనత సీఎం నారా చంద్రబాబు నాయుడుదేనన్నారు. వేట నిషేధ భృతిని ఇప్పుడు ఏకంగా రూ. 20 వేలు అందించడం మత్స్యకారుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన వారికి నెల రోజుల్లోపే డెత్ సర్టిఫికెట్ అందించి, ఆర్థిక సాయం అందిస్తున్నాం. మత్స్యకారుల హక్కుల్ని హరించేలా చెరువులు, రిజర్వాయర్లను హస్తగతం చేసుకునేలా గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో నెం. 217ను.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రద్దు చేశాం.



మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ అందిస్తున్నాం. ఆక్వా రంగానికి రూ. 1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తున్నాం. ఆక్వా రంగాన్ని బలోపేతం చేసి బ్లూ ఎకానమీలో దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతున్నాం. వైసీపీ ఐదేళ్ల పాలనలో మత్స్యకారుల సంక్షేమాన్ని, అభివృద్ధిని నాశనం చేశారు. సంక్షేమం మాటున వారి జీవితాలను బుగ్గి చేయాలని ప్రయత్నించారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చాక ప్రతి ఒక్కరికీ మెరుగైన సంక్షేమం అందిస్తున్నాం. అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నాం. మత్స్యకారులు వేటపై మాత్రమే ఆధాపడకుండా.. మత్స్య ఉత్పత్తుల్ని ప్రాసెస్ చేసి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తున్నాం. తాజాగా సీ వీడ్ తయారీలో కూడా మత్స్యకార మహిళలకు శిక్షణ అందించేలా చర్యలు చేపట్టామని మంత్రి రవీంద్ర తెలిపారు.





అనిరుధ్ -కావ్య మారన్ రిసెప్షన్‌కు
హాజరైన మంత్రి లోకేష్ కుటుంబం

చెన్నై (చైతన్య రథం): ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు సీఈఓ కావ్య మారన్‌ల వివాహ రిసెప్షన్ వేడుక చెన్నైలో వైభవంగా జరిగింది. వేడుకకు ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. సతీమణి బ్రాహ్మణి, తనయుడు దేవాన్ష్‌తో కలిసి వేడుకకు విచ్చేశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ దంపతులు నూతన వధూవరులు అనిరుధ్, కావ్య మారన్‌లకు పుష్పగుచ్ఛాలు అందజేసి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, నిండు నూరేళ్లపాటు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం వేడుకకు హాజరైన తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, సూపర్‌స్టార్ రజనీకాంత్‌లను నారా లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ



సందర్భంగా రజనీకాంత్, లోకేష్‌తో ఆప్యాయంగా ముచ్చటించారు. ఇరువురూ పరస్పరం యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ చిరునవ్వులు చిందించారు. అలాగే మాజీ మంత్రి ఉదయనిధి స్టాలిన్‌తోనూ నారా లోకేష్ కరచాలనం చేసి పలకరించారు. ప్రముఖ సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరైన వేడుకలో నారా లోకేష్ కుటుంబ సభ్యుల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.









పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన

- గ్రంథాలయాల డిజిటలైజేషన్‌కు చర్యలు
- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ
- నెల్లూరు గ్రంథాలయాన్ని పరిశీలించిన మంత్రి
- కొత్త భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచన

నెల్లూరు (చైతన్యరథం): గ్రంథాలయాల డిజిలైజేషన్ ప్రక్రియను ముందుకు తీసుకెళతామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని స్టోన్ హౌస్ పేట గ్రంథాలయాన్ని మంత్రి నారాయణ శనివారం పరిశీలించారు. 1952లో ఏర్పాటైన ఈ గ్రంథాలయం సుమారు 120 ఏళ్లకు పైగా పురాతన నిర్మాణంతో కూలిపోయే స్థితికి చేరడం, ఇటీవల పెచ్చులు ఊడిపడటంతో భవన పరిస్థితిపై మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శాంతికుమారి, కమిషనర్, మేయర్‌తో కలిసి పలు అంశాలపై చర్చించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. జిల్లాలో మున్సిపాలిటీలు,



పంచాయతీలలో గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3లుగా ఈ గ్రంథాలయానికి అనుబంధంగా మొత్తం 61 శాఖలు ఉన్నాయన్నారు. ఇక్కడ పోటీ పరీక్షల కోసం చదివే విద్యార్థుల సంఖ్య పెరుగుతుండగా, గత ఏడాది వివిధ పోటీ పరీక్షల్లో 41 మంది అభ్యర్థులు సెలెక్ట్ అయ్యారని-వీరిలో 22 మంది టీచర్లు, 17 మంది పోలీసులు, ఇద్దరు గ్రూప్-2, ముగ్గురు ఎస్ఎస్సీకి ఎంపికయ్యారని వెల్లడించారు. చైర్‌పర్సన్ అభ్యర్థన మేరకు శిథిలావస్థకు చేరిన భవనాన్ని పరిశీలించామని, దీన్ని కూల్చివేయాలా లేక వినియోగించవచ్చా అనే దానిపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించామన్నారు. గూడూరు, కావలి మున్సిపల్ ఎన్నికల తర్వాత తనిఖీ చేస్తారని, భవనం పనికిరాని పక్షంలో కూలగొట్టి వెనుక వైపు అసంపూర్తిగా ఉన్న నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదివి విజ్ఞాన సముపార్జనతో పాటు.. చరిత్రను తెలుసుకుని మంచిని తీసుకుని చెడును పక్కన పెట్టగలగాలన్నారు. నేటి యువత అంతా డిజిటల్ వైపు ఉన్నందున పుస్తకాలతో పాటు గ్రంథాలయంలో డిజిటలైజేషన్ వ్యవస్థను కూడా అభివృద్ధి చేయాలని ఆదేశించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్‌గా ఎన్నికైన రూప్‌కుమార్ యాదవ్, కమిషనర్ నందన్, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, 16వ డివిజన్ కార్పొరేటర్ కమ్మ కళ్యాణి, పలువురు కార్పొరేటర్లు, గ్రంథాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చెన్నై (చైతన్య రథం): రాజ్యసభ సభ్యుడు, డీఎండీకే పార్టీ కోశాధికారి ఎల్.కే. సుధీష్, ఎల్కేఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ పూర్ణ జ్యోతి సుధీష్ దంపతుల కుమార్తె వివాహ రిసెప్షన్ వేడుకకు ఏపీ విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. చెన్నైలోని ఆర్కే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వేడుకలో పాల్గొన్న మంత్రి లోకేష్, నూతన వధూవరులు డాక్టర్ జన్ను శ్రీ సుధీష్, అఖిల్ రవి కుమార్‌లకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. నూతన దంపతులను ఆశీర్వదించారు.

డీఎండీకె నేత సుధీష్ కుమార్తె

వివాహ రిసెప్షన్‌కు హాజరైన లోకేష్



పులివెందుల చేజారిపోయిందన్న...

నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న జగన్

- **మేకపోతు గాంభీర్యంతో అధికారులను బెదిరిస్తూ సొంత మీడియాలో సీనియర్ అధికారుల ఫోటోలు ప్రచురించి బ్లాక్ మెయిల్ చేయడం సబబా?**
- **సొంత చెల్లిని యలహంక ప్యాలెస్‌లోకి అడుగు పెట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించడం ఓ అన్నగా జగన్‌కు తగునా?**
- **ఎన్ని కుప్పిగంతులు వేసినా జగన్‌కు తిరిగి అధికారం కలే : ఎమ్మెల్సీ వర్ల రామయ్య**

అమరావతి (చైతన్యరథం): నదిలో కొట్టుకుపోతున్న వ్యక్తి ప్రాణాలు కాపాడుకోవడానికి చేతికి ఏది దొరికితే దాన్ని పట్టుకుని బయటపడాలని ప్రయత్నించినట్లుగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా రాజకీయంగా ఉనికి కాపాడుకోవడానికి ఏది పడితే అది పట్టుకుని ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఎద్దేవా చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి జగన్ వ్యవహారశైలి చూస్తుంటే ఏం చేయాలో, ఏం మాట్లాడాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నట్లుగా కనిపిస్తోందన్నారు. ఎన్నికల్లో ప్రజల మద్దతు లభించకపోవడం, వైసీపీ అభ్యర్థులు పోటీ చేసేందుకు కూడా ముందుకు రాకపోవడం, పోటీ చేసిన చోట్ల ప్రజల నుంచి ఆదరణ లేకపోవడంతో జగన్ నిరాశ, నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ఫలితాలు వైసీపీకి ప్రతికూలంగా వస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని విమర్శించారు. ఈ నిరాశ, నిస్పృహల్లో భాగంగానే జగన్ బృందం గవర్నర్‌ను కలిసిందని వర్ల రామయ్య అన్నారు. అయితే గవర్నర్‌ను కలిసిన వైసీపీ నేతలు.. ఎన్నికల సంఘానికి వారు ఇచ్చిన నివేదికలు తప్పుడువని అధికారులు గుర్తించినందునే చర్యలు తీసుకోలేదని వివరించి ఉంటే బాగుండేదన్నారు.

నామినేషన్లు అడ్డుకున్నారంటున్నారు.. ఎక్కడ? ఎప్పుడు? ఎవరు అడ్డుకున్నారు? జగన్ చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం స్పష్టత లేదని వర్ల రామయ్య అన్నారు. ఇప్పటికీ నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని పదేపదే చెబుతున్నారని, అసలు ఏ గ్రామంలో అడ్డుకున్నారు? ఏ అభ్యర్థిని అడ్డుకున్నారు? ఎవరు అడ్డుకున్నారు? ఏ సమయంలో ఈ ఘటన జరిగింది? అప్పట్లో అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు ఎవరు? ఏ నామినేషన్ దాఖలు కేంద్రంలో అభ్యర్థులను అడ్డుకున్నారో కనీసం ఒక్క ఘటననైనా ఆధారాలతో వివరించగలరా? బాధితులెవరు? ఫిర్యాదు ఎక్కడ చేశారు? అన్న వివరాలేవీ బయటపెట్టకుండా అడ్డుకున్నారు.. అడ్డుకున్నారు అంటూ గాలిలో ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జరిగిన ఘటనలను ఆధారాలతో చూపించకుండా పదేపదే ఆరోపణలు చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించలేరని వర్ల రామయ్య స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియను అధికారులు, ఎన్నికల సంఘం నిశితంగా పరిశీలిస్తున్న నేపథ్యంలో వైసీపీ చేస్తున్న రాజకీయ డ్రామాలు, తప్పుడు ఫిర్యాదులు బయటపడుతున్నాయన్నారు. ప్రజల తీర్పును గౌరవించకుండా, ఎన్నికల్లో ఎదురవుతున్న పరాజయాలను అంగీకరించలేక ప్రభుత్వంపై, పోలీసులపై, ఎన్నికల సంఘంపై నిందలు వేయడం జగన్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. గవర్నర్‌ను కలిసే ముందు వారి ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు సిద్ధం చేసుకోవాలనే కనీస స్పృహ కూడా జగన్‌కు లేదని, కేవలం రాజకీయ ప్రచారం కోసం రాజ్యాంగబద్ధమైన పదవులను వేదికగా చేసుకోవద్దని వర్ల రామయ్య హితవు పలికారు.



శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకే డ్రామాలు

పులివెందుల నియోజకవర్గంలో జరుగుతున్న ఎన్నికల సందర్భంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అనుసరిస్తున్న తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శాంతియుతంగా జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడానికి, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి వారు ఆడుతున్న "మాయ నాటకాలను" ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందనే ఉద్దేశంతో పోలీసులు పులివెందులలోని ఎంపీ అవినాష్ రెడ్డి నివాసానికి వెళ్లి, బయటకు రావద్దని రాతపూర్వక నోటీసులు ఇచ్చి సంతకం తీసుకున్నారని వర్ల రామయ్య తెలిపారు. అయితే ఎంపీగా చట్టాలను గౌరవిస్తారని పోలీసులు భావిస్తే, వారు వెళ్ళిన పావుగంటలోనే అవినాష్ రెడ్డి 5 కార్లతో బయలుదేరి, క్రమంగా 35 కార్ల కాన్వాయ్‌తో సింహాద్రిపురం వైపు వెళ్లారని ఆయన వివరించారు. పోలీసులు కాన్వాయ్‌ను నిలువరించిన సమయంలో, తమపై పెట్రోల్ బాంబులు, ఐరన్ రాడ్లు, కర్రలతో హత్యాయత్నం జరిగిందని, త్రుటిలో ప్రాణాపాయం నుండి తప్పించుకున్నామని వారి సొంత ఛానెల్ ద్వారా ప్రచారం చేసుకున్నారని వర్ల రామయ్య ఆరోపించారు. కానీ ఘటనా స్థలం ఎక్కడో చెప్పాలని పోలీసులు అడిగితే "మీరే ఏదో ఒకటి రాసుకోండి, నేను ఫిర్యాదు ఇవ్వను" అని అవినాష్ రెడ్డి చెప్పినట్లు పులివెందుల డీఎస్పీ స్వయంగా ప్రకటించారని వర్ల రామయ్య గుర్తు చేశారు. వాస్తవానికి అక్కడ కనీసం ఒక చిన్న రాయి కూడా పడలేదని పోలీసులు స్పష్టం చేశారని, ఈ విషయాన్ని గవర్నర్ దృష్టికి జగన్ మోహన్ రెడ్డి తీసుకెళ్లగలరా అని ఆయన ప్రశ్నించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా దొంగ కేసులు పెట్టాలని పోలీసులపై ఒత్తిడి తేవడం సరికాదన్నారు. ఇలా పదేపదే అబద్ధపు ప్రచారాలు చేస్తే 'నాన్న పులి' కథలాగా మారి, భవిష్యత్తులో నిజంగా ఏదైనా జరిగినా ఎవరూ నమ్మని పరిస్థితి వస్తుందని ఆయన హితవు పలికారు.

పులివెందులలో గత 40 ఏళ్లుగా ఎన్నడూ లేని విధంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా బయటకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వర్ల రామయ్య పేర్కొన్నారు. ఎట్టకేలకు తమ ఓటు తాము వేసుకునే స్వేచ్ఛ లభించిందని, వైఎస్ కుటుంబ అరాచకాలకు తెరపడిందని భావించిన పులివెందుల ప్రజలు ఆ రోజు నిజమైన దీపావళి పండుగను జరుపుకున్నారని ఆయన అన్నారు. ప్రజలు 151 సీట్ల నుండి 11 సీట్లకు పరిమితం చేసినా జగన్ మోహన్ రెడ్డిలో మార్పు రాలేదని విమర్శించారు. "ఒక్క ఛాన్స్" పేరుతో ప్రజలను మోసం చేశారని, ఇప్పుడు రెండేళ్ల తర్వాత మళ్లీ వస్తామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు మళ్లీ ఆయనకు అధికారం ఇచ్చే పరిస్థితి లేదని, కేవలం మిగిలిన కొద్దిపాటి క్యాడర్ చేజారిపోకుండా ఉండేందుకే "మళ్లీ వస్తాం" అంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఎవరి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని ఆయన సూచించారు. నిరాశ నిస్పృహలతో ఆయన ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని వర్ల రామయ్య పేర్కొన్నారు.

ప్రభుత్వ అధికారులను బ్లాక్ మెయిల్ చేయడం తగదు..

ప్రభుత్వ అధికారులను బెదిరించే ధోరణిలో జగన్ రెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్ మోహన్ రెడ్డి, ఇప్పుడు "రెండేళ్లలో మేము వస్తాం, మాకు వ్యతిరేకంగా పనిచేసిన వారి సంగతి తేలుస్తాం" అంటూ ప్రభుత్వ అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. సొంత పత్రిక, ఛానల్‌లో సీనియర్ అధికారులు చెరుకూరి శ్రీధర్, నచికేత్ విశ్వనాథ్, కోయ ప్రవీణ్, ప్రద్యుమ్న, మహేష్ చంద్ర లడ్డా, డీజీపీ, ఎస్ఈసీలపై "గుండెలు తీసిన పచ్చ బంట్లు" అంటూ తప్పుడు కథనాలు రాయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. గవర్నర్‌ను కలిసి ఈ కథనాలను చూపించే ధైర్యం జగన్ మోహన్ రెడ్డికి ఉందా అని ఆయన ప్రశ్నించారు. పులివెందులలో 40 ఏళ్లుగా నిర్మించుకున్న అక్రమ కోటను ప్రజలు ఓటు అనే ఆయుధంతో కూల్చేశారని వ్యాఖ్యానించారు. ఆ ఓటమి తాలూకు నిరాశ, నిస్పృహలతోనే జగన్ మోహన్ రెడ్డి ఇలాంటి తప్పుడు రాతలు రాయిస్తున్నారని అన్నారు.

సొంత చెల్లెలిపైనే కోర్టుకెక్కడం జగన్ నైజానికి నిదర్శనం

మరోవైపు సొంత చెల్లెలు వైఎస్ షర్మిలను బెంగళూరులోని బంగ్లాలోకి రానివ్వకుండా అడ్డుకునేందుకు కోర్టును ఆశ్రయించారని వర్ల రామయ్య తప్పుబట్టారు. బెంగళూరు సమీపంలోని దేవనహళ్లి సీనియర్ సివిల్ జడ్జ్ అండ్ జేఎంఎఫ్‌సీ కోర్టులో జగన్ మోహన్ రెడ్డి తన చెల్లెలు షర్మిలపై దావా వేశారని వర్ల రామయ్య ఆ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ నెల 20న ఫైల్ అయిన ఈ ఒరిజినల్ సూట్ (ఫైలింగ్ నెం. 1525/2026, రిజిస్ట్రేషన్ నెం. 1509/2026, సీఎన్ = నెం. కేఏబీ =310019262026) 21న రిజిస్టర్ అయిందని ఆయన తెలిపారు. బెంగళూరులోని యలహంక బంగ్లాలోకి తన చెల్లెలు షర్మిల అడుగుపెట్టకుండా నిరోధించాలని కోరుతూ జగన్ మోహన్ రెడ్డి ఈ కేసు వేశారని వివరించారు.

దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన ఆ బంగ్లాలో, తన కుమార్తె వివాహ వేడుకలు నిర్వహించుకోవడానికి షర్మిల ప్రయత్నించగా, మేనమామ అయిన జగన్ మోహన్ రెడ్డి అందుకు ససేమిరా అనడమే కాకుండా కోర్టుకు వెళ్లడం ఆయన వ్యవహారశైలికి అద్దం పడుతోందని విమర్శించారు. మన తెలుగు సంస్కృతిలో మేనకోడలి పెళ్లిని సొంత కూతురి వివాహం కంటే ఘనంగా నిర్వహిస్తారని గుర్తు చేశారు. కానీ, జగన్ మోహన్ రెడ్డి తన మేనకోడలి పెళ్లికి బెంగళూరులోని ఇంట్లోకి రానివ్వనని చెప్పడమే కాకుండా, ఏకంగా చెల్లెలు షర్మిల ఇంట్లో అడుగుపెట్టకుండా కోర్టులో కేసు వేయడం బాధాకరమన్నారు. సొంత చెల్లెలి పట్ల ఇలా వ్యవహరించే వ్యక్తి, రాష్ట్రంలోని మిగతా అక్కచెల్లెళ్లను ఏ విధంగా గౌరవిస్తారని ప్రజలు ఆలోచించాలని ఆయన కోరారు.

నాయకుల ప్రతి చర్య ప్రజల పరిశీలనలోనే

ప్రజా జీవితంలో ఉన్న నాయకుల వ్యవహారశైలి సమాజానికి ఆదర్శంగా ఉండాలన్నారు. సాధారణ వ్యక్తులు ఇంట్లో ఏం చేసినా ఎవరూ పట్టించుకోరని, కానీ ప్రజాప్రతినిధులుగా ఉన్న వారి ప్రతి అడుగు పబ్లిక్ డొమైన్‌లోనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల్లో ఎన్టీ రామారావు, ఇందిరా గాంధీ వంటి మహామహులే ఎన్నికల్లో ఓడిపోయారని, కానీ వారు ఎప్పుడూ ఇలా నిరాశా నిస్పృహలతో వ్యవహరించలేదని వర్ల రామయ్య పేర్కొన్నారు. పులివెందుల ప్రజలు నిరాకరించారనే అసహనంతో జగన్ మోహన్ రెడ్డి ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు.

మత్స్యకారులకు భరోసా.. ఆక్వా రంగానికి కొత్త ఊపు!

- గంగపుత్రుల సంక్షేమానికి పెద్దపీట.. హక్కుల పరిరక్షణకు కట్టుబడిన కూటమి ప్రభుత్వం
- మత్స్యకారుల సేవలో పథకం ద్వారా 1.34 లక్షల కుటుంబాలకు రూ.268.60 కోట్ల సాయం
- జీవో 217 రద్దుతో మత్స్యకార సహకార సంఘాల హక్కులకు రక్షణ
- ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే
- ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద రూ.2,328.89 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు
- మత్స్యరంగంలో 5.23 లక్షల యూనిట్లు మంజూరు.. 4.58 లక్షల యూనిట్ల అమలు ప్రారంభం
- చిన్న మత్స్య పరిశ్రమలకు రూ.2 కోట్ల వరకు గ్రాంట్‌కు అవకాశం
- ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): అలలతో పోరాటం.. ఆటుపోట్లతో సహవాసం.. ప్రాణాలను పణంగా పెట్టి సాగించే వేట.. రెక్కల కష్టాన్నే నమ్ముకుని జీవించే గంగపుత్రుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని మత్స్యకారులు, ఆక్వా రైతులు, మత్స్యరంగంపై ఆధారపడిన కుటుంబాలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రానికి ఉన్న 1,053 కిలోమీటర్ల సముద్ర తీరం అపారమైన మత్స్య సంపదకు నిలయమని, లక్షలాది కుటుంబాలకు జీవనాధారమని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మత్స్యకారుల సంక్షేమం, ఆక్వా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

వేట నిషేధ సమయంలో రూ.268.60 కోట్ల ఆర్థిక భరోసా

వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయే మత్స్యకారులకు గతంలో రూ.10 వేలుగా ఉన్న సహాయాన్ని రూ.20 వేలకు పెంచామని మంత్రి తెలిపారు. 'మత్స్యకారుల సేవలో' పథకం ద్వారా 2026-27లో తొలి విడతగా 1,28,388 కుటుంబాలకు రూ.256.776 కోట్లు విడుదల చేయగా, రెండో విడతలో మరో 5,910 కుటుంబాలకు రూ.11.82 కోట్లు మంజూరు చేశామన్నారు. మొత్తంగా 1,34,298 కుటుంబాలకు రూ.268.60 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించేలా చర్యలు చేపట్టామని వివరించారు. సంప్రదాయ మత్స్యకారుల హక్కులను దెబ్బతీసిన జీవో 217ను రద్దు చేసి సహకార సంఘాల ప్రయోజనాలను పరిరక్షించామని చెప్పారు. మత్స్యకారుల జీవనోపాధికి భంగం కలిగించే నిర్ణయాలను సహించబోమని స్పష్టం చేశారు.

ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ.. పెట్టుబడి భారం తగ్గింపు

రాష్ట్రంలో సుమారు 2.16 లక్షల మంది రైతులు 5.79 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారని మంత్రి తెలిపారు. అర్హులైన నమోదిత రైతులకు జోన్, నాన్ జోన్ పరిమితులతో సంబంధం లేకుండా యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందించే నిర్ణయం తీసుకున్నామన్నారు. మత్స్యకారుల పడవలకు లీటరు డీజిల్‌పై రూ.9 రాయితీ అందిస్తున్నామని, 2026-27 బడ్జెట్‌లో ఇందుకోసం రూ.52 కోట్లు కేటాయించామని చెప్పారు. 200 యాంత్రిక పడవలను 60 శాతం రాయితీతో అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన నిర్ణయాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు.

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనతో అభివృద్ధి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్) కింద రాష్ట్రంలో రూ.2,328.89 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.681.38 కోట్లని చెప్పారు. పథకంలోని 41 రకాల కార్యక్రమాల ద్వారా 5,23,269 యూనిట్లు మంజూరు కాగా, 4,58,139 యూనిట్ల అమలు ప్రారంభమైందన్నారు. జీవనోపాధి, పోషకాహార సహాయానికి సంబంధించిన 4,42,720 యూనిట్లతో పాటు 776 ఐస్ బాక్స్ మోటారు సైకిళ్లు, 2,269 మినీ ఫిష్ కియోస్క్‌లు, 8,144 కమ్యూనికేషన్, ట్రాకింగ్ పరికరాల యూనిట్ల అమలు ప్రారంభమైనట్లు వివరించారు. మిగిలిన యూనిట్లను వేగవంతం చేస్తామని తెలిపారు. మత్స్య ఉత్పత్తుల నిల్వ, రవాణా, మార్కెటింగ్ కోసం 3 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, 16 కోల్డ్ స్టోరేజీ, ఐస్ ప్లాంట్లు, 5 మేత తయారీ ప్లాంట్లు, ఒక సమగ్ర ఆక్వా పార్కు వంటి ప్రాజెక్టులకు ఆమోదం లభించిందన్నారు. వీటి ద్వారా మత్స్యకారులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని చెప్పారు.

చిన్న మత్స్య పరిశ్రమలకు రూ.2 కోట్ల వరకు గ్రాంట్

ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ యోజన (పీఎం-ఎంకేఎస్ఎస్‌వై) కింద దేశవ్యాప్తంగా రూ.6 వేల కోట్ల అంచనా వ్యయంతో మత్స్యరంగ అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తున్నారని మంత్రి తెలిపారు. అర్హత కలిగిన సూక్ష్మ పరిశ్రమలకు 25 శాతం లేదా గరిష్ఠంగా రూ.35 లక్షలు, ఎస్సీ, ఎస్టీ, మహిళల యాజమాన్యంలోని సూక్ష్మ పరిశ్రమలకు 35 శాతం లేదా రూ.45 లక్షల వరకు పనితీరు ఆధారిత గ్రాంట్‌కు అవకాశం ఉందన్నారు. చిన్న పరిశ్రమలకు కేటగిరీని బట్టి రూ.75 లక్షల నుంచి రూ.కోటి వరకు, మత్స్య సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాల సమాఖ్యలు, మత్స్య రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు గ్రాంట్ పొందే అవకాశం ఉందని వివరించారు.

మత్స్యకారుల ప్రాణాలకు బీమా భద్రత

సముద్రంలో చేపల వేట సమయంలో ప్రమాదాలకు గురయ్యే మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. వేట సమయంలో మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రూ.10 లక్షల వరకు ఎక్స్‌గ్రేషియా అందించే విధానం అమల్లో ఉందన్నారు. 2026-27లో 2,84,888 మంది మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. పథకం నిబంధనల ప్రకారం ప్రమాద మరణం లేదా పూర్తిస్థాయి శాశ్వత వైకల్యానికి రూ.5 లక్షలు, పాక్షిక శాశ్వత వైకల్యానికి రూ.2.50 లక్షల వరకు బీమా ప్రయోజనం లభిస్తుందన్నారు.

మత్స్య సంపద పరిరక్షణతోనే సుస్థిర అభివృద్ధి

గోదావరి, కృష్ణా డెల్టాలు, కోరింగ మడ అడవులు, పులికాట్, కొల్లేరు సరస్సులు మత్స్య సంపద వృద్ధికి కీలకమని మంత్రి పేర్కొన్నారు. సహజ జలవనరుల పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, చేపల సంతానోత్పత్తి ప్రాంతాల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. మత్స్యకారుల ఆదాయం పెంచడంతోపాటు భవిష్యత్తు తరాలకు మత్స్య సంపదను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

మత్స్యకారుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కాలి. వారి కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నింపాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో గంగపుత్రుల సంక్షేమం, ఆక్వా రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. మత్స్యరంగాన్ని లాభసాటిగా తీర్చిదిద్ది ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

జిల్లా సమగ్రాభివృద్ధే మనందరి లక్ష్యం

- మంత్రి నారాయణ స్పష్టీకరణ
- మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పీ నూతన పాలకవర్గం
- జెడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి



నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు జిల్లా పరిషత్ నూతన చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్ పొట్టేళ్ల ప్రసాద్ శనివారం సాయంత్రం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని మంత్రి నివాసంలో జరిగిన ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈఎంసీఎల్) చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి కూడా పాల్గొన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం వీరు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ నూతన పాలకవర్గానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, వారికి స్వయంగా స్వీట్ తినిపించి అభినందించారు. జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడానికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్ పొట్టేళ్ల ప్రసాద్ పేర్కొన్నారు.

టీడీపీతోనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యత

- ఆ వర్గాల్లో రాజకీయ చైతన్యం తెచ్చి, ఉన్నత పదవులు కల్పించిన చరిత్ర తెలుగుదేశం పార్టీదే
- జగన్ రిజర్వేషన్లను 20 శాతానికి తగ్గించి 16 వేల పదవులను బీసీలకు దూరం చేశారు
- జగన్ ఎన్ని కుట్రలు పన్నినా బీసీలు కూటమి ప్రభుత్వానికి అపూర్వ విజయం అందించారు
- స్థానిక ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేసిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు
- సర్పంచ్ ఎన్నికల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తేనే గ్రామ స్వరాజ్యం సాధ్యం
- రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్



అమరావతి (చైతన్యరథం): ఉమ్మడి ఏపీలో ఎన్టీఆర్ బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తే, చంద్రబాబు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీలను ఆదరించారని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ గుర్తు చేశారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ మోహన్ రెడ్డి స్థానిక సంస్థల రిజర్వేషన్లను 34 శాతం నుండి 20 శాతానికి తగ్గించి, సుమారు 16 వేల పదవులు బీసీలకు దక్కకుండా చేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో 54.5 శాతం ఉన్న బీసీలకు చంద్రబాబు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. దీనిని వైసీపీ కోర్టుల ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేసినా, కూటమి ప్రభుత్వం సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడిందని వివరించారు. అంతేకాకుండా, పార్టీ పరంగా 34 శాతం ఇస్తామని చెప్పిన టీడీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో 40 శాతం సీట్లు కేటాయించి బీసీల పక్షాన నిలిచిందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకుని, రాష్ట్రానికి 16వ ఆర్థిక సంఘం నిధులు రాకుండా వైసీపీ అడ్డుకునే ప్రయత్నం చేసినా, బీసీలందరూ ఏకతాటిపై నిలిచి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి అపూర్వ విజయాన్ని అందించారని ఆయన ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే గ్రామ స్వరాజ్యం సాధ్యపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళగిరి మేయర్ అభ్యర్థిగా రేకుల ఇంట్లో నివసించే ఒక సామాన్య ఎస్టీ కార్యకర్తకు అవకాశం కల్పించడం అభినందనీయమని, జెడ్పీ చైర్‌పర్సన్ ఎంపికలోనూ బీసీలకు తగిన ప్రాధాన్యత ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు బీసీల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో నారా లోకేష్ చూపిన చొరవ, పర్యవేక్షణ ప్రశంసనీయమని కొనియాడారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, గత రెండున్నరేళ్లుగా కూటమి ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తోందని, రాబోయే రోజుల్లో బీసీలు, మహిళలు, యువతకు మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని గొల్ల నరసింహ యాదవ్ స్పష్టం చేశారు.

పంచాయతీ ఎన్నికల నామినేషన్లలో వైసీపీ హింసాకాండ

- **ఓటమి భయంతో పథకం ప్రకారం పల్నాడులో టీడీపీ నేతలపై దాడులు**
- **టీడీపీ మద్దతుదారులను అడ్డుకుని, నామినేషన్లు ఉపసంహరించుకోవాలని బెదిరింపులు**
- **దాడులకు పాల్పడిన వైసీపీ గుండాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీకి టీడీపీ నేతల ఫిర్యాదు**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో జరుగుతున్న మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా పల్నాడు జిల్లాలో వైఎస్సార్సీపీ శ్రేణులు దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ తెలుగుదేశం పార్టీ నేతల బృందం శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)కు ఫిర్యాదు చేసింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ ఎస్. రాజశేఖర్, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్‌లతో కూడిన బృందం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాను కలిసి ఈ మేరకు సమగ్ర లిఖితపూర్వక ఫిర్యాదును అందజేసింది. పిడుగురాళ్ల మండలం, చెన్నాయపాలెంలో పంచాయతీ ఎన్నికలకు నామినేషన్లు వేసి తిరిగి వెళు_న్న టీడీపీ మద్దతుదారులపై వైసీపీ కార్యకర్తలు రాళ్లు, కర్రలతో దాడి చేశారని ఆరోపించారు. ఈ దాడిలో పలువురు టీడీపీ కార్యకర్తలు గాయపడటంతో పాటు, అక్కడే ఉన్న టీడీపీ ఎంపీపీ గండికోట వెంకటేశ్వర్లు కారును తీవ్రంగా ధ్వంసం చేశారని వారు తెలిపారు. మాచవరం మండలం, వేమవరంలో నామినేషన్లు వేసి తిరిగి వెళ్తున్న టీడీపీ మద్దతుదారులను దారిలో అడ్డుకుని కర్రలు, రాళ్లతో దాడి చేశారని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయవద్దని, వేసిన నామినేషన్లను వెంటనే ఉపసంహరించుకోవాలని బెదిరింపులకు గురిచేశారని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. పిడుగురాళ్ల మండలం, కార్లపాళెం నామినేషన్ కేంద్రం వద్ద భద్రత కల్పిస్తున్న పోలీసులపైనే వైసీపీ శ్రేణులు దాడికి యత్నించాయని టీడీపీ బృందం ఆరోపించింది.

నామినేషన్ల ప్రక్రియను అడ్డుకుని భయాందోళనలు సృష్టించేందుకు పోలీసులతో వాగ్వాదానికి దిగారని, అయితే పోలీసులు వెంటనే స్పందించి గుంపును చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చిందని వారు వివరించారు.

పల్నాడు జిల్లా వ్యాప్తంగా పథకం ప్రకారమే ఈ దాడులు జరుగుతున్నాయని, తద్వారా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఎన్నికల కమిషన్‌కు టీడీపీ నేతలు వివరించారు. ఈ ఘటనలకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లు, ఫోటోలతో కూడిన పెన్ డ్రైవ్‌ను ఆధారాలుగా కమిషనర్‌కు సమర్పించారు. దాడులకు పాల్పడిన బాధ్యులపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా జరిగేలా తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను టీడీపీ నేతలు కోరారు.

బనగానపల్లెలో హజ్రత్ సయ్యద్ మీర్ హాషం అలీ ఉర్సు మహోత్సవాలు

- ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



బనగానపల్లె (చైతన్యరథం): నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో కొలువైన హజ్రత్ సయ్యద్ మీర్ హాషం అలీ ఉర్సు దెహలివాలే సాహెబ్ రహ్మతుల్లా అలైహి వారి గంధం, ఉర్సు మహోత్సవాలకు సంబంధించిన గోడపత్రికను రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి బనగానపల్లెలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉర్సు మహోత్సవాల నిర్వాహకులు కార్యక్రమ వివరాలను మంత్రికి వివరించారు. నవంబర్ 30న రాత్రి 10 గంటలకు గంధం కార్యక్రమం, డిసెంబర్ 1న ఉర్సు మహోత్సవం, డిసెంబర్ 2న జియారత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గంధం కార్యక్రమంలో చాందిని డెకరేషన్, ప్రత్యేక లైటింగ్, డ్రమ్స్ ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకునేలా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 1న రాత్రి 9 గంటలకు ఉత్తరప్రదేశ్ (లక్నో)కు చెందిన కళాకారులతో ముఖామఖి పోటీల రూపంలో ప్రత్యేక ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించనున్నారు.

హజ్రత్ సయ్యద్ అహ్మద్ బాషా ఖాద్రి రహ్మతుల్లా అలైహి కుమారులు డాక్టర్ హుసేనిబాషా సాహెబ్ ఆధ్వర్యంలో గంధం, ఉర్సు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఖవ్వాలి కార్యక్రమానికి సహకారంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రూ.లక్ష విరాళంగా అందించారు. కార్యక్రమ నిర్వహణకు పలువురు దాతలు, ఆహ్వాన కమిటీ సభ్యులు, దర్గా కమిటీ సభ్యులు సహకారం అందిస్తున్నారు.

ఈ ఉత్సవాల్లో మతసామరస్యం, సోదరభావం వెల్లివిరిసేలా భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

తిరుమల తరహాలో..
తిరుచానూరు అమ్మవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



- **పంచమితీర్థానికి ప్రత్యేక క్యూ లైన్లు, కంపార్ట్‌మెంట్లు, జర్మన్ షెడ్లు.**
- **భక్తుల భద్రత, రద్దీ నియంత్రణకు పటిష్ట చర్యలు..**
- **ఆలయ పరిసరాల్లో కనువిందు చేసే పుష్ప, విద్యుద్దీపాలంకరణలు..**
- **డిసెంబరు 6 నుంచి 14 వరకు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు..**
- **టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర**

తిరుపతి (చైతన్యరథం): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర తెలిపారు. దేశవిదేశాల నుంచి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అమ్మవారి వాహనసేవలు, దర్శనాల ద్వారా ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించడమే లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

డిసెంబరు 6 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న కార్తీక బ్రహ్మోత్సవాలు, వాహనసేవలు, పంచమితీర్థం ఏర్పాట్లపై శనివారం తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలో అధికారులతో ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శనం, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్యం, భద్రత, తదితర అంశాల్లో ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పంచమితీర్థానికి ప్రత్యేక ఏర్పాట్లు

పంచమితీర్థం రోజున లక్షలాది మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఈవో సూచించారు. భక్తులు వేచి ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక కంపార్ట్‌మెంట్లు, జర్మన్ షెడ్లు ఏర్పాటు చేయాలని, ఎండ, వర్షాల నుంచి రక్షణ కల్పించేలా తగిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

పుష్కరిణిలోకి భక్తులను విడతలవారీగా అనుమతిస్తూ, స్నానఘట్టాల వద్ద రద్దీ నియంత్రణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను క్రమబద్ధీకరించి, బారికేడ్లు, భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయడం ద్వారా తొక్కిసలాటకు అవకాశం లేకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, క్షేత్రస్థాయి పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేయాలని సూచించారు.

పడి ఊరేగింపు మార్గాల్లో రహదారుల మరమ్మతులు

తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తిరుచానూరు వరకు పడి ఊరేగింపుగా వచ్చే మార్గాల్లో అవసరమైన రహదారి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించాలని, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు.

పుష్పశోభతో ఆలయ పరిసరాలు.. విద్యుద్దీపాల వెలుగులతో దివ్య వైభవం

ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఆలయం లోపల, వెలుపల సుందరమైన పుష్పాలంకరణలు ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో తెలిపారు. ఉద్యానవన విభాగం సహకారంతో, జేఈవో పర్యవేక్షణలో ఆలయ పరిసరాలను పుష్పశోభతో తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో ఆకర్షణీయమైన విద్యుద్దీపాలంకరణలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వాహనసేవలను భక్తులందరూ వీక్షించేలా ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. వాహనసేవల సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు భక్తులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో విచ్చేసి, అమ్మవారి వాహనసేవలను తిలకించి, దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఈవో కోరారు. భక్తులకు మధురమైన ఆధ్యాత్మిక అనుభూతిని అందించేందుకు టీటీడీ అన్ని విధాలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జేఈవోలు డాక్టర్ ఏ. శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో కేవీ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఇతర అధికారులు,

కూటమి గెలుపుతోనే సమగ్ర అభివృద్ధి

పట్టణాల్లో అభివృద్ధి కొనసాగాలంటే కూటమి పాలకవర్గం అవసరం - పాలకొల్లులో పలువార్డుల్లోని ఎస్సీ ప్రాంతాల్లో మంత్రి నిమ్మల విస్తృత ప్రచారం

పాలకొల్లు (చైతన్యరథం): మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుతోనే పాలకొల్లు పట్టణ సమగ్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగాలంటే మున్సిపాలిటీలో కూటమి పాలకవర్గం ఏర్పడటం అవసరమని పేర్కొన్నారు.

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలోని 33, 32, 41, 10, 11, 12, 16 వార్డుల్లో ఎస్సీ ప్రాంతాల్లో మంత్రి నిమ్మల రామానాయుడు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ రెండేళ్లలో ఆయా ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధితోపాటు గత టీడీపీ ప్రభుత్వంలో తాను చేసిన తాను చేసిన అభివృద్ధి పనులను వివరించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న



సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ ఎస్సీల అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు.

పాలకొల్లులో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అనేక అభివృద్ధి పనులు జరిగాయని, గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ ప్రాంతంలో అభివృద్ధికి నిధులు ఖర్చు చేయలేదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి చేయలేని వైసీపీ నాయకులు ఇప్పుడు చేస్తామంటూ చెబుతున్న మాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. అభివృద్ధి పనుల కోసం కోట్లాది రూపాయల నిధులు తీసుకొస్తూ, ఆదివారం, సెలవు రోజులు అనే తేడా లేకుండా రాత్రింబవళ్లు కష్టపడుతున్నానని తెలిపారు.

మంత్రి పదవిలో ఉన్నప్పటికీ ప్రజలకు సేవకుడిగానే పనిచేస్తున్నానని నిమ్మల అన్నారు. పనిచేసే ప్రభుత్వానికి, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే నాయకుడికి, గతంలో పనిచేయని వైసీపీ నాయకులకు మధ్య ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థి ఆబోతుల ఉషారాణితో పాటు కూటమి కౌన్సిలర్ అభ్యర్థులను ఓటు వేసి గెలిపించాలని కోరారు. మున్సిపాలిటీలో విలీనమైన ఏడు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని, అక్కడి సమస్యలను దశలవారీగా ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైసీపీకి ఓటు వేస్తే అది సముద్రంలో వేసినట్టేనని వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. పాలకొల్లు పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజలు కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి వెంట కౌన్సిలర్ అభ్యర్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంపెనీల రాకపై... జగన్ రెడ్డి కడుపు మంట

- అబద్ధాలు, అసత్యాలతో తప్పుడు కథనాలు సృష్టిస్తూ వికృత చేష్టలు
- జగన్ హయంలో పరిశ్రమలు పారిపోతే... నేడు పక్క రాష్ట్రాల నుంచి ఏపీకి పరిశ్రమలు
- తమిళనాడు డేటా చోరీ చేశారంటూ సాక్షి, నమస్తే తెలంగాణ ల్లో తప్పుడు కథనం
- తాము ఉద్యోగులను తొలగించలేదని గైడెన్స్ తమిళనాడు ప్రకటన
- తమ వ్యక్తిగత ఎదుగుదల కోసం కర్నాటక, తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల్లో చేరిన గైడెన్స్ తమిళనాడు ఉద్యోగులు

కరెంట్ అనాలిసిస్
తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం
(టీడీపీ నాలెడ్జ్ సెంటర్ విశ్లేషణ)

గత ప్రభుత్వంలో పెట్టుబడులు, పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్తే... నేడు చంద్రబాబు, లోకేష్ పాలనలో ఇతర రాష్ట్రాలకు సాధ్యం కాని విధంగా ఏపీకి పెట్టబడులు వస్తుంటే జగన్ రెడ్డికి కడుపు మంటగా ఉంది. ఐదేళ్ల పాలనలో పారిశ్రామికవేత్తలను బెదిరించడం, కంపెనీలపై భౌతిక దాడులు చేయడంతో అనేక పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లాయి. ఇది జగన్ ఐదేళ్ల చేతగాని పాలనకు నిదర్శనం. తాజాగా విశాఖలో జరిగిన సీఐఐ 31వ సదస్సులో రూ.9,88,957 కోట్ల పెట్టబడులు రాష్ట్రానికి వచ్చాయి. గత రెండేళ్లల్లో రాష్ట్రానికి రూ.22.60 లక్షల కోట్ల పెట్టబడులు, 19.30 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టారు.

కియా కార్ల పరిశ్రమ 2017లో అనంతపురంలో రూ.26,877 కోట్లు పెట్టుబడి పెట్టి ఏటా 3 లక్షల కార్లు ఉత్పత్తి చేసేలా ప్లాంటును నెలకొల్పింది. తాజాగా పరిశ్రమను విస్తరించా లనే లక్ష్యంతో కియా యాజమాన్యం మరో రూ.18,870 కోట్లు పెట్టబడి పెట్టబోతోంది. విశాఖ సీఐఐ సదస్సులో ఎంవోయూ కూడా కుదుర్చుకున్నాయి. ఈ పరిశ్రమతో పాటు అనంతపురం జిల్లాలో మొత్తం రూ.1,614 కోట్ల పెట్టుబడితో మూడు దక్షిణ కొరియా ఆటోమొబైల్ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఇందులో హ్వాసిన్ (Hwashin) సంస్థ రూ.850 కోట్ల పెట్టుబడితో కార్ల ఛాసిస్, సబ్‌ఫ్రేమ్‌లు, సస్పెన్షన్ వ్యవస్థలకు సంబంధించిన మెటల్ విడిభాగాలు, కారు బాడీ నిర్మాణానికి అవసరమైన స్టీల్ భాగాలను తయారు చేయనుంది. సియోన్ (Seoyon) సంస్థ రూ.514 కోట్లతో కార్ల డ్యాష్ బోర్డులు, డోర్ ట్రిమ్స్, బంపర్లు, సెంటర్ కన్సోల్, ఇతర ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్ ప్లాస్టిక్ విడి భాగాలను ఉత్పత్తి చేయనుంది. ఇక ఐవామెట్ (Iwamet) సంస్థ రూ.250 కోట్ల పెట్టుబడితో ఆటోమొబైల్ పరిశ్రమలకు అవసరమైన యాంత్రిక, మెటల్ విడిభాగాల తయారీ రంగంలో కార్యకలాపాలు చేపట్టనుంది. ఈ మూడు పరిశ్రమల ద్వారా సుమారు 1,418 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. జూలై నెలలో మంత్రి నారా లోకేష్ దక్షిణ కొరియా పర్యటన ద్వారా ఇది సాధ్యమైంది. తాజాగా వచ్చిన రూ.9.88 లక్షల కోట్ల పెట్టుబడుల్లో రూ.1,614 కోట్లు అంటే సుమారు 0.16 శాతం. కియా పరిశ్రమ కార్యకలాపాలను విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ మూడు కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించాయి. ఆ విధంగానే ఏపీలో పెట్టబడులు పెడుతున్నాయి. ఇందులో గైడెన్స్ తమిళనాడు సంస్థ ద్వారా డేటా చోరీ చేసి కంపెనీలను తరలించుకుపోతున్నారనే ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి. ఈ మూడు కంపెనీల రాకను చూపిస్తూ... సాక్షి ఫేక్ ఛానెల్, నమస్తే తెలంగాణ, కొన్ని తమిళనాడు పత్రికలు తప్పుడు కథనాలు ప్రచారం చేస్తూ ఏపీ ప్రభుత్వం గైడెన్స్ తమిళనాడు సంస్థలో పనిచేసే ఉద్యోగుల నుంచి డేటా చోరీ చేసి ఈ కంపెనీలను తమ రాష్ట్రానికి తీసుకువెళ్లిందని ఆరోపిస్తున్నాయి. 2026 జూలైలో మంత్రి నారా లోకేష్ దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా హుందాయ్ (Hyundai), కియా (Kia) సరఫరా వ్యవస్థలోని ఆటోమొబైల్ విడిభాగాల కంపెనీలతో సమావేశమయ్యారు. ఇందులో Hwashin, Seoyon, Iwamet ప్రతినిధులు పాల్గొన్నారు. ఆ తర్వాత ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు నిరంతరం సంప్రదింపులు జరిపి పెట్టుబడులను ఖరారు చేసింది. ఈ మూడు కంపెనీల్లో హ్వాసిన్ శ్రీపెరంబుదూర్‌లో ఇప్పటికే తయారీ యూనిట్ ఉంది. సియోన్ కృష్ణగిరి ప్రాంతంలో ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇక ఐవామెట్ శ్రీపెరంబుదూర్‌లో కంపెనీకి రిజిస్టర్డ్ సంస్థగా ఉంది.

అబద్ధం చెబితే అతికినట్టు ఉండాలి. సాక్షి పత్రికకు నిజం చెప్పడం ఎలాగూ రాదు. కానీ అబద్ధం చెప్పడం కూడా చేతకావట్లేదు. గైడెన్స్ తమిళనాడు సంస్థ ద్వారా డేటా చోరీ చేసి తమిళనాడుకు వెళ్లాల్సిన కంపెనీలను ఏపీ తీసుకొచ్చిందని సాక్షి పత్రికలో తప్పుడు ప్రచురించి జగన్ రెడ్డి రాష్ట్ర వాసిగా దిగజారి పోయారు. వాస్తవానికి 15మంది ఉద్యోగులను గైడెన్స్ తమిళనాడు సంస్థ తొలగించలేదు. కేవలం ఇద్దరిని మాత్రమే తొలగించింది. మిగతా 13 మంది స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఉద్యోగులు APEDBలో చేరి కంపెనీలను పెట్టబడులకు తీసుకొస్తున్నామని తప్పుడు కథనం వండి వడ్డించింది.

అబద్ధం: 15 మంది ఉద్యోగులపై గైడెన్స్ తమిళనాడు సంస్థ వేటు వేసిందంటూ తప్పుడు కథనం

వాస్తవం: ఉద్యోగులు వాళ్ల వాళ్ల వ్యక్తిగత ఎదుగుదల, ఇతర అవసరాల కోసమే జూన్ 29న ఇద్దరు క్రిస్టోలారెల్, ప్రభాకరన్ రిలీవింగ్ లెటర్లు పొందారు. జూలైలో స్వచ్ఛందంగా 13 మంది రాజీనామా చేశారని గైడెన్స్ తమిళనాడు సంస్థ ప్రకటించింది. ఇది ప్రతి సంస్థలో జరిగే సాధారణ ప్రక్రియ.

అబద్ధం: గైడెన్స్ తమిళనాడు సంస్థ ఉద్యోగులను ఏపీఈడీబీలో చేర్చుకుని డేటా చోరీ చేశారని తప్పుడు ఆరోపణ

వాస్తవం: ఎటువంటి డేటా చోరీ జరగలేదు కాబట్టే తమిళనాడు ప్రభుత్వం ఎవరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. ఎవరిపైనా ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. గైడెన్స్ తమిళనాడు సంస్థలో రాజీనామా చేసిన ఉద్యోగుల్లో కొందరు ఇన్వెస్ట్ తెలంగాణ, ఇన్వెస్ట్ కర్ణాటక వంటి సంస్థల్లో ఉద్యోగాలు పొందారు. ఏపీలో పనిచేస్తున్న వారిని మాత్రమే టార్గెట్‌గా తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

అబద్ధం: రాష్ట్రాల మధ్య సంబంధాలకు దెబ్బ

వాస్తవం: తమిళనాడు పరిశ్రమల శాఖ అధికారి అన్ని పెట్టుబడులు తమ రాష్ట్రానికే రావాలని ఆశించడం సముచితం కాదని వ్యాఖ్యలు చేశారు. కొన్ని పెట్టుబడులు సాధిస్తామని, కొన్ని కోల్పోతామని ఆయన అంగీకరించారు.

అబద్ధం: తమిళనాడు కంపెనీలను ఏపీ తరలించుకుపోతోందంటూ ప్రచారం

వాస్తవం: తమిళనాడులో ఇప్పటికే రూ.1,614 కోట్ల



పెట్టుబడుల ఒప్పందాలు ఉన్నాయని, వాటిని ఏపీకి తరలించారని చెప్పడానికి ఎక్కడా ఆధారాలు లేవు. ఏపీకి వచ్చిన మూడు కంపెనీలతో తమిళనాడు ప్రభుత్వం చర్చలు జరిపిందే కానీ ఎంవోయూలు కుదుర్చుకోలేదు.

అబద్ధం: ఏపీ గూఢచర్యానికి పాల్పడిందంటూ సాక్షి పచ్చి అబద్ధాలు

వాస్తవం: ఏపీ ప్రభుత్వం ఎటువంటి గూఢచర్యానికీ పాల్పడలేదు. తమిళనాడు ప్రభుత్వ అధికారులు, గైడెన్స్ సంస్థ విడుదల చేసిన ప్రకటనలే అందుకు ఉదాహరణ.

అబద్ధం: ఏపీ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిందని జగన్ ఆవేదన

వాస్తవం: గత ప్రభుత్వంలో జాతీయ స్థాయిలో గంజాయి స్మగ్లింగ్‌లో ఏపీ బ్రాండ్ ఇమేజ్ బాగా బిల్డ్ అయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో గంజాయి స్మగ్లింగ్‌ను పూర్తిగా నిర్మూలించాం. జగన్ రెడ్డి సృష్టించిన బ్రాండ్ ఇమేజ్ కనుమరుగవుతుందనే బాధపడుతున్నారు.

అమరావతి క్వాంటం వ్యాలీలో సరికొత్త అధ్యాయం

- రాష్ట్రానికి 'నీలిట్' డీమ్డ్ టు బి యూనివర్సిటీ
- ప్రపంచంలోనే తొలి క్వాంటం, ఏఐ వర్సిటీ ప్రత్యేక క్యాంపస్
- ఆచార్య నాగార్జునలో తాత్కాలిక తరగతులు ప్రారంభం
- త్వరలో రూ.730 కోట్లతో రాజధానిలో శాశ్వత క్యాంపస్



అమరావతి (చైతన్య రథం): క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా మరో కీలక ముందడుగు పడింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డీమ్డ్ టు బి యూనివర్సిటీ, అమరావతి తాత్కాలిక క్యాంపస్‌ను శనివారం గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని సీడీఈ భవనంలో ప్రారంభమైంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆర్థిక సలహాదారు డాక్టర్ ఎ. ప్రతిభ ఈ క్యాంపస్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నీలిట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మదన్ మోహన్ త్రిపాఠి పాల్గొన్నారు. ఇది ప్రపంచంలోనే క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తొలి విశ్వవిద్యాలయ క్యాంపస్‌గా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మద్దతుతో అమరావతిలో నీలిట్ ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తోంది. అమరావతి క్వాంటం వ్యాలీలో నైపుణ్యాభివృద్ధికి ఈ విశ్వవిద్యాలయం కేంద్రంగా నిలవడంతో పాటు, అత్యాధునిక సాంకేతిక రంగాలకు అవసరమైన నిపుణులను తయారు చేయనుంది. శాశ్వత క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యే వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఇది కార్యకలాపాలు నిర్వహిస్తుంది. తద్వారా కొత్త భవనాల నిర్మాణం కోసం వేచి చూడకుండా రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, శిక్షణ వెంటనే అందుబాటులోకి వచ్చింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో క్యాంపస్

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి కలిగిన శాస్త్రీయ సంస్థ నీలిట్‌కు 'ఇన్‌స్టిట్యూషన్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ (డిస్టింక్ట్ కేటగిరీ)' హోదా లభించింది. కేంద్ర పరిధిలో ఉన్న ఏకైక విశ్వవిద్యాలయం ఇదే. పంజాబ్‌లోని రూపార్‌లో ప్రధాన క్యాంపస్ ఉండగా, దేశవ్యాప్తంగా 11 అనుబంధ క్యాంపస్‌లున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వేగవంతమైన భాగస్వామ్యంతో అమరావతి క్యాంపస్ ఏర్పాటు సాధ్యమైంది. 2026 ఫిబ్రవరి 20న న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నీలిట్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఒప్పందం కుదిరిన తొమ్మిది నెలల్లోనే క్యాంపస్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. మొదటి దశలో భాగంగా తాత్కాలిక క్యాంపస్‌లో రూ.47 కోట్ల వ్యయంతో నాలుగు అత్యాధునిక ప్రయోగశాలలను నీలిట్ ఏర్పాటు చేస్తోంది. క్వాంటం కంప్యూటింగ్ ల్యాబ్, క్వాంటం కమ్యూనికేషన్ ల్యాబ్, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ ల్యాబ్, ఏఐ, కంప్యూటింగ్ ల్యాబ్ అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ ప్రయోగశాలల ద్వారా ప్రపంచంలోని ప్రముఖ టెక్నాలజీ సంస్థలు ఉపయోగిస్తున్న అత్యాధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు వినియోగించుకునే అవకాశం లభిస్తుంది. వీటి ద్వారా విద్యార్థులకు ప్రాథమిక పరిజ్ఞానంతో పాటు అధునాతన సాంకేతిక నైపుణ్యాలు, ప్రాక్టికల్ అనుభవం కల్పిస్తారు. క్వాంటం, ఏఐ, అనుబంధ సాంకేతిక రంగాల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యంగా తాత్కాలిక క్యాంపస్‌లో వివిధ కోర్సులను వచ్చే జనవరి నుంచి ప్రారంభించనున్నారు. ఆన్‌లైన్‌తో పాటు తరగతి గదిలోనూ శిక్షణ అందిస్తారు. రెండు నుంచి మూడు నెలల వ్యవధి కలిగిన పది అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ కోర్సులను అందించనున్నారు. వీటిలో క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం కమ్యూనికేషన్, సైన్స్, ఇంజినీరింగ్‌లో ఏఐ వినియోగం, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఐఓటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్... వీటితో పాటు ప్రాచుర్యం పొందిన 'హ' లెవెల్ ప్రోగ్రామ్‌లను కూడా నిర్వహిస్తారు. అదనంగా 16 స్వల్పకాలిక కోర్సులను అందించనున్నారు. వీటిలో వీఎల్ఎస్ఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్, బ్యాటరీ మేనేజ్‌మెంట్, బ్లాక్‌చైన్, సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్టింగ్ (ఔవీూ), క్వాంటం టెక్నాలజీ వంటి అంశాలు ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల్లో బోధించే అధ్యాపకులకు ఈ నైపుణ్యాలను అందించేందుకు పది విభాగాల్లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తారు.

అమరావతిలో 8.5 ఎకరాల్లో శాశ్వత క్యాంపస్

దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా అమరావతిలో నీలిట్ శాశ్వత క్యాంపస్‌ను రూ.730.70 కోట్లతో ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి ఈ ఏడాది ఆగస్టులో ఆమోదం తెలిపారు. ఇందుకోసం అమరావతిలోని నిడమర్రు వద్ద 8.5 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. రాబోయే ఐదేళ్లలో ఈ క్యాంపస్ ద్వారా సుమారు 8,250 మందికి శిక్షణ అందించాలన్నది లక్ష్యం. ఇందులో సుమారు 1,650 మందికి డిగ్రీ కోర్సుల ద్వారా, మరో 6,600 మందికి నైపుణ్యాభివృద్ధి, సర్టిఫికేషన్ కోర్సుల ద్వారా శిక్షణ కల్పిస్తారు. భూమిని రాష్ట్ర ప్రభుత్వం అందించగా, భవనాల నిర్మాణం, ప్రయోగశాలల ఏర్పాటు, నిర్వహణ ఖర్చులను నీలిట్, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ భరించనున్నాయి. క్వాంటం టెక్నాలజీ, ఏఐ, సెమీకండక్టర్లలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టోరల్, డిప్లొమా కోర్సులను అందించనున్నారు. అమరావతి క్వాంటం వ్యాలీలోని ఐబీఎం క్వాంటం కంప్యూటర్‌పై పనిచేసే అరుదైన అవకాశం కూడా ఈ విశ్వవిద్యాలయ విద్యార్థులకు లభించనుంది. శాశ్వత క్యాంపస్ సిద్ధమైన వెంటనే ప్రస్తుతం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉన్న ప్రయోగశాలలు, అధ్యాపకులు, విద్యార్థులను ఎలాంటి అంతరాయం లేకుండా కొత్త క్యాంపస్‌కు తరలిస్తారు. అమరావతితో పాటు రాయలసీమ ప్రాంతంలోనూ నీలిట్ కార్యకలాపాలను విస్తరించనున్నారు. ప్రస్తుతం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని తాత్కాలిక వసతి నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న నీలిట్ తిరుపతిని సొంత శాశ్వత క్యాంపస్‌కు తరలించనున్నారు. ఈమేరకు మూడు ఎకరాల భూమి కేటాయింపు ప్రతిపాదనను సమర్పించగా, ఎస్వీ విశ్వవిద్యాలయం ఇప్పటికే ఎన్వోసీ జారీ చేసింది. తిరుపతి క్యాంపస్‌లో ఎలక్ట్రానిక్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, సెమీకండక్టర్ నైపుణ్యాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలోని వివిధ వర్గాల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, అధ్యాపకులు, పరిశ్రమలకు ప్రయోజనం చేకూర్చనుంది. దీంతో పెట్టుబడులకు మరింత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ ఎదగనుంది. నీలిట్ క్యాంపస్ ద్వారా శిక్షణ పొందిన నిపుణులు, పరిశోధకులు అమరావతి క్వాంటం వ్యాలీ వ్యవస్థలో భాగస్వాములు కానున్నారు. దీంతో భారతదేశంలో క్వాంటం టెక్నాలజీకి ప్రముఖ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ స్థానం మరింత బలోపేతం కానుంది. జాతీయ క్వాంటం మిషన్, ఇండియా ఏఐ మిషన్, ఇండియా సెమీకండక్టర్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. నీలిట్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ తాత్కాలిక క్యాంపస్ ప్రారంభంతో అత్యాధునిక సాంకేతిక రంగాలకు అవసరమైన సంపూర్ణ నైపుణ్య వ్యవస్థకు పునాది పడింది. నేటి ఉద్యోగావకాశాలకే కాకుండా, భవిష్యత్తులో ఆవిర్భవించనున్న పరిశ్రమలకు కూడా రాష్ట్ర యువతను సిద్ధం చేయడంలో ఈ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించనుంది.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే కాకినాడ సమగ్రాభివృద్ధి

- కూటమి పక్షాల సమన్వయ సమావేశంలో మంత్రి దుర్గేష్
- కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి
- ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని అభ్యర్థులకు మంత్రి దుర్గేష్ దిశానిర్దేశం
- నగరంలో ఎన్నికల ప్రచార ర్యాలీలో పాల్గొన్న మంత్రి



కాకినాడ (చైతన్యరథం): కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి పార్టీల మద్దతుతో పోటీ చేస్తున్న మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులందరినీ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం కాకినాడలోని ది ఫెర్న్ రెసిడెన్సీలో నిర్వహించిన కూటమి పక్షాల సమన్వయ సమావేశంలో ఎన్నికల సమన్వయకర్తగా ఆయన పాల్గొని మాట్లాడుతూ... కాకినాడ నగర విస్తరణ అనంతరం 66 వార్డులకు పెరిగి జరుగుతున్న ఈ ఎన్నికలు అత్యంత కీలకమైనవని, వీటిని చారిత్రాత్మక ఎన్నికలుగా భావించాలని పేర్కొన్నారు. విస్తరణ తర్వాత గెలిచే అభ్యర్థులు ప్రథమ కార్పొరేటర్లుగా చరిత్రలో నిలుస్తారని చెబుతూ, ఎన్నికల్లో విజయం సాధించబోతున్న అభ్యర్థులకు ముందస్తుగా శు భాకాంక్షలు తెలిపి నూతనోత్సాహం నింపారు.

కేంద్ర, రాష్ట్రాల్లో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున, స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులు గెలిస్తేనే క్షేత్రస్థాయిలో వేగవంతమైన అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతాయని మంత్రి వివరించారు. గడిచిన రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని అభ్యర్థులకు సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల స్ఫూర్తితో, కూటమి నేతలంతా సమన్వయంతో పనిచేసి ఓటర్లతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవాలని తెలిపారు.

కూటమి పార్టీలలో సామాన్యులకు సముచిత స్థానం లభిస్తోందని మంత్రి కందుల దుర్గేష్ గుర్తు చేశారు. ఇటీవల నిడదవోలు మున్సిపల్ ఎన్నికల్లో జనసేన తరపున మురాల జ్యోతి అనే ఒక సాధారణ నర్సును నిలబెట్టి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గెలిపించుకున్నామని, అలాగే రాజమహేంద్రవరం మేయర్ అభ్యర్థిగా బీజేపీ మహిళా కార్యకర్త రేలంగి శ్రీదేవిని బరిలో నిలిపామని తెలిపారు. అదే తరహాలో సామాన్య కుటుంబం నుండి వచ్చిన జనసేన వీర మహిళ ఆకుల భవానిని కాకినాడ మేయర్ అభ్యర్థిగా కూటమి తరపున నిలబెట్టామని, ఆమెతో పాటు కార్పొరేటర్ అభ్యర్థులందరినీ భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సమావేశం అనంతరం కాకినాడ నగరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.. జై కూటమి నినాదాలతో కాకినాడ నగరం మారుమోగింది. అంతకుముందు కాకినాడ నగరంలో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులను మంత్రి స్వయంగా పలకరించి వారిలో ధైర్యం నింపారు..


కాకినాడలో జరిగిన కూటమి పక్ష సమన్వయ సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), పంతం నానాజీ, కాకినాడ జిల్లా పరిషత్ చైర్మన్ బుర్ర దివ్య సునీత రాజ్, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ (కుడా) చైర్మన్ తలాటం సత్య, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, మాజీ మంత్రులు రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు, చిక్కాల రామచంద్రరావు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జోన్ - 1 (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)

చైతన్యరథం

బాలల్లో పఠనాసక్తి, సృజనాత్మకతను పెంపొందించాలి

వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి పాల్గొన్న ఎంపీ శ్రీభరత్



విశాఖపట్టణం (చైతన్యరథం): ప్రస్తుత డిజిటల్ యుగంలో పిల్లలు స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియాకు పరిమితం కాకుండా పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ సూచించారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానంతో పాటు ఊహాశక్తి, ఆలోచనా సామర్థ్యం, సృజనాత్మకత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. విశాఖపట్నం బీచ్ రోడ్డులోని హవా మహల్‌లో శనివారం ప్రారంభమైన రెండు రోజుల 'వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్' కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో కలిసి ఎంపీ శ్రీభరత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లల్లో చిన్ననాటి నుంచే కథలు చదవడం, కథలు రాయడం, తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తపరచడం వంటి అలవాట్లను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, భావోద్వేగాలు, స్థానికతను ప్రతిబింబించే కథలు, సాహిత్య రచనలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువతలో రచనా నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా భవిష్యత్తులో మంచి రచయితలు, కథకులు తయారవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వల్ల అనేక పనులు సులభతరమవుతున్నప్పటికీ, ప్రతి చిన్న విషయానికీ దానిపైనే ఆధారపడటం మంచిది కాదన్నారు. సొంతంగా ఆలోచించే సామర్థ్యాన్ని, సృజనాత్మకతను కోల్పోకుండా ఏఐని అవసరమైన మేరకే వినియోగించుకోవాలని సూచించారు. మానవ అనుభవాలు, భావోద్వేగాలు, స్వతంత్ర ఆలోచనల నుంచి పుట్టే అసలైన సృజనాత్మక రచనలకు ఎప్పటికీ ప్రత్యేక గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. తన బాల్యంలో తల్లి రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలను చదివి వినిపించిన విషయాలను, తాను చదివిన హ్యారీ పోటర్ పుస్తకాలను ఈ సందర్భంగా శ్రీభరత్ గుర్తుచేసుకున్నారు. సినిమా చూసినప్పుడు కంటే పుస్తకం చదివినప్పుడు మన ఊహాశక్తికి ఎక్కువ అవకాశం లభిస్తుందని అన్నారు. పిల్లలు డిజిటల్ తెరలకే పరిమితం కాకుండా భౌతిక పుస్తకాలు చదవడంపై ఆసక్తి పెంచుకోవాలని, వచ్చే ఏడాది లిటరరీ ఫెస్ట్‌కు వచ్చేలోపు ప్రతి విద్యార్థి కనీసం పది పుస్తకాలు చదవాలని లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నం నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో, భవిష్యత్తులో ఎండాడలోని గీతం విశ్వవిద్యాలయం వేదికగా కూడా ఇలాంటి సాహిత్య కార్యక్రమాన్ని నిర్వహించే ఆలోచన ఉందని తెలిపారు. ఏటా లిటరరీ ఫెస్ట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను, ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలను అభినందించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వంటి ప్రముఖులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం సాహిత్యానికి, పఠన సంస్కృతికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు, సాహితీవేత్తలు, నిర్వాహకులు, దాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎచ్చెర్ల నియోజకవర్గం, ఎచ్చెర్ల మండలం ఎంపీపీగా ఎన్నికై ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన బెండు రమాదేవి, బెండు మల్లేశ్వర రావు విజయనగరం పార్లమెంట్ సభ్యుడు, కలిశెట్టి అప్పలనాయుడును రణస్థలం మండల కేంద్రం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ బెండు మల్లేశ్వర రావును అభినందించి శుభాకాంక్షలు తెలియజేసి దుస్సాలువాతో సత్కరించారు.



రణస్థలం మండల కేంద్రం, ఎంపీ క్యాంపు కార్యాలయంలో డర్రు రమణమ్మ , జి. సిగడం ఎంపీపీ ప్రతినిధి కుమారపు రవికుమార్ ఆధ్వర్యంలో ఇటీవల జి.సిగడం ఎంపీపీగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం, విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ వారికి అభినందనలు తెలియజేస్తూ, అలాగే వైస్ ఎంపీపీ ప్రతినిధి కొంపెల్ల శంకరరావుకు కూడా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి జి. సిగడాం మండల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.



24న రక్తదాన శిబిరంలో అంతా పాల్గొనాలి

ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పిలుపు

విజయనగరం (చైతన్యరథం): పట్టణ స్థాయి సమావేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 23వ తేదీన జరగనున్న విజయనగరం మేయర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యాలయం నుండి విజయనగరం మున్సిపల్ కార్యాలయం వరకు నిర్వహించే ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 24వ తేదీన శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పుట్టినరోజు సందర్భంగా నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్ పర్సన్ పాలవలస యశస్వి, కొప్పులవెలమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పీవీజీ కుమార్, మేయర్ అవనాపు భార్గవి, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల నియోజకవర్గం తెదేపా సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు, నూతనంగా ఎన్నికైన డెంకాడ మండలం ఎంపీపీ కంది ఉమా, విజయనగరం పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జునను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూనిట్ ఇంఛార్జిలు కలిదిండి పాణీరాజు, పడాల చిన్నారావు, బంటుపల్లి రామునాయుడు, మోదవలస ఎంపీటీసీ కాగితాల దేవి, డెంకాడ మండలం తెలుగు యువత ఉపాధ్యక్షులు బుగత రమణ



కాకినాడలో కూటమి భారీ ర్యాలీ

కాకినాడ (చైతన్యరథం): కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతుగా కాకినాడలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాకినాడ టౌన్ హాల్ సెంటర్ నుంచి జగన్నాథపురం సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, ఎంపీ ఉదయ్, జెడ్పీ చైర్‌పర్సన్ డా. బుర్రా సునీత రాజ్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, కాకినాడ మేయర్ అభ్యర్థి ఆకుల భవాని తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీలతో కలిసి స్థానిక టీ దుకాణంలో టీ సేవించారు. ఈ సందర్భంగా స్థానికులతో ఆప్యాయంగా ముచ్చటించారు.

పార్టీ కోసం కష్టపడేవారికే ప్రాధాన్యత

జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి వెల్లడి

ఏలూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉండగా అండగా నిలిచిన వారికే డిప్యూటీ మేయర్ పదవి కేటాయింపులో తొలి ప్రాధాన్యతనిస్తామని, అయితే ఈ విషయంపై అప్పుడే స్పష్టతనివ్వాలనుకోవట్లేదని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ప్రజలతో మమేకమైతేనే ఎన్నికల్లో విజయం తథ్యమనే సత్యాన్ని కార్పొరేషన్ ఎలక్షన్‌లో తమ గెలుపుతో నిరూపించిన ముగ్గురు పార్టీ సానుభూతిపరులను తిరిగి టీడీపీలోకి తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ నెల 23వ తేదీన ఏలూరు నగరపాలక సంస్థ నూతన పాలకవర్గం కొలువుదీరనున్న నేపథ్యంలో అవలంభించాల్సిన అంశాలపై ఏలూరు పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కూటమి తెలుగుదేశం పక్ష నూతన కార్పొరేటర్‌ల సమావేశాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పలు ఆసక్తికర అంశాలు చోటుచేసుకున్నాయి. తొలుత టీడీపీ సానుభూతిపరులుగా కార్పొరేషన్ ఎన్నికల్లో నిలిచి కార్పొరేటర్లుగా గెలిచిన కప్పా ఉమామహేశ్వరరావు, చలువాది రూపకళాశ్రీ, నిడిగట్టు లావణ్యలు ఎమ్మెల్యే చంటి సమక్షంలో తిరిగి పార్టీలో చేరారు. వీరికి టీడీపీ కండువాలు కప్పిన ఎమ్మెల్యే చంటి,,, వారిని సాదరంగా పార్టీలోనికి ఆహ్వానించారు. అలాగే కార్పొరేషన్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన కార్పొరేటర్ రాజా స్వర్ణకుమారికి ముందుగా ప్రకటించిన విధంగా 10లక్ష రూపాయల విలువైన వెండి కానుకను ఆయన స్వయంగా అందించారు. అనంతరం వివిధ డివిజన్‌ల నుండి విజయం సాధించిన టీడీపీ పురుష కార్పొరేటర్లకు ఎమ్మెల్యే చంటి నూతన వస్త్రాలను బహూకరించగా,,, ఎమ్మెల్యే సోదరి మోటేపల్లి కోటేశ్వరమ్మ మహిళా కార్పొరేటర్లకు చీరలను బహూకరించారు. దీంతో ఆ ప్రాంతంలో ఉత్సాహభరిత వాతావరణం వెల్లివిరిసింది. కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నేతల సమక్షంలో ఎమ్మెల్యే బడేటి చంటి భారీ కేక్ కట్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే చంటి,,, పార్టీ సానుభూతిపరులుగా ఎన్నికల్లో నిలిచి గెలిచిన ముగ్గురు కార్పొరేటర్లను పార్టీలోకి తీసుకున్నామని స్పష్టం చేశారు. కొన్ని చోట్ల సీట్లు రానివారు ఉన్నారని, వారికి నామినేటెడ్ పదవులు అందించేందుకు కృషిచేస్తామన్నారు. అలాగే ఎన్నికల బరిలో నిలిచి ఓటమి పాలైన వారికి కూడా అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఇదేసమయంలో యువ కార్పొరేటర్లకు ఎమ్మెల్యే చంటి పలు కీలక సూచనలు చేశారు. సీనియర్లను కలుపుకొని ముందుకెళ్ళాలని హితవు పలికారు. ప్రజలతో మమేకమైతేనే ఎటువంటి ఎన్నికల్లోనైనా గెలుపు తథ్యమనే విషయం పదేపదే పునరావృతమయ్యే విజయ రహస్యమని వ్యాఖ్యానించిన ఆయన,,, ఏలూరు డిప్యూటీ మేయర్ పదవి కేటాయింపు అంశంలో పార్టీ విధేయులకే ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటిని నూతన కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నేతలు భారీ గజమాలలతో, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టీడీపీ జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ చల్లా వెంకట సత్యవరప్రసాదరావు, ఏలూరు నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, సీనియర్ నేత బెల్లపుకొండ కిషోర్, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



సంక్షేమమే సాయుధంగా ప్రజల్లోకి వెళ్లాలి

రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని

దెందులూరు (చైతన్యరథం): ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో జరిగిన సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, దెందులూరు నియోజకవర్గ పరిశీలకులు అంకెం ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి పోటీ చేస్తున్న కూటమి సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమాలకు హాజరై అభ్యర్థులకు తమ మద్దతు, శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి నామినేషన్ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్లాలని, దెందులూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగాలని, నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.



కూటమి అభ్యర్థుల విజయానికి ప్రచారం

పాల్గొన్న రెడ్డి సుబ్రహ్మణ్యం, కుడుపూడి సత్తిబాబు

రాజమహేంద్రవరం (చైతన్యరథం): కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు కూటమి అభ్యర్థులకు మద్దతుగా నగరంలో పలు వార్డులలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. 1వ వార్డు అభ్యర్థి రాయుడి శ్రీనివాస్, 2వ వార్డు అభ్యర్థి కడలి రుక్మిణి, 6వ వార్డు ముప్పిడి రాంబాబు, 47వ వార్డు అభ్యర్థి కాలేపు కుసుమ, 56వ వార్డు సింహా వెంకటేష్ లకు మద్దతుగా వారు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కూటమి పార్టీలు బలపరిచిన మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవి మరియు కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించి నగర అభివృద్ధికి తోడ్పడాలని ఓటర్లను కోరారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన కూటమి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రాజమహేంద్రవరం నగర అభివృద్ధికి ప్రజలంతా తమ అమూల్యమైన ఓటుతో మద్దతుగా నిలవాలని కోరారు.





అంబేద్కర్ అంటే అంత చులకనా!

వైసీపీ నేతలను నిలదీసిన టీడీపీ నేతలు

విజయవాడ (చైతన్యరథం): నగరపాలక సంస్థ నూతన కార్పొరేటర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించే వేదికపై వైసీపీ నాయకులు చేసిన విమర్శలను తెలుగుదేశం పార్టీ నాయకులు ఉమ్మడి వెంకటేశ్వరరావు, షేక్ ఆషా, గూడపాటి కిషోర్ తీవ్రంగా ఖండించారు. 48 వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రమాణ స్వీకారం జరిగే హాల్‌పై వైసీపీ నాయకులు చూపిస్తున్న శ్రద్ధలో సగమైనా గత ఐదేళ్లలో విజయవాడ నగర అభివృద్ధిపై పెట్టి ఉంటే నగరం మరింత అభివృద్ధి చెంది ఉండేదని అన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చింది ప్రమాణ స్వీకార వేదికలపై రాజకీయాలు చేయడానికి కాదని, విజయవాడను అభివృద్ధి పథంలో నడిపించడానికని స్పష్టం చేశారు. 1981 నుంచి ఒకే విధానం కొనసాగిందని, ఇప్పుడు పరిపాలనా అవసరాలకు అనుగుణంగా మార్పులు చేస్తే తప్పేమిటని ప్రశ్నించారు. కాలానుగుణంగా పరిపాలనా విధానాల్లో మార్పులు రావడం సహజమని పేర్కొన్నారు. 50వ డివిజన్ కార్పొరేటర్ షేక్ ఆషా మాట్లాడుతూ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఎక్కడ నిర్వహించాలనే అంశం సంబంధిత చట్టాలు, ప్రభుత్వ నిబంధనలు, అధికారుల నిర్ణయాల ప్రకారం జరగాల్సిన విషయమని తెలిపారు. ఇందులో వైసీపీ నాయకుల రాజకీయ ఒత్తిళ్లకు తావు లేదన్నారు. ముఖ్యంగా అధికారులు సూచించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించడంపై వైసీపీ నాయకులకు అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. అంబేద్కర్ పేరు మీద ఉన్న ఆడిటోరియంలో ప్రమాణ స్వీకారం చేయడం నచ్చలేదా? లేక రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరును ప్రస్తావించడం కూడా ఇష్టం లేదా? అని నిలదీశారు. ఈ అంశంపై వైసీపీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 37వ డివిజన్ కార్పొరేటర్ గూడపాటి కిషోర్ మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారని, అయినప్పటికీ ఆ పార్టీ నాయకుల తీరు మారడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాడాల్సింది పోయి అసంబద్ధమైన విమర్శలు, అనవసర రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి, నగర అభివృద్ధికి అడ్డంకులు సృష్టించకుండా సహకరించాలని కోరారు. రాజకీయ విమర్శలతో ప్రజల విశ్వాసాన్ని మరింత కోల్పోవద్దని సూచించారు. విజయవాడ అభివృద్ధే కూటమి ప్రజాప్రతినిధుల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 31వ డివిజన్ కార్పొరేటర్ గడ్డం రవికుమార్, 47వ డివిజన్ కార్పొరేటర్ ఈగల సాంబశివరావు, 54వ డివిజన్ కార్పొరేటర్ వడ్డాది రమణ, 45 వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి కళ్యాణి, 56 వ డివిజన్ కార్పొరేటర్ కొలగని అశోక్ పాల్గొన్నారు.



సేవ చేయడం చేతగాని వైసీపీ నేతలు

ఎన్నికల ప్రచారంలో ధ్వజమెత్తిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్

పెనమలూరు (చైతన్యరథం): తాడిగడప మున్సిపాలిటీ 31, 32వ వార్డుల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా వైసీపీ తప్పుడు ప్రచారాలకు పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ దీటైన సమాధానమిచ్చారు. ప్రజల మధ్య విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డు కూటమి కౌన్సిలర్ అభ్యర్థి వనమాల వెంకటేశ్వరరావు 32వ వార్డు కూటమి కౌన్సిలర్ అభ్యర్థి పులి లక్ష్మీ లలిత కుమారి, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి శ్రీ పీతా గోపిచంద్ విజయాన్ని కాంక్షిస్తూ పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ గారు ఆయా వార్డుల్లో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు,వ్యాపారులను నేరుగా కలుసుకుంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధిని నిర్లక్ష్యం చేసి,ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైన వారు ఇప్పుడు ఎన్నికల వేళ మళ్లీ మాయమాటలతో ప్రజల ముందుకు వస్తున్నారని విమర్శించారు.

ఆముదాల వలసలో ఎమ్మెల్యే కూన విస్తృత ప్రచారం



ఆముదాలవలస (చైతన్యరథం): మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని 1, 2,26,27 వ వార్డుల్లో ఆముదాలవలస నియోజకవర్గ శాసనసభ్యుడు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి తరఫున పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి వార్డుల్లో పర్యటిస్తూ స్థానిక ప్రజలను నేరుగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రజలతో మమేకమై వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్తులో కల్పించనున్న మౌలిక సదుపాయాల గురించి ప్రజలకు వివరించారు. పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి ప్రజలను కలుసుకున్నారు. 1, 2వ వార్డుల్లో నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమం సందడిగా సాగింది.



ఎమ్మెల్యేకు దీటుగా బోడే హేమ ప్రచారం

కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహం

పెనమలూరు (చైతన్యరథం): తాడిగడప మున్సిపాలిటీ 16 వ వార్డుల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా విస్తృత ఎన్నికల ప్రచారం బోడే హేమ నిర్వహించారు. 16వ వార్డు అభ్యర్థి మోపిదేవి అశోక పావని చైర్మన్ అభ్యర్థి పీతా గోపిచంద్ విజయాన్ని కాంక్షిస్తూ బోడే హేమ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని కోరారు. తాడిగడప మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు,ప్రజల నుంచి లభించిన ఆదరణ,ఉత్సాహభరిత స్పందనతో కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

అంబేద్కర్ కళావేదికపైనే మేయర్, డిప్యూటీల ప్రమాణస్వీకారం



విజయవాడ (చైతన్యరథం): నగర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు ఎన్డీఏ కూటమిపై విశ్వాసం ఉంచి భారీ మెజారిటీతో అత్యధిక కార్పొరేటర్ స్థానాలను కట్టబెట్టారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. నగరంలో కూటమికి లభించిన ఈ ఘన విజయం ప్రజలు తమ నాయకత్వంపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని అన్నారు. విజయవాడలోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ.. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో రాజకీయ విమర్శలు, వివాదాలకు స్వస్తి పలికి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులందరూ పనిచేయాలని సూచించారు. కొన్ని పార్టీలు కనీసం చెప్పుకోదగ్గ సంఖ్యలో స్థానాలు కూడా సాధించలేని పరిస్థితి ఏర్పడిందని, అతి తక్కువ స్థానాలతో గెలుపొందిన వారు సైతం ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా స్పందించాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో విజయవాడలోని అంబేద్కర్ కళావేదికను అత్యంత సుందరంగా తీర్చిదిద్దామని తెలిపారు. మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు గౌరవం కల్పించాలనే ఉద్దేశంతోనే మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమాలను అదే ప్రాంగణంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమ నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని సంప్రదించామని, విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని కౌన్సిల్ హాల్‌తో పాటు ఇతర అనువైన ప్రదేశాల్లో కూడా ప్రమాణ స్వీకార కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని వివరించారు. అనుగుణంగా అనువైన ప్రదేశంలో కార్యక్రమం నిర్వహించుకునేందుకు లిఖితపూర్వక అనుమతి కూడా లభించిందని, అందుకు సంబంధించిన పత్రాలను మీడియా ముందు ప్రదర్శించినట్లు తెలిపారు. అంబేద్కర్‌ను కేవలం విగ్రహాలకే పరిమితం చేయకుండా, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని ఎంపీ చిన్ని పేర్కొన్నారు. అంబేద్కర్ పేరు మీద నిర్మించిన కళావేదికలో ప్రజాప్రతినిధుల ప్రమాణ స్వీకారం జరగడం విజయవాడకే కాకుండా రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు.ఈ నెల 23వ తేదీ సోమవారం నిర్వహించనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కార్పొరేటర్ల కుటుంబ సభ్యులను కూడా ఆహ్వానించినట్లు తెలిపారు.

స్థానిక సంస్థలతోనే సుపరిపాలన సాధ్యం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, డాక్టర్ ఎం ఉమేష్ రావు వెల్లడి

శ్రీకాళహస్తి (చైతన్యరథం): ప్రజాస్వామ్య వ్యవస్థలో జవాబుదారీతనం, ప్రజల భాగస్వామ్యం, సమస్యల సత్వర పరిష్కారం, సామాజిక న్యాయం సుపరిపాలన సాధించాలంటే స్థానిక సంస్థల బలోపేతమే ఏకైక పరిష్కారం అని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్ రావు పేర్కొన్నారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం, 18 వ వార్డు, పి.వి.రోడ్డు లోని ద్వారకా నగర్ కాలనీలో తెలుగుదేశం పార్టీ తరఫున 18 వ వార్డు కౌన్సిలర్ శ్రీకాళహస్తి మునిసిపల్ చైర్మన్ స్థానానికి పోటీ చేస్తున్న డాక్టర్ నివేదిత మోరె పేట బాలాజీ రెడ్డికి తమ అమూల్యమైన ఓట్లు సైకిల్ గుర్తుపై వేసి గెలిపించమని కోరుతూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుండటాన్ని చూసి స్థానిక ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన మహిళలు తెలుగుదేశం పార్టీ సీనియర్ ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ మహబూబ్ బాషా సయ్యద్ చాంద్ బాషా ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ జీ దశరథాచారి, ఎం సుబ్బయ్య, సీనియర్ నాయకులు మిన్నల్ రవి, లక్కమనేని మధుబాబు, షేక్ మహబూబ్ బాషా, సయ్యద్ చాంద్ బాషా, కోట చంద్రశేఖర్, గాజుల భగత్, నూర్ మొహమ్మద్, ఖాదర్, ఆదిల్, కరీం, దిల్షాద్, సుల్తాన్, అహ్మద్, అమన్ తదితరులు పాల్గొన్నారు.





నడిగడ్డ పంచాయతీ సర్పంచ్‌గా బోడేపూడి, ఉపసర్పంచ్‌గా ఎర్రబోతుల

నడిగడ్డ (చైతన్యరథం): నడిగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా బోడేపూడి ప్రసాద్, ఉపసర్పంచ్‌గా ఎర్రబోతుల రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అందించిన సహకారం, టీడీపీ యువ నేత బోడేపూడి విఘ్నేష్ నాయకత్వంలో గ్రామంలో నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజల సంపూర్ణ మద్దతు, నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో ఈ ఏకగ్రీవ ఎన్నిక సాధ్యమైంది. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా నూతన సర్పంచ్, ఉపసర్పంచ్ బాధ్యతలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయనున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సహకారంతో, టీడీపీ యువ నేత బోడేపూడి విఘ్నేష్ నాయకత్వంలో నడిగడ్డ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నూతన నాయకత్వం కృషి చేయనుంది. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ బోడేపూడి ప్రసాద్, ఉపసర్పంచ్ ఎర్రబోతుల రామకృష్ణలకు గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.





నెల్లూరులోని వేదాయపాళెం కార్యాలయంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని జిల్లా పరిషత్ చైర్మన్ పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆయన తనయుడు ఏపీ ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దినేష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పోలంరెడ్డికి సోమిరెడ్డి ఆత్మీయ ఆహ్వానం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

జడ్పీ చైర్మన్‌కు అభినందన వెల్లువ

సుగవాసిని కలిసిన మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

రాయచోటి (చైతన్యరథం): రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా పరిషత్ నూతన చైర్మన్, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబును లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే శ్రీ ద్వారకనాథరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ రమేష్ రెడ్డిఫ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసి నూతన బాధ్యతలు చేపట్టిన సుగవాసి ప్రసాద్ బాబుకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాద్ బాబును ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆత్మీయతతో టీడీపీ కార్యాలయం సందడిగా మారింది. ప్రసాద్ బాబు నాయకత్వంలో అన్నమయ్య జిల్లా మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

కూటమి అభ్యర్థి గెలుపు కోసం ముమ్మరంగా ప్రచారం

బీ కొత్తకోట (చైతన్యరథం): నగర పంచాయతీ ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు జోరు పెంచారు. 19వ వార్డులో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా శనివారం నిర్వహించిన విస్తృత ప్రచార కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అన్నమయ్య జిల్లా పరిషత్ చైర్మన్ సుగవాసి ప్రసాద్ బాబు, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా పాల్గొని ప్రజలను నేరుగా కలుసుకుంటూ కూటమి అభ్యర్థులకు మద్దతు కోరారు. బీ కొత్తకోట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి కుడుము శ్రీనివాసులు, 19వ వార్డు కూటమి అభ్యర్థి పాగుండ సమివుల్లా బాషా విజయాన్ని కాంక్షిస్తూ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వార్డు అభివృద్ధికి కూటమి అభ్యర్థులకు అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో, యువ నాయకులు నారా లోకేష్ మార్గదర్శకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. అదే అభివృద్ధి స్ఫూర్తితో బీ కొత్తకోట నగర పంచాయతీలో మెరుగైన మౌలిక సదుపాయాలు, ప్రజలకు మెరుగైన సేవలు, వార్డుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి అభ్యర్థులు ముందుకు సాగుతున్నారని నాయకులు పేర్కొన్నారు.





అయ్యప్ప స్వాముల సేవలో జడ్పీ చైర్మన్ సుగవాసి

శ్రీ గుండాంజనేయ స్వామి ఆలయంలో దీక్ష ధారులకు భిక్ష

రాయచోటి (చైతన్యరథం): శనివారం మధ్యాహ్నం రాయచోటి పట్టణం కడప రోడ్డులోని శ్రీ గుండాంజనేయ స్వామి ఆలయంలో సుగవాసి రాంసాయి కుమారుడు సుగవాసి వంశీ, శ్రీ చింతం రామచంద్రారెడ్డి, డాక్టర్ చింతం నాగార్జున, మన్నూరు శివ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు ఏర్పాటు చేసిన బిక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అన్నమయ్య జిల్లా పరిషత్ నూతన చైర్మన్, రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబును ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువై ఉన్న శ్రీ గుండాంజనేయ స్వామి వారిని, అయ్యప్ప స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. అనంతరం దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములకు స్వయంగా బిక్ష ప్రసాదాన్ని వడ్డించి భక్తిశ్రద్ధలతో సేవలందించారు. అనంతరం అయ్యప్ప స్వాములు సుగవాసి ప్రసాద్ బాబకుపూలమాల వేసి, శాలువాతో ఘనంగా సత్కరించి నూతనంగా అన్నమయ్య జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తి, ఆధ్యాత్మికత, సేవాభావంతో నిర్వహించిన ఈ బిక్ష కార్యక్రమంలో పాల్గొని అయ్యప్ప స్వాముల ఆశీస్సులు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ప్రసాద్ బాబు తెలిపారు.

అభ్యర్థి విజయమే లక్ష్యంగా పనిచేయాలి : శ్రేణులకు మంత్రి అచ్చెన్న పిలుపు



శ్రీకాకుళం (చైతన్యరథం): నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రతి నాయకులు, కార్యకర్త సమష్టిగా పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. నగరంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి కూటమి అభ్యర్థులకు ఓటు అభ్యర్థించాలని సూచించారు. కార్పొరేటర్ అభ్యర్థులతో పాటు మేయర్ అభ్యర్థి అఖండ విజయమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జనసేన శాసనసభ్యులు వంశీకృష్ణ యాదవ్, లోకం మాధవి, మేయర్ అభ్యర్థి డా. దానేటి శ్రీధర్, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, కూటమి ముఖ్య నాయకులు, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణ, ప్రచార ప్రణాళికలపై సమగ్రంగా చర్చించారు. నగరంలోని 60 డివిజన్లలోనూ పక్కా వ్యూహంతో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాలని మంత్రి సూచించారు. ప్రతి డివిజన్‌లో స్థానిక పరిస్థితులు, ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకుని కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. మేయర్ అభ్యర్థితో పాటు అన్ని డివిజన్లలో కూటమి కార్పొరేటర్ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంతోపాటు ప్రత్యర్థులు చేస్తున్న విమర్శలకు దీటుగా సమాధానం చెప్పాలని, వారు లేవనెత్తుతున్న అంశాలను తేలిగ్గా తీసుకోకుండా వాస్తవాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ తేలిగ్గా తీసుకోవద్దని, ఒక్క ఓటు కూడా ఎంతో విలువైనదని పేర్కొన్నారు. ప్రచారంలో ప్రతి అంశానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు చేరువ కావాలన్నారు. కూటమి పార్టీల మధ్య ఐక్యత, సమన్వయమే ఎన్నికల కార్యాచరణలో కీలకమని మంత్రి పేర్కొన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.



గ్రామ స్వరాజ్యం కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలి

హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పిలుపు

పెనుకొండ (చైతన్యరథం): గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రావాలంటే కూటమి అభ్యర్థుల్ని గెలిపించాలని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే ప్రభుత్వాలు 20, 30 సంవత్సరాల పాటు ఏకధాటిగా పరిపాలించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లను క్లీన్ స్వీట్ చేసిన కూటమికి అదే తరహాలో సర్పంచ్ అభ్యర్థుల్ని గెలిపించి పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈవీఎం అయినా బ్యాలెట్ అయినా కూటమి వైపే ప్రజలు నిలబడతారన్నారు. వైసీపీ పాలనలో ఎన్నికల్లో ప్రజలు ఓటేసేందుకు భయపడ్డారన్నారు. అందుకే చంద్రబాబు అప్పట్లో ఎన్నికలను బహిష్కరించారని వివరించారు. ఇప్పుడు స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరుగుతుంటే జరగకుండా కోర్టులో 60కు పైగా కేసులు వైసీపి పార్టీ వాళ్లు వేశారని ధ్వజమెత్తారు.



గాండ్లపెంట మండలానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సీపు అబ్దుల్ రవూఫ్ వైసీపీ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గాండ్లపెంట మండల నాయకులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యం

టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు స్పష్టీకరణ



అనంతపురం (చైతన్యరథం): హోలీ ఫైర్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అనంతపురం జిల్లా ఆధ్వర్యంలో నారాయణపురం ఇందిరమ్మ కాలనీలో జీవముగల దేవుని మందిరం లో సపోజ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉంటేనే అన్ని వర్గాల ప్రజలు బాగుపడతారన్నారు. క్రైస్తవుల సంక్షేమం అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టారన్నారు. పాస్టర్ లందరికీ డిసెంబర్లో గౌరవేతనం అకౌంట్లో జమ జరుగుతుందని స్వామిదాసు తెలిపారు. 2014 – 19 సంవత్సర కాలంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుంటూరు విజయవాడ మధ్యన రెండు ఎకరాల స్థలం ఇచ్చి క్రిస్టియన్ భవనం కోసం 15 కోట్లు నిధులు కేటాయించరన్నారు. క్రిస్మస్ పండుగ రోజున క్రిస్మస్ హై టీ ప్రోగ్రాంకు గతంలో జగన్మోహన్ రెడ్డి 30 వేలు ఇచ్చే వారని చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రెండు లక్షల రూపాయలకు పెంచారన్నారు. దీన్నిబట్టి క్రైస్తవుల పట్ల ప్రేమ ఎవరికి ఉన్నదో అర్థమవుతుందన్నారు. క్రైస్తవుల కోసం పాస్టర్స్ కోసం ఈ బడ్జెట్ లో 150 కోట్లు కేటాయించారన్నారు. ఈ నెలలో సబ్సిడీ లోన్స్ ఆన్లైన్ ప్రారంభమవుతాయని అన్నారు. క్రైస్తవులు జెరూసలేమి యాత్ర వెళ్లే వారికి 60వేల రూపాయలు సబ్సిడీ ఇస్తుందని అన్నారు. చర్చి నిర్మాణాలకు ఐదు లక్షల రూపాయలు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ సంక్షేమ పథకాలన్నీ క్రైస్తవులు, పాస్టర్స్ సద్వినిచేసుకోవాల్సిందిగా ఈటె స్వామిదాసు కోరారు. కార్యక్రమం అనంతరం పాస్టర్స్ కు ఈటి స్వామి దాసు గిఫ్ట్ పంపిణీ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఫెడ్రిక్ బాబు, వయసు ప్రెసిడెంట్ తిమోతి, సెక్రటరీ జేమ్స్ రవి, జాయింట్ సెక్రెటరీ వెంకటరమణయ్య, ట్రెజరర్ వై భాస్కర్, ఈసీ మెంబర్లు ఎలీషా, శంకర్ రెడ్డి, ఎలిజిబెత్,విజయ్, కుమార్, మనోహర్, జోసెఫ్, ఫెలోషిప్ పాస్టర్స్ పాల్గొన్నారు.



వైసీపీ తప్పుడు ప్రచారాలను ప్రజలే తిప్పికొట్టారు

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన ఘన విజయాలను చూసి వైసీపీ నాయకులు ఓటమిని జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలు, తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా, ఓటమికి సాకులు వెతుక్కోవడం వైసీపీ నాయకుల రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఏకపక్ష విజయాలు సాధించిందని, గ్రామీణ ప్రాంతాల్లోనూ జడ్పీటీసీ, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ప్రజలు కూటమికి అండగా నిలిచారని పేర్కొన్నారు. గతంలో ఈవీఎంలపై ఆరోపణలు చేసిన వైసీపీకి, ఇప్పుడు బ్యాలెట్ ఎన్నికల్లోనూ ప్రజలు గట్టి సమాధానం ఇచ్చారని తెలిపారు. ప్రజల తీర్పు కూటమికి అనుకూలంగా ఉన్నప్పుడు దాన్ని అంగీకరించలేక ఆరోపణలు చేయడం వైసీపీకి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దౌర్జన్యాలు, దాడులు, రాజకీయ కక్షసాధింపు చర్యలు ప్రజలకు ఇంకా గుర్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ ఎన్నికలు నిర్వహించిందని స్పష్టం చేశారు. గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని వ్యవహరించిన వారు, ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి తాను వెళ్లినట్లు వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ఖండించారు. తాను కౌంటింగ్ కేంద్రానికి వెళ్లలేదని, పోలింగ్ బూత్‌లోకి కూడా ప్రవేశించలేదని స్పష్టం చేశారు. ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని ప్రయత్నించడం మానుకోవాలని హితవు పలికారు. నిజాలు ప్రజలకు తెలుసునని, తప్పుడు ప్రచారాలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. రాష్ట్రంలో ఎల్ నినో, సూపర్ ఎల్ నినో వంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ తాగునీరు, సాగునీటికి ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపుతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కరువు పరిస్థితుల్లోనూ ప్రజలకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వ పనితీరును ప్రజలు గమనిస్తున్నారని, అందుకే ఎన్నికల్లో కూటమికి అఖండ విజయాన్ని అందించారని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకొని ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, మనలో మనం విభేదాలు పెట్టుకోకుండా కూటమి ఐక్యతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు ఘన విజయాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కోరారు. వైసీపీకి ప్రజల తీర్పే సమాధానం.. కూటమి విజయ పరంపర గ్రామ పంచాయతీల్లోనూ కొనసాగుతుందన్నారు.



న్యూయార్క్‌లో శివార్చన

ఘనంగా 'హరహర మహాదేవ-శివతత్త్వాలు' సంగీత విభావరి

స్వర వీణాపాణి గాన సుధతో పులకించిన తెలుగు సమాజం

న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ప్రవాస భారతీయులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఎస్‌పీబీ మ్యూజిక్ అకాడమీ (SPBMA), న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం (NYTTA) సంయుక్త ఆధ్వర్యంలో హిక్స్‌విల్‌లోని ఆసామయి హిందూ టెంపుల్-సాయి దర్బార్ వేదికగా "హరహర మహాదేవ-శివ తత్త్వాలు" భక్తి సంగీత విభావరి ఘనంగా జరిగింది.

72 మేళకర్త రాగాల మధురిమ:

'మిథునం' చిత్ర సంగీత దర్శకుడు, 62 గంటల నిరంతర సంగీత ప్రదర్శనతో గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించిన స్వర వీణాపాణి ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. శివ మహిమను, తత్త్వాన్ని ఆవిష్కరించే భావపూర్ణ గీతాలతో పాటు ఆయన చేసిన తాత్త్విక వ్యాఖ్యానాలు సభికులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా 72 మేళకర్త రాగాలతో రూపొందించిన కీర్తనల ప్రదర్శన, రాగాల విశిష్టతపై ఆయన వివరణ విశేషంగా ఆకట్టుకుంది. వీణాపాణికి మృదంగంపై సహకారం అందించిన చిన్నారి నవనీత్ అయ్యర్ తన ప్రతిభతో అందరి హృదయాలను దోచుకున్నాడు. వీణాపాణి ఆ బాలుడిని శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు.

ఆకట్టుకున్న గాయకుల ఆలాపన:

బోస్టన్ నుంచి విచ్చేసిన ప్రఖ్యాత గాయకుడు వైఎస్ రామకృష్ణ, ఎస్‌పీబీఎంఏ గాయకులు కుమార్ బుధరాజు, వేణు పాల్యం, శ్రీనివాస్ గూడూరు, రాజేశ్వరి బుర్రా ఆలపించిన భక్తి గీతాలు శ్రోతలను అలరించాయి. ఎస్‌పీబీఎంఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కుమార్ బుధరాజు, వేణు పాల్యం వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

యువ ప్రతిభకు పట్టం-అతిథులకు సత్కారం:

న్యూయార్క్‌లో పెరిగి కళారంగంలో రాణిస్తున్న యువ ప్రతిభావంతులను ఎస్‌పీబీ మ్యూజిక్ అకాడమీ ఘనంగా సత్కరించింది. తెలుగు సారస్వత సాంస్కృతిక సంఘం మాజీ నేత ఉదయ్ దొమ్మరాజు-హేమ దొమ్మరాజు దంపతుల తనయుడు,



ఇప్పటికే మూడు చిత్రాల్లో నటించిన ఈశ్వర్ దొమ్మరాజును, సాంస్కృతిక-సామాజిక సేవలో చురుగ్గా పాల్గొంటున్న దివ్య దొమ్మరాజును ప్రత్యేకంగా అభినందించారు.

స్వర వీణాపాణితో పాటు వైఎస్ రామకృష్ణ, ఎన్‌వైటీటీఏ ప్రెసిడెంట్ డాక్టర్ రవీందర్ కోడెల, ఎస్‌పీబీఎంఏ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గూడూరు, టీఎల్‌సీఏ ట్రస్టీ మోహన్ బాధే, ప్రెసిడెంట్ సుమంత్ రామిశెట్టి, టీటీఏ ప్రెసిడెంట్ ఎలెక్ట్ సహోదర్ పెద్దిరెడ్డి, తానా రీజినల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ బర్తవరపులను నిర్వాహకులు సత్కరించారు.

అన్ని సంస్థల శ్రేయోభిలాషి, మహాదాత డాక్టర్ పైళ్ల మల్లారెడ్డికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమ విజయానికి తెర వెనుక కృషి చేసిన సునీల్ రెడ్డి, మహేష్, విజయేందర్, వాణి చందు సింగిరికొండ, వాణి అనుగు, పద్మ కొడెల, రమ వనమ, దాతలు, వాలంటీర్లకు అకాడమీ ధన్యవాదాలు తెలిపింది.

ఎన్‌వైటీటీఏ చైర్మన్ డాక్టర్ రాజేందర్ రెడ్డి జిన్నా, వైస్ చైర్మన్ లక్ష్మణరెడ్డి అనుగు, అడ్వైజర్ చినబాబు రెడ్డి, ఎస్‌పీబీఎంఏ చైర్మన్ హరి ఎప్పనపల్లి, బోర్డు సభ్యులు సుజాత వెంపరాల, లావణ్య మడకశిర, రాజేశ్వరి బుర్ర, టీఎల్‌సీఏ కార్యవర్గ సభ్యులు శిరీష తునుగుంట్ల అభినందనలు తెలిపారు. అన్ని తెలుగు సంస్థల సమష్టి కృషి వల్లే ఈ కార్యక్రమం విజయవంతమైందని నిర్వాహకుడు శ్రీనివాస్ గూడూరు పేర్కొన్నారు.

'తానా వేడుకలకు వెంకయ్యకు ఆహ్వానం



నెల్లూరు: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో డిసెంబరు 29న హైదరాబాద్‌లోని శిల్ప కళా వేదికలో 'తానా పురస్కారాల ప్రదానోత్సవం' నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో అద్భుతమైన సేవలు అందించిన పది మంది ప్రముఖులను సత్కరించనున్నారు. ఈ వేడుకలకు రావాల్సిందిగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుని తానా బోర్డు సభ్యుడు రవి పొట్లూరి స్వయంగా కలిసి ఆహ్వానించారు. తానా నిర్వహిస్తున్న సేవలను, వేడుకల వివరాలను వెంకయ్యకు తెలియజేశారు. ఆయన తానా సేవలను అభినందిస్తూ కార్యక్రమానికి వస్తానని హామీ ఇచ్చారు.

ఆస్ట్రేలియా ఎన్నికల బరిలో తెలుగు మహిళ



లావర్టన్ (ఆస్ట్రేలియా): విదేశీ గడ్డపై రాజకీయాల్లో తనదైన ముద్ర వేసేందుకు తెలుగు మహిళ సిద్ధమైంది. తెలంగాణ రాష్ట్రం కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం అంతంపల్లి గ్రామానికి చెందిన చిట్టెడి సుచిత్ర ఆస్ట్రేలియాలో ఎన్నికల బరిలో నిలిచారు. 'ది రిపబ్లికన్ పార్టీ' తరపున విక్టోరియా రాష్ట్రంలోని లావర్టన్ నియోజకవర్గం నుంచి సుచిత్ర పోటీ చేస్తున్నట్టు ఆమె బంధువులు తెలిపారు. ఈ నెల 28వ తేదీన జరగనున్న ఎన్నికల్లో లావర్టన్ నియోజకవర్గం నుంచి మొత్తం తొమ్మిది మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా సుచిత్ర ప్రచారంలో దూసుకుపోతున్నారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించడంతో పాటు కాలుష్య నియంత్రణ చర్యలు, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందేలా కృషి చేస్తానని ఆమె హామీ ఇస్తున్నారు. సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన చిట్టెడి గంగారెడ్డి-వినోద దంపతుల కుమార్తె అయిన సుచిత్ర 2014లో ఉన్నత విద్యా భ్యాసం నిమిత్తం ఆస్ట్రేలియా వెళ్లింది. అంతంపల్లి గ్రామానికే చెందిన భర్త రాకేష్‌రెడ్డి సహకారంతో అక్కడే స్థిరపడింది. తమ గ్రామానికి చెందిన ఆడబిడ్డ విదేశీ ఎన్నికల్లో పోటీ చేస్తుండటంపై అంతంపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో సుచిత్ర ఘన విజయం సాధించి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వారు ఆకాంక్షిస్తున్నారు.

వారం క్రితమే ఉద్యోగం...

అంతలోనే విషాదం

అమెరికా రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు దుర్మరణం

యూఎస్ఏ: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి ఇటీవలే ఉద్యోగం సాధించిన తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా మునుగోడు పట్టణానికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. మునుగోడుకి చెందిన ఈరమళ్ల ప్రసాద్-శ్రీకన్య దంపతుల పెద్ద కుమారుడు



సాయితేజ (25) ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు. చదువు పూర్తయిన అతడికి వారం క్రితమే అక్కడ ఉద్యోగం వచ్చింది. ఈ క్రమంలో సాయితేజ కారులో విధలకు వెళ్తుండగా రోడ్డుపైకి ఒక జింక అడ్డుగా వచ్చింది. దీంతో అతడు ప్రయాణిస్తున్న కారు జింకను ఢీకొని ఆగిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న వాహనాలు వరుసగా అతడి కారును బలంగా ఢీకొట్టడంతో సాయితేజకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. తమ కుమారుడు ఉద్యోగం సాధించాడన్న సంతోషంలో ఉండగా ఈ విషాద వార్త తెలియడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. సాయితేజ భౌతికకాయం ఆదివారం రాత్రికి స్వస్థలమైన మునుగోడుకు చేరుకునే అవకాశం ఉంది.





ఏపీ వైద్య రంగానికి యూకే తోడ్పాటు

- ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్ బృందం పర్యటన విజయవంతం
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు ప్రతిష్టాత్మక సంస్థల ఆసక్తి

యూకే: వైద్య, ఆరోగ్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దార్శనికతకు అనుగుణంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్ నేతృత్వంలోని బృందం చేపట్టిన ఐదు రోజుల యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) పర్యటన విజయవంతంగా ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వ యూరప్ ప్రత్యేక ప్రతినిధి గుంటుపల్లి జయకుమార్ సమన్వయంతో ఏపీ ప్రతినిధి బృందం యూకేలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రముఖ వైద్య, ఆరోగ్య, విద్యా సంస్థల ప్రతినిధులతో విస్తృతంగా సమావేశమైంది. రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం, వైద్య విద్య, పరిశోధన రంగాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడం, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య రంగంలో ఉన్న విస్తృత పెట్టుబడి అవకాశాలను పరిశీలించడం వంటి అంశాలపై చర్చించారు. యూనివర్సిటీ కాలేజ్ లండన్ (UCL), లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (LSE), క్వీన్ ఎలిజబెత్ హాస్పిటల్, NHS UK,



గేట్స్ ఫౌండేషన్, ఇంపీరియల్ కాలేజ్ లండన్, హెల్త్ గ్లోబల్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్, BIT, AI Health, NICE, RAI UK, TCS UK తదితర ప్రతిష్ఠాత్మక సంస్థల ప్రతినిధులతో బృందం భేటీ అయ్యింది. సమావేశాల్లో పాల్గొన్న పెట్టుబడిదారులు, వైద్య నిపుణులు, విద్యావేత్తలు ఏపీ ఆరోగ్య రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సానుకూలంగా స్పందించి ఆసక్తి కనబరిచారు.

ఆవిష్కరణలకు మార్గదర్శకం ఐఐటీ ఖరగ్‌పూర్

ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ప్రధాని మోదీ - 75 ఏళ్ల ప్రస్థాన స్మారక నాణేం ఆవిష్కరణ

పశ్చిమబెంగాల్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఖరగ్‌పూర్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ఐఐటీ ఖరగ్‌పూర్ 75 ఏళ్ల ప్రస్థానాన్ని గుర్తు చేస్తూ ప్రత్యేక స్మారక నాణేన్ని మోదీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రొఫెసర్లతో ఆయన ముచ్చటించారు. భారతదేశ అభివృద్ధికి ఐఐటీ ఖరగ్‌పూర్ అందించిన సహకారాన్ని వారికి వివరించారు. గడిచిన ఏడున్నర దశాబ్దాల్లో దేశం అనేక రంగాల్లో గణనీయమైన మార్పులను చూసిందని, ఈ ప్రయాణం లో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక పాత్ర పోషించిందని మోదీ పేర్కొ న్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 1951లో ప్రారంభమైన ఐఐటీ ఖరగ్‌పూర్ దేశంలోనే తొలి ఐఐటీగా పేరుగాంచిందని అన్నారు. సాంకేతిక విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు మార్గదర్శకంగా నిలిచిందని ప్రశంసించారు. తొలినాళ్లలో పారిశ్రామిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవస రమైన ఇంజనీర్లను అందించిందని.. ఆ తర్వాత అంతరిక్ష



పరిశోధనలు, అణుశక్తి రంగాల్లోనూ దేశానికి సేవలందించిన ప్రతిభావంతులను తీర్చిదిద్దిందని కొనియాడారు. సమాచార సాంకేతిక రంగం విస్తరించిన తర్వాత సాఫ్ట్‌వేర్ పరిశ్రమ అభివృద్ధిలోనూ ఖరగ్‌పూర్ పూర్వ విద్యార్థులు కీలక పాత్ర పోషించారని ప్రశంసల జల్లు కురిపించారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ కంపెనీలకు నాయకత్వం వహించే వరకూ ఐఐటీ పూర్వ విద్యార్థులు ఎదిగారని కొనియాడారు. మరోవైపు, ఐఐటీ ఖరగ్‌పూర్ ఉన్న ప్రదేశానికి స్వాతంత్ర్య పోరాటంతోనూ సంబంధం ఉందని ప్రధాని మోదీ గుర్తుచేశారు. బ్రిటిష్ పాలనలో ఈ ప్రాంతం స్వాతంత్ర్య సమరయోధులను నిర్బంధించిన శిబిరంగా ఉండేదని పేర్కొన్నారు. ఒకప్పుడు స్వాతంత్ర్యం కోసం కలలు కన్న ఈ నేల.. ఇప్పుడు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే వేదికగా మారిందన్నారు. ఈ సందర్భంగా పరిమితులను అధిగమించి, అవకాశాలను ఆవిష్కరించాలని విద్యార్థులకు ప్రధాని పిలుపునిచ్చా రు. చాలామంది తమ కలలు, సామర్థ్యాలు, లక్ష్యాలకు హద్దులు విధించుకుంటారని.. ఇలాంటి పరిమిత ఆలోచనలను విడిచిపెట్టి కొత్త అవకాశాలను అన్వేషించాలని సూచించారు. 'బ్రేక్ ద లిమిట్.. అన్‌లాక్ ద పాసిబిలిటీస్' అంటూ మోదీ పేర్కొన్నారు. ఆలోచనా పరిధిని విస్తరించుకున్నప్పుడే వ్యక్తులు, దేశం తమ అసలైన సామర్థ్యాన్ని గుర్తించగలవని ప్రధాని మోదీ చెప్పారు. కాలానికి అనుగుణంగా ఐఐటీ ఖరగ్‌పూర్ ఇంజనీరింగ్, పరిశోధన రంగాల్లో తన పాత్రను కొనసాగిస్తోందని, విద్యార్థులు కూడా తమ ప్రతిభను దేశ భవిష్యత్తు నిర్మాణానికి ఉపయోగించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

ఐఐటీ ఖరగ్‌పూర్‌కు గూగుల్ విరాళం

ఖరగ్‌పూర్: ఏఐపై పరిశోధనల కోసం ఐఐటీ ఖరగ్‌పూర్‌కు టెక్ దిగ్గజం గూగుల్ 5 మిలియన్ డాలర్ల (రూ.46.34 కోట్లు) విరాళాన్ని ప్రకటించింది. వ్యవసాయం, విద్య, మెటీరియల్ సైన్స్, భారతీయ భాషల్లో వినియోగించేందుకు అనువైన ఏఐ సాధనాల అభివృద్ధి కోసం గూగుల్ ఈ నిధులను కేటాయించింది. విద్యా ర్థులు, టీచర్లకు ఏఐపై శిక్షణలో సాయపడటంతో పాటు ఐఐటీ ఖరగ్‌పూర్‌లో సాంకేతిక మౌలిక వసతుల కల్పనకు కూడా అండగా ఉంటామని గూగుల్ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు తన బ్లాగ్ పోస్టులో వెల్లడించింది. భారతీయ భాషలు మాట్లాడేవారి అవసరాలకు అనుగుణంగా ఏఐ సాధనాల అభివృద్ధికి గూగుల్ ఈ నిధులను కేటాయించింది. విద్యార్థులు, టీచర్లు, ఇతర ఫాకల్టీ సభ్యుల కోసం ఏఐ సిలబస్ రూపొందిం చేందుకు కూడా ఈ నిధులను వినియోగించనున్నారు. వీటితో పాటు ఐఐటీ



ఖరగ్‌పూర్‌లో ఏఐ ఫ్రేమ్‌వర్క్, టూల్స్ వంటి మౌలికవసతుల అభివృద్ధికి కూడా ఈ నిధులను వినియోగిస్తారు. భారతీయ ఏఐ రంగంపై పట్టుసాధించేందుకు గూగుల్ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఏఐ పరిశోధనల కోసం ఐఐటీ ఖరగ్‌పూర్‌కు నిధులను కేటాయిస్తోంది. రాబోయే ఐదేళ్ల కాలానికి గూగుల్ 15 బిలియన్ డాలర్ల నిధులను ఇప్పటికే ప్రకటించింది. ఇందులో భాగంగా వైజాగ్‌లో ఏఐ హబ్ నిర్మించనుంది.

నితీశ్ సేతు బ్రిడ్జి ప్రారంభం



బిహారం: ప్రధాని నరేంద్ర మోదీ బిహార్‌లోని వైశాలి జిల్లాలో కచ్చీ దర్గా–రాఘవ్‌పూర్–బిడుపుర్ బ్రిడ్జిని ప్రారంభించారు. ఆరు లేన్లు ఉన్న ఈ బ్రిడ్జికి బిహార్ మాజీ సీఎం నితీశ్ కుమార్ గౌరవార్థం 'నితీశ్ సేతు' అని పేరుపెట్టారు. బిహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్, ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరి, కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్, డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ చౌధరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్రిడ్జిని ప్రారంభించాక వారంతా మోదీతో కలిసి నడిచారు. నితీశ్ సేతు బ్రిడ్జిని రూ.4,280 కోట్లతో గంగా నదిపై నిర్మించారు. పూర్తిగా కేబుళ్లతో దీనిని కట్టారు. దీని పొడవు 19.7 కిలోమీటర్లు. పట్నా జిల్లాలోని జాతీయ రహదారి 22పై ఉన్న కచ్చీ దర్గాను వైశాలి జిల్లాలోని జాతీయ రహదారి 322పై ఉన్న బిడుపుర్‌తో ఈ బ్రిడ్జి కలుపుతుంది. అంటే పట్నా, వైశాలిని ఇది అనుసంధానిస్తుంది. ఇందులో 9.7 కిలోమీటర్లు మెయిన్ బ్రిడ్జి కాగా.. 10 కిలో మీటర్లు అప్రోచ్ రోడ్లు ఉన్నాయి. ఈ బ్రిడ్జితో ప్రయాణ సమయం 20 నుంచి 25 నిమిషాలకు తగ్గుతుంది. ప్రముఖ సంస్థ లార్సెన్ అండ్ ట్యూబ్రో, దక్షిణ కొరియా కంపెనీ డైవూ కలిసి ఈ బ్రిడ్జిని నిర్మించాయి. కాగా నితీశ్ సేతు బ్రిడ్జిని ప్రారంభించేందుకు పట్నా ఎయిర్‌పోర్టు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీని బిహార్ మాజీ సీఎం నితీశ్ కమార్ రిసీవ్ చేసుకున్నారు.

తాజ్‌మహల్‌ను సందర్శించవచ్చు..

పాక్ మంత్రికి అనుమతి





ఢిల్లీ: ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను సందర్శించేందుకు పాకిస్తా న్ వాతావరణ శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే, ఢిల్లీలోని నిజాముద్దీన్ దర్గాను సందర్శించేందుకు మాత్రం అనుమతి నిరాకరించింది. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) నాగరికతల సంభా షణల వేదిక సదస్సులో పాల్గొనేందుకు మాలిక్ భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే. తాజ్ మహల్‌తో పాటు నిజాముద్దీన్ దర్గాను సందర్శించేందుకు అంతకుముందు ఆయన అనుమతి కోరగా ప్రభుత్వం నిరాకరించింది. ప్రస్తుతం తాజ్‌ను సందర్శించేందుకు మాత్రమే ఆయనకు అనుమతి ఇచ్చింది. అలాగే హుమాయున్ సమాధి, ఢిల్లీ హాత్ సహా ఢిల్లీలోని వివిధ చారిత్రక ప్రాంతాల సందర్శ నకూ ఆయనకు క్లియరెన్స్ లభించింది. దీంతో మాలిక్ నేతృత్వంలోని బృందం ఆ ప్రాంతాలను సందర్శించనుంది.

ఒకరికొకరం సందర్శించుకుంటూనే ఉంటాం

గతంలో సింధూ జలాల ఒప్పందంపై కామెంట్లు చేసిన తర్వాత ఎస్‌సీఓ నాగరికతల సంభాషణల సదస్సులో పాల్గొనేందుకు మాలిక్.. భారత్ వచ్చారు. గత మూడేళ్లలో ఒక పాకిస్తానీ మంత్రి మన దేశాన్ని సందర్శించడం ఇదే మొదటిసారి. శుక్రవారం సదస్సు ప్రారంభమైన తర్వాత మీడియాతో ఆయన మాట్లాడారు.

శాంతి, భద్రతను ముందుకు తీసుకెళ్లే విషయంలో చేసే అన్ని ప్రయత్నాలకు పాక్ మద్దతు ఇస్తుందని ఆయన చెప్పారు. భారత్‌కు ఇక ఫిర్యాదులు ఉండవని, ఇకపై రెండు దేశాల మధ్య పర్యటనలు ఉంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్‌సీఓ సభ్య దేశాల మధ్య మెరుగైన సంబంధాల కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా సభ్య దేశాలు పాటుపడతాయని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీడల్లో మతాన్ని తీసుకురావద్దు..
ఇమ్రాన్‌కు తోటి ఎంపీ రంజన్ సూచన



ఢిల్లీ: న్యూజిల్యాండ్‌తో జరుగుతున్న మొదటి టెస్టులో భారత పేసర్ మహమ్మద్ సిరాజ్‌ను పక్కన పెట్టడంపై మతపరమైన ఆరోపణలు చేసిన కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్‌కు సొంత పార్టీ నుంచే బౌన్సర్ ఎదురైంది. క్రీడల్లో జోక్యం చేసుకోరాదని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రంజీత్ రంజన్ సూచిం చారు. క్రీడల్లోకి మతాన్ని తీసుకురావద్దని ఆమె హెచ్చరించారు. శనివారం ఓ వార్తా సంస్థతో రంజన్ మాట్లాడారు. క్రీడల్లోకి మతాన్ని తీసుకురావడం సరికాదన్నారు. 'మసూద్‌జీ.. క్రీడలు, రాజకీయాలను పక్కన పెట్టండి. స్పోర్ట్స్‌లో జోక్యం చేసుకోవద్దు. ఎందుకంటే క్రీడలకు వాటి సొంత డొమైన్, క్రైటీరియా ఉన్నాయి. ప్రతి ప్లేయర్ కూడా జట్టులోకి రావడానికి, దేశానికి ప్రాతినిధ్యం వహించడానికి ఎంతో కష్టపడుతున్నారు. క్రీడలను, క్రీడాకారులను రాజకీయ చర్చల్లోకి లాగరాదు. అలా చేయడం ఆమోదయోగ్యం కాదు' అని రంజన్ వ్యాఖ్యానించారు.

పారిశ్రామిక విప్లవం కంటే ఏఐ విప్లవమే పెద్దది

ఆంథ్రోపిక్ ఐపీఓపై ట్రంప్ ప్రశంసలు

అమెరికా: పారిశ్రామిక విప్లవం కంటే ఏఐ విప్లవమే పెద్దదని, ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేయబోతోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రముఖ ఏఐ సంస్థ ఆంథ్రోపిక్ భారీ ఐపీఓతో స్టాక్ మార్కెట్లో రికార్డు సృష్టించడంపై ఆయన ప్రశంసలు కురిపించారు. ఆ సంస్థ సీఈఓ డారియో అమోడీపై తనకు ఎంతో గౌరవం ఉందని చెప్పారు. అలాగే అమెరికాలో ఏఐ డేటా సెంటర్ల నిర్మాణానికి అనుమతులు ఆలస్యం చేస్తే, కంపెనీలు ఇతర దేశాలకు వెళ్లిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఏఐ అనేది పారిశ్రామిక విప్లవం కంటే పెద్దదని, తాను కూడా ఆ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నానని వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ అన్నారు. ఆంథ్రోపిక్ ఐపీఓ రికార్డు సృష్టించిందని, ఏఐ రంగంలో అమెరికా అగ్రస్థానాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఏఐ రంగంలో అమెరికా ఆధిపత్యాన్ని కొనసాగించాలంటే భారీ మౌలిక సదుపా యాలు అవసరమని ట్రంప్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఏఐ మోడళ్ల శిక్షణ, నిర్వహణ కోసం డేటా సెంటర్లు కీలకమని చెప్పారు. డేటా కేంద్రాల నిర్మాణానికి స్థానికంగా అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుంటే, కంపెనీలు ఇతర దేశాలకు వెళ్లి తమ కార్యకలాపాలు ప్రారంభిస్తాయని హెచ్చరించారు. ప్రపంచంలోని అనేక దేశాలు ఏఐ సంస్థలను ఆకర్షించేందుకు ఆసక్తి చూపుతు న్నాయని అన్నారు. అమెరికాలోనే ఈ సంస్థలు పెట్టుబడులు పెట్టాలని, ఉద్యోగాలు సృష్టించాలని ట్రంప్ ఆకాంక్షించారు. అనుమతుల విషయంలో అనవసర జాప్యం జరిగితే దేశానికి ఆర్థికంగా నష్టం కలగవచ్చని అభిప్రాయపడ్డారు. ఆంథ్రోపిక్ సంస్థ నవంబరు 19న నాస్‌డాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో అడుగు పెట్టింది. ఇప్పటివరకు నమోదైన అతిపెద్ద ఐపీఓగా ఇది నిలిచింది.



భారత్‌ను చూసి నేర్చుకోండి..

అమెరికా వడ్డీ రేట్లపై ట్రంప్ వ్యాఖ్యలు



అమెరికా: అమెరికా అధ్యక్షుడు తమ దేశ కేంద్ర బ్యాంకు అయిన ఫెడరల్ రిజర్వ్‌పై విమర్శలు గుప్పించారు. వడ్డీ రేట్లు ఎక్కువగా ఉండటంతో దేశ ఆర్థిక వృద్ధికి ఆటంకం కలుగు తోందని ఆరోపించారు. ఇదే సమయంలో భారత్‌ను ఉదాహర ణగా చూపిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో తక్కువ వడ్డీ రేట్లు ఉన్నాయని, ఏడు శాతం ఆర్థిక వృద్ధి నమోదవుతోందని ప్రశంసించారు. అమెరికా కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తే 15 నుంచి 20 శాతం వరకు జీడీపీ వృద్ధి సాధించవచ్చని వ్యాఖ్యా నించారు. వైట్‌హౌస్‌లో శు క్రవారం మీడియాతో మాట్లాడిన ట్రంప్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ సంస్థ రాజకీయ ప్రభావంతో పనిచేస్తోందని విమర్శిం చారు. ఆర్థిక గణాంకాలు మెరుగ్గా ఉన్న సమయంలో వడ్డీ రేట్లను తగ్గించాల్సింది పోయి పెంచడం ఏమిటని ప్రశ్నించారు. దేశ ఆర్థిక పరిస్థితి బలంగా ఉన్నప్పుడు అప్పులు తీసుకునేవారికి ఖర్చు తగ్గించాలని, కానీ అమెరికా కేంద్ర బ్యాంకు అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం జరుగుతోందని అన్నారు. భారత్‌లో తక్కువ వడ్డీ రేట్లు ఉన్నప్పటికీ ఏడు శాతం స్థాయిలో జీడీపీ వృద్ధి నమోదవుతోందని ప్రశంసించారు. భారత్‌ను చూడాలని, అక్కడి ఆర్థిక వృద్ధిని గమ నించాలని అమెరికా విధాన నిర్ణేతలకు సూచించారు. అమెరికా ప్రపంచంలోనే అత్యల్ప వడ్డీ రేట్లు కలిగిన దేశంగా ఉండాలని అన్నారు. ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థలు విజయవంతం కావడానికి అమెరికా కీలక పాత్ర పోషిస్తోందని, అలాంటి అమెరికాకే అత్యల్ప వడ్డీ రేట్లు ఉండాలని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గిస్తే 14 నుంచి 20 శాతం వరకు ఆర్థిక వృద్ధి సాధించ వచ్చని తెలిపారు. ప్రస్తుతం అమెరికాలో సుమారు నాలుగు శాతం వృద్ధి నమోదవుతోంది.

పెరిగిన జీవన వ్యయంపై ఇటలీలో నిరసనలు



రోమ్: ఇటలీలో పెరిగిపోయిన జీవన వ్యయంపై శుక్రవారం పలు నగరాల్లో కార్మికులు, విద్యార్థులు ప్రదర్శనలు నిర్వహించారు. వేతనాలు పెంచాలని, జీవన వ్యయం తగ్గించాలని, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పెరిగిపోయిన జీవన వ్యయంపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఇటలీలోని అతి పెద్ద ట్రేడ్ యూనియన్ సీజీఐఎల్ 24 గంటలపాటు నిరసనలకు పిలుపు ఇచ్చింది. దీంతో నిరసనకారులు 100కు పైగా నగరాల్లో ప్రదర్శ నలు నిర్వహించారు. వేతనాలు నామమాత్రంగా ఉన్నాయని, జీవన వ్యయాలు పెరిగిపోతూనే ఉన్నాయని వారు పేర్కొన్నారు.

హెలికాప్టర్ల నుంచి తూటాల వర్షం

కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ అరెస్ట్

మెక్సికో: మెక్సికోలో కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ ఫాస్టో ఇసిడ్రో మెజా ఫ్లోరెస్‌ను అరెస్టు చేసేందుకు అక్కడి మిలిటరీ శుక్రవారం భారీ ఆపరేషన్‌కు నిర్వహించింది. ఈ క్రమంలో హెలికాప్టర్ల నుంచి క్రిమినల్స్‌పై తూటాల వర్షం కురిపించింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అమెరికాకు భారీస్థాయిలో డ్రగ్స్‌ను అక్రమంగా తరలించే మెజా-ఫ్లోరెస్ గ్యాంగ్‌కు ఇసిడ్రో ఫ్లోరెస్ బాస్. ఫ్లోరెస్‌ను పరారీలో ఉన్న నేరగాడిగా అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ ఇప్పటికే ప్రకటిం చింది. మెక్సికోలోని సినలోవా ప్రావిన్స్‌లోగల గువాసేవ్ ప్రాంతం లో దాక్కున్న అతడిని పట్టుకునేందుకు మిలిటరీతో పాటు పోలీసు సిబ్బంది కూడా రంగంలోకి దిగారు. ఫ్లోరెస్ ముఠా సభ్యులు ఏకంగా మిలిటరీపై కాల్పులకు దిగడంతో సైన్యం దీటుగా జవా బిచ్చింది. ఏకంగా హెలికాప్టర్లతో వారిపై తూటాల వర్షం కురిపిం చింది. ఫ్లోరెస్‌ను మెక్సికో సైన్యం అరెస్టు చేసినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ప్రభుత్వం ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. ఈ ఆపరేష న్‌లో పాలుపంచుకున్న ప్రభుత్వ దళాలపై కాల్పులు జరిగిననట్టు స్థానిక అధికారులు మీడియాకు తెలిపారు. ఫ్లోరెన్స్ ఆచూకీ తెలిపిన వారికి 5 మిలియన్ డాలర్ల నజరానా ఇస్తామని



ఎఫ్‌బీఐ ఇప్పటికే ప్రకటించింది. అమెరికాలోకి భారీ మొత్తంలో హెరా యిన్, మెథాంఫిటమైన్, కొకెయిన్, ఫెంటనైల్, గంజాయి వంటివి అక్రమంగా తరలించినందుకు ఫ్లోరెస్‌పై ఇప్పటికే అనేక కేసులు ఉన్నాయి. ప్రత్యర్థి గ్యాంగులపై ఆధిపత్యం కోసం ఫ్లోరెస్ ప్రమా దకరమైన గ్యాంగ్‌వార్‌లకు తెరతీశాడని అమెరికా అధికారులు పేర్కొన్నారు. 2024లో గుసావే ప్రాంతంలో మెక్సికో మిలిటరీ టన్ను బరువుల ఫెంటనైల్‌ను స్వాధీనం చేసుకుంది. ఇంత భారీ స్థాయిలో ఫెంటనైల్ లభించడం ఆ దేశంలో అదే తొలిసారి.

పుతిన్ ఓ హంతకుడు

ట్రంప్ వ్యాఖ్యలకు జెలెన్‌స్కీ కౌంటర్



ఉక్రెయిన్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన స్నేహితుడిగా అభివర్ణించడంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా స్పందించారు. తమ దేశానికి పుతిన్ శత్రువని, ఆయన ఒక హంతకుడని వ్యాఖ్యానిం చారు. ప్రపంచంలోని చాలా మంది ప్రజలు కూడా పుతిన్‌ను హంతకుడిగానే చూస్తారని అన్నారు. అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యల నేపథ్యంలో జెలెన్‌స్కీ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చ నీయాంశంగా మారాయి.

పుతిన్‌ను ట్రంప్ తన స్నేహితుడిగా పేర్కొన్న విషయంపై జెలెన్‌స్కీని సీఎన్ఎన్ ఇంటర్వ్యూలో ప్రశ్నిం చారు. దీనికి ఆయన స్పందిస్తూ.. పుతిన్ తమకు శత్రువని, తమ దృష్టిలో ఆయన ఒక హంతకుడని స్పష్టం చేశారు. ప్రపంచంలోని చాలా మంది ప్రజలు కూడా ఆయనను అలాగే భావిస్తారని పేర్కొన్నారు. ట్రంప్ స్నేహితుడిగా సంబోధించడం వల్ల పుతిన్‌పై అంతర్జాతీయ ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని జెలెన్‌స్కీ అభిప్రాయ పడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలు రష్యా అధ్యక్షుడికి మరింత ధైర్యాన్ని ఇవ్వవచ్చని, ఉక్రెయిన్‌పై దాడులు కొనసాగించేందుకు అవకాశం కల్పించవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.

పెరూలో 6.9 తీవ్రతతో భారీ భూకంపం



లిమా: దక్షిణ అమెరికా దేశమైన పెరూలో శుక్రవారం భారీ భూకంపం సంభవించింది. మధ్య పెరూలోని ఆండీస్ పర్వత ప్రాంతాల్లో రిక్టర్ స్కేలుపై 6.9 తీవ్రతతో భూమి కంపించింది. స్థానిక కాలమానం ప్రకారం శు క్రవారం రాత్రి 7:09 గంటలకు భూకంపం సంభవించిందని యూఎస్ జియోలాజికల్ సర్వే తెలి పింది. దీని కేంద్రం ఆండీస్ పర్వత ప్రాంతంలోని జునిన్‌కు ఉత్తరాన 34 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు పేర్కొంది. అలాగే భూమి లోపల 108 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడించింది. భూప్రకంపనలు పెరూ రాజధాని లిమానీ తాకడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. మరోవైపు, ఈ ఘట నలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని పెరూ జియోఫిజికల్ ఇన్‌స్టిట్యూట్ తెలిపింది. కాగా, ప్రపంచంలో తరచుగా భూకంపాలు సంభవించే పసిఫిక్ బేసిన్‌లోని రింగ్ ఆఫ్ ఫైర్ ప్రాంతంలో పెరూ దేశం ఉంది. దీంతో ఇక్కడ తరచూ భూ కంపాలు సంభవిస్తుంటాయి. ఈ ఏడాది ఆగస్టులో పెరూలోని ఆండీస్ పర్వత ప్రాంతంలో 6.7 తీవ్రతతో భూకంపం వచ్చింది. ఈ సందర్భంగా ఇద్దరు గాయపడగా, అనేక ఇళ్లు, ఆస్పత్రులు, పాఠశాలలు సహా ఇతర భవనాలు దెబ్బతిన్నాయి. అలాగే, జూలైలోనూ జునిన్ ప్రాంతంలో 5.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ ఘటనలో ఆరుగురు మరణించగా, 30 మంది గాయపడ్డారు.



గిల్ సెంచరీ మిస్.. భారత్ 486/4

- న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్

- మూడోరోజు ముగిసిన ఆట

వెల్లింగ్టన్: భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (98) రెండు పరుగుల దూరంలో శతకం మిస్ చేసుకున్నాడు. మూడో రోజు ఆట ముగి సేందుకు మరో రెండు బంతులే ఉండగా.. డఫీ బౌలింగ్ (124.4వ ఓవర్) గిల్ బౌల్డ్ అయ్యాడు. దీంతో రిషబ్ పంత్తో కలిసి నాలుగో వికెట్‌కు నిర్మించిన శతక భాగస్వామ్యానికి తెరపడింది. కెరీర్‌లో 12వ శతకం చేసే అవకాశం చేజారింది. మరో బ్యాటర్ రిషబ్ పంత్ తన 22వ హాఫ్ సెంచరీని నమోదు చేశాడు. మూడో రోజు ఆట ముగిసేసరికి భారత్ స్కోరు 125 ఓవర్లకు 486/4. గ్రీజ్‌లో రిషబ్ పంత్ (55), అన్షుల్ కాంబోజ్ ఉన్నారు. టీమిండియా 118 పరుగుల ఆధిక్యం లో ఉంది. తొలి ఇన్నింగ్స్ కివీస్ 368 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

94 ఏళ్లలో తొలిసారి ఐదుగురు అర్ధశతకాలు

విదేశీ గడ్డపై జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఒక ఇన్నింగ్స్‌లో భారత టాప్ ఆర్డర్‌లో మొత్తం ఐదుగురు బ్యాటర్లు అర్ధ శతకాలు చేయడం 94 ఏళ్లలో ఇదే మొదటిసారి. గతంలో టెస్టుల్లో టీమ్ ఇండియా బ్యాటర్లు భారత్లో నాలుగుసార్లు ఈ ఫీట్ సాధించారు.



నేపాల్.. 26కే ధమాల్

- **306 రన్స్‌తో భారత్ 'ఎ' ఘన విజయం**
- **తిలక్, కుశాగ్ర సెంచరీలు**
- **రైజింగ్ స్టార్స్ ఆసియా కప్**

దోహా: భారత ఫాస్ట్ బౌలర్లు ప్రిన్స్ యాదవ్ (5-2-6-5), హర్షిత్ రాణా (6-1-16-4) పేస్, స్వింగ్ బంతులకు నేపాల్ కుదేలైంది. జట్టులో ఒక్కరంటే ఒక్కరూ కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయారు. నేపాల్ బ్యాటర్లంతా కలిసి చేసిన స్కోరు 26. భారత ఓపెనర్ సూర్యవంశీ ఒక్కడి స్కోరు (26)నే నేపాల్ జట్టంతా కలిసి చేయడం గమనార్హం. దరిమిలా ఆసియా కప్ రైజింగ్ స్టార్ వన్డే టోర్నీలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 306 పరుగులతో భారత్ 'ఎ' ఘనమైన బోణీ చేసింది. కుమార కుశాగ్ర (117), కెప్టెన్ తిలక్ వర్మ (107) శతక మోత మోగించగా తొలుత భారత్ 'ఎ' 50 ఓవర్లలో 332/9 స్కోరు చేసింది. కుశాగ్ర, తిలక్ నాలుగో వికెట్‌కు 206 పరుగులు జోడించారు. భారీ ఛేదనలో భారత బౌలర్ల ధాటికి నేపాల్ చిగురుటాకులా వణికి 11.3 ఓవర్లలో 26 పరుగులకే చాప చుట్టేసింది. రషీద్ ఖాన్ (6), పవన్ సరాఫ్ 6) టాప్ స్కోరర్లు. ఎక్స్‌ట్రాలు (5) తదుపరి అత్యధిక స్కోరు. ఐదుగురు బ్యాటర్లు డకౌటయ్యారు.



రిషభ్ పంత్ సరికొత్త చరిత్ర

తొలి వికెట్ కీపర్-బ్యాటర్‌గా రికార్డ్



న్యూజిలాండ్: ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ 2025-27) చరిత్రలో భారత వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్ అరుదైన మైలురాయిని అందుకున్నాడు. శనివారం న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మూడో రోజు మూడో సెషన్‌లో 55 పరుగులు చేయడంతో 3000 పరుగుల మైలురాయిని అందు కున్నాడు. దీంతో వికెట్ కీపర్, బ్యాటర్‌గా 3,000 పరుగుల మార్కును దాటిన తొలి ఆటగాడిగా పంత్ నిలిచాడు. గాయం నుంచి కోలుకుని జట్టులోకి వచ్చిన పంత్.. ఈ టెస్టుకు ముందు 2,948 పరుగులతో ఉండగా.. 3 వేల పరుగులకు 52 పరుగులు అవసరమయ్యాయి. కేవలం 55 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేయడంతో పాటు 3 వేల పరుగుల మైలురాయిని అందుకున్నా డు. 54 బంతుల్లో 48 పరుగులతో ఉన్న పంత్.. బౌండరీ బాది 52 అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి 62 బంతుల్లో 55 పరుగులతో అజేయంగా నిలిచాడు. అంతకుముందు డబ్ల్యూటీసీలో భాగంగా విదేశాల్లో జరిగిన మ్యాచ్‌ల్లో 2,000 పరుగులు పూర్తి చేసిన తొలి, ఏకైక భారత క్రికెటర్‌గానూ పంత్ రికార్డు సృష్టించాడు. మరోవైపు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా మూడో రోజు డబ్ల్యూటీసీలో 3,000 పరుగుల క్లబ్‌లో చేరాడు. మొత్తంగా పంత్, గిల్ జోరుతో బేసిన్ రిజర్వ్ వేదికగా భారత్ పట్టు బిగించింది.



సెమీస్‌లో లక్ష్య, సాత్విక్ జోడీ

కౌలూన్ (హాంకాంగ్): ఏస్ షట్లర్ లక్ష్యసేన్, డబుల్స్ జోడీ సాత్విక్/చిరాగ్ హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. కాగా, టీనేజర్ రక్షితా రామ్‌రాజ్ జోరుకు క్వార్టర్‌ఫైనల్లో బ్రేక్ పడింది. శుక్రవారం జరిగిన పురుష ల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్ 21-17, 10-21, 21-13తో ఎనిమిదో సీడ్‌లో కీన్ యూ (సింగపూర్)కు షాకిచ్చాడు. మహిళల సింగిల్స్‌లో..గత రౌండ్‌లో ఒలింపిక్ మాజీ చాంపియన్ చెన్ యూఫీని చిత్తు చేసిన రక్షిత క్వార్టర్‌ఫైనల్లో మాత్రం 19-21, 16-21తో థాయ్‌లాండ్‌కు చెందిన ఐదో సీడ్ పోర్న్‌పవీ చొచువాంగ్ చేతిలో పరాజయం చవిచూసింది. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో ఐదో సీడ్ సాత్విక్/చిరాగ్ జోడీ 21-12, 13-21, 21-16తో హు కీ యువాన్/లిన్ షియాంగ్ (చైనా) జంటపై నెగ్గింది.

ధోనీ రిటైర్మెంట్ ఆశ్చర్యపరిచింది: జహీర్‌ఖాన్

ఢిల్లీ: ఐపీఎల్ ఆటగాడిగా టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ శకం ముగిసింది. ఇటీవలే క్రికెటర్‌గా ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఐదు సార్లు టైటిల్స్ గెలవడంలో ధోని కీలక పాత్ర పోషించాడు. మరో సీజన్ లో కూడా ప్రేక్షకులను అలరిస్తాడని భావిస్తున్న తరుణంలో వీడ్కోలు చెబుతూ అందరినీ విస్మయానికి గురి చేశాడు. మాజీ క్రికెటర్లు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ధోని నిర్ణయంపై తాజాగా చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్ జహీర్ ఖాన్ స్పందించాడు. ధోనీ రిటైర్మెంట్ నిర్ణయం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని తెలిపాడు. సీఎస్కే యూట్యూబ్ ఛానల్‌లో జహీర్ ఖాన్ మాట్లాడుతూ.. 'ఐపీఎల్ 2027 సీజన్ ఈ సైకిల్‌లో చివరిది కావడంతో ధోనీ ఆట నుంచి తప్పుకుంటారని నేను ఊహించలేదు. నా మనసులో ఆ ఆలోచనే లేదు. కానీ ఎంఎస్.. ఏం చేయాలి, ఎప్పుడు చేయాలనేది కచ్చితంగా తెలుసుకుని నిర్ణయం తీసుకుంటారు. ఎటువంటి హంగామా లేకుండా చాలా సహజంగా, సున్నితంగా తన నిర్ణయాన్ని చెప్పారు' అని జహీర్ పేర్కొన్నాడు. 'ప్రతి ఏటా



ధోని మైదానంలో ఆడుతూ కనిపిస్తారని ఆశిస్తాం. ఈసారి మాత్రం క్రికెటర్‌గా కాకుండా మెంటర్‌గా కొత్త అవతారంలో కనిపించనున్నారు. అందుకే ధోని నిర్ణయం విషయంలో నాకు మిశ్రమ భావోద్వేగాలు ఉన్నాయి. మెంటర్‌గా నా భారాన్ని పంచుకుంటూ, సరైన దిశలో మార్గనిర్దేశం చేస్తారన్న ఆనందం ఒకవైపు.. అతడు తీసుకున్న నిర్ణయం పట్ల భావోద్వేగం మరోవైపు ఉన్నాయి. అలానే సీఎస్కే బాధ్యతల విషయంలో మా మధ్య హద్దులు లేవు. ఆటగాళ్లపై నమ్మకం ఉంచి, వారికి స్వేచ్ఛనివ్వడమే ధోనీ నాయకత్వంలోని గొప్ప లక్షణం' అని జహీర్ ఖాన్ ప్రశంసించాడు. కాగా, రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని సీఎస్కే రూ.28.05 కోట్ల పర్స్‌తో వేలానికి సిద్ధమవుతోంది.

2026లో అత్యధిక వికెట్లు

పాక్ బౌలర్ అబ్బాస్ తొలిస్థానం



శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌లో 8 వికెట్లు పడగొట్టిన పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ మొహమ్మద్ అబ్బాస్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కించుకున్నాడు. ఈ నేపథ్యంలోనే అబ్బాస్ అరుదైన ఘనత సాధించాడు. 2026లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా తొలి స్థానంలో నిలిచాడు. ఇప్పటివరకు మొహమ్మద్ అబ్బాస్ 39 వికెట్లు పడగొట్టాడు. 2026లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా జాబితాలో ఇంగ్లండ్ బౌలర్ జోష్ టంగ్ (33 వికెట్లు) రెండో స్థానంలో కొనసాగు తున్నాడు. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ (32 వికెట్లు) మూడో స్థానంలో ఉన్నాడు. బంగ్లా బౌలర్ మెహిది మిరాజ్ (28 వికెట్లు), ఓలీ రాబిన్సన్ (28 వికెట్లు), హసన్ మహ్మద్ (27 వికెట్లు) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. మరోవైపు డబ్ల్యూటీసీ 2025-27 సైకిల్‌లో లీడింగ్ వికెట్ టేకర్‌గా ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ కొనసాగుతున్నాడు. స్టార్క్ 73 వికెట్లతో తొలి స్థానంలో ఉన్నాడు. ఇంగ్లండ్ బౌలర్ జోష్ టంగ్ 64 వికెట్లతో రెండో స్థానంలో, దక్షిణాఫ్రికా బౌలర్ సిమోన్ హార్మర్ (50 వికెట్లు) మూడో స్థానంలో ఉన్నారు.భారత బౌలర్ మహ్మద్ సిరాజ్ (43 వికెట్లు), ఇంగ్లండ్ స్టార్ జోఫ్రా ఆర్చర్ (41 వికెట్లు) నాలుగు, ఐదో స్థానాల్లో, విండీస్ బౌలర్ షమర్ జోసెఫ్ (40 వికెట్లు) ఆరో స్థానంలో కొనసాగుతున్నారు. 2026లో లీడింగ్ వికెట్ టేకర్‌గా ఉన్న మొహమ్మద్ అబ్బాస్ 39 వికెట్లతో ఏడో స్థానంలో నిలిచాడు. ఇక రెండో టెస్టులో పాకిస్థాన్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

చైతన్య రథం
సినిమా
ఆదివారం 22 నవంబర్ 2026 X

తారక్, అనిల్ రావిపూడి టైటిల్ ఇదేనా?



టాలీవుడ్‌లో వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో.. మోస్ట్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్‌గా దూసుకుపోతున్న అనిల్ రావిపూడి .. ప్రస్తుతం విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్‌రామ్ హీరోలుగా 'జనవరి 12 విడుదల' చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ మల్టీస్టారర్ రాబో యే సంక్రాంతి కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. గతంలో 'మన శంకర వరప్రసాద్ గారు' తర్వాత అనిల్ తదుపరి చిత్రం ఎవరితో ఉంటుందా? అని రకరకాల ఊహాగానాలు నడిచాయి. చిరంజీవి, నాగార్జున కాంబోలో సినిమా ఉంటుందంటూ వార్తలు వైరల్ అయ్యాయి. అలాగే బాలయ్య బాబుతో మరో సినిమా చేయబోతున్నట్లుగా టాక్ నడిచింది. అయితే ఈసారి అలాంటి సస్పెన్స్‌కు తావులేకుండా, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తరహాలో తన తదుపరి చిత్రాన్ని మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్‌తో చేయబోతున్నట్లు అనిల్ రావిపూడి ముందుగానే ప్రకటించి అందరినీ సర్‌ప్రైజ్ చేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందు తున్న 'డ్రాగన్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ భారీ యాక్షన్ డ్రామా పూర్తయిన వెంటనే తారక్ – అనిల్ రావిపూడి కాంబినేష న్‌లో సినిమా పట్టాలెక్కనుంది. అయితే ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఇప్పుడు ఒక ఆసక్తికరమైన టైటిల్ ఫిల్మ్ నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాకు 'దానవీరశూర' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. మాస్ ఎంటర్‌టైనర్లకు కేరాఫ్ అడ్రస్ అయిన అనిల్ రావిపూడి, ఎన్టీఆర్ బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా పక్కా కమర్షియల్ అంశాలతో పాటు ఒక బలమైన ఎమోషన్, సందేశం ఉన్న కథను సిద్ధం చేసినట్లు సమాచారం.

తెలుగు సినీ చరిత్రలో నటరత్న నందమూరి తారకరామారావు స్వీయ దర్శకత్వంలో నటించిన 'దానవీరశూరకర్ణ' ఏ స్థాయి చరిత్ర సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆ తర్వాత నందమూరి ఫ్యామిలీ నుంచి హరికృష్ణ మనవడు, జానకిరామ్ తనయుడు ఎన్టీఆర్ కూడా బాలల చిత్రంగా అదే టైటిల్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఇప్పుడు దాదాపు అదే క్లాసిక్ టైటిల్‌కు దగ్గరగా ఉండే 'దానవీరశూర' పేరుతో తారక్, అనిల్ రావిపూడి సినిమా రాబోతోందన్న వార్త నందమూరి అభిమానుల్లో పూనకాలు తెప్పిస్తోంది. మరి నిజంగానే ఈ సినిమాకు 'దానవీరశూర' అనే టైటిల్‌ను ఖరారు చేస్తారా? లేదంటే అనిల్ రావిపూడి తనదైన మార్క్ కామెడీ అండ్ మాస్ టచ్‌తో మరో కొత్త టైటిల్ పెడతారా? అనేది తెలియాలంటే మాత్రం.. చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చేవరకు వేచి చూడాల్సిందే.

సమంత విషయంలో ఆ జోస్యం నిజమైంది



సినీ సెలబ్రిటీల జీవితాలకు సంబంధించిన ఏ వార్త అయినా క్షణాల్లో వైరల్‌గా మారుతుంటుంది. గతంలో చేసిన వ్యాఖ్యలు, అంచనాలు అప్పుడప్పుడు నిజం కావడంతో సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చకు దారితీస్తుంటాయి. తాజాగా నటి సమంత విషయంలోనూ ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. ఆమెకు మగబిడ్డ పుడతాడంటూ దాదాపు 12 ఏళ్ల క్రితం ఓ జ్యోతిష్యుడు చెప్పిన మాటలు ఇప్పుడు మరోసారి వైరల్ అవుతున్నాయి. ఇటీవల సంగీత దర్శకుడు అనిరుధ్ పెళ్లి విషయానికి సంబం ధించి జ్యోతిష్యం చెప్పిన ఓ పాత వీడియో నెట్టింట చక్కర్లు కొట్టింది. చెన్నైకి చెందిన ఓ వ్యాపారవేత్తను ఆయన వివాహం చేసుకుంటారని జ్యోతిష్యుడు చెప్పినట్లు ఆ వీడియోలో ఉంది. ఇప్పుడు సమంత విషయంలోనూ ఇలాంటి పాత వీడియో బయటకు రావడంతో టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

ఓటీటీలో అన్బిల్ అవన్



విలక్షణ కథలను ఎంచుకుంటూ తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితుడైన యువ హీరో అశోక్ సెల్వన్ ప్రధాన పాత్రలో నటించిన తాజా రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ అన్బిల్ అవన్. ఈ చిత్రానికి ఆర్. కార్తికేయన్ దర్శకుడిగా పరిచయమవ్వగా.. పోర్ తొజిల్ ఫేమ్ విఘ్నేష్ రాజా ఈ సినిమా కు కథను అందించాడు. అయింగరన్ ఇంటర్నేషనల్, హ్యాపీ హై పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాలో ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా నటించగా, సబుమోన్ అబ్దుసమద్ కీలక పాత్ర పోషించాడు. ఇది హాలీవుడ్ చిత్రం స్ట్రా డాగ్స్, మలయాళ చిత్రం వరతన్ సినిమాకి అనధికారిక రీమేక్ అని తెలుస్తోంది. ఇకపోతే ఈ సినిమా అక్టోబర్ 2న రిలీజ్ అయ్యి మంచి పాజిటివ్ టాక్ నే అందుకుంది. ఇక ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీ బాట పట్టింది. ఈ శుక్రవారం నుంచి సోనీలీవ్‌లో అన్బిల్ అవన్ అన్ని భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. మరి ఈ సినిమా ఎలా ఉంది అనేది చూద్దాం. కథ విషయానికొస్తే.. ఏడేళ్ల ప్రేమ తర్వాత కుటుంబాన్ని ఎదిరించి పెళ్లి చేసుకున్న సూర్య (అశోక్ సెల్వన్), ఇందు(ప్రీతి ముకుందన్).. నగరంలోని ఫైవ్‌స్టార్ హోటల్ ఉద్యోగాల్లో ఒత్తిడి, జీవన పోరాటంతో విసిగిపోతారు. ప్రకృతి మధ్య ప్రశాంతంగా, సొంతంగా ఒక అందమైన హోమ్‌స్టే ప్రారంభించాలనే ఇందు చిరకాల కలను నిజం చేయడానికి ఇద్దరూ తమ కష్టార్జితాన్ని, పొదుపును అంతా కలిపి ఒక సుందరమైన కొండ ప్రాంతానికి మకాం మారుస్తారు. అక్కడ మాజీ రాణి (రేవతి) వద్ద ఉన్న ఒక పురాతన బంగ్లాను ఎంతో కష్టపడి కొనుగోలు చేసి తమ కొత్త ప్రయాణాన్ని మొదలుపెడతారు. ఆ తర్వాత ఏం జరిగిందనేది కథ.

డైరెక్టర్, హీరోయిన్‌కు అల్లు బంపరాఫర్

వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ హీరోగా, పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కిన లేటెస్ట్ ఫీల్ గుడ్ ఫిల్మ్ 'ఆకాశంలో ఒక తార'. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్‌బాక్స్ మీడియా బ్యానర్లపై సందీప్ గున్నం, రమ్య గున్నం నిర్మించిన ఈ చిత్రంలో సాత్విక వీరవల్లి హీరోయిన్‌గా నటించగా.. శ్రుతి హాసన్, రుహాని శర్మ కీలక పాత్రలు పోషించారు. నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా.. ప్రీమియర్ షోల నుంచే అద్భుతమైన స్పందనను రాబట్టుకుంది. నిర్మాత అల్లు అరవింద్ చిత్ర దర్శకుడు పవన్ సాధినేనితో పాటు హీరోయిన్ సాత్విక వీరవల్లికి అదిరి పోయే బంపరాఫర్లు ప్రకటించి సర్‌ప్రైజ్ ఇచ్చారు. మా దర్శకుడు పవన్ సాధినేని ఈ సినిమాను అత్యద్భుతంగా తీర్చిదిద్ది



నన్ను ఆశ్చర్యపరిచాడు. అందుకే తన తదుపరి సినిమా నాతోనే (గీతా ఆర్ట్స్‌లో) చేయబోతున్నాడు. అలాగే హీరోయిన్ సాత్విక ఈ చిత్రంతో పెద్ద స్టార్ అయిపోయింది. తను మా బ్యానర్‌లో మరో రెండు సినిమాలు చేయనుంది. నాగచైతన్యతో మేము చేయబోయే తదుపరి సినిమాలో కూడా సాత్వికనే హీరోయిన్" అని అల్లు అరవింద్ అధికారికంగా ప్రకటించారు.

ప్రేక్షకుల ముందుకు 'ఫూలే' వస్తున్నాడు



భారత సామాజిక సంస్కరణల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహనీయులు మహాత్మా జ్యోతిరావ్ ఫూలే, సావిత్రిబాయి ఫూలే దంపతుల జీవిత పోరాటం ఆధారంగా తెరకెక్కిన ప్రతిష్టాత్మక చిత్రం 'ఫూలే' తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సమా జంలోని కులవివక్ష, అసమానతలు, మహిళల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడుతూ విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఆ ఆదర్శ దంపతుల ప్రయాణాన్ని ఈ చిత్రంలో హృద్యంగా ఆవిష్కరించారు. ప్రముఖ దర్శకుడు అనంత్ మహదేవన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని సుపదా క్రియేషన్స్ బ్యానర్‌పై డా. పొన్నం రవిచంద్ర నిర్మించారు. తెలుగు డబ్బింగ్ పనులన్నీ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 27న థియేటర్లలో విడుదల కానుందని తెలుపు తూ మేకర్స్ అధికారికంగా పోస్టర్ విడుదల చేశారు. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, మంత్రు లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా వీక్షించారు. సినిమా చూసిన అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కులవివక్ష నిర్మూలన, మహిళా విద్య కోసం ఫూలే దంపతులు చేసిన మహోన్నత పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వారి సామాజిక సేవ, జీవిత ఆశయాలు నేటి సమాజానికి అత్యంత అవసరమైన సందేశాన్ని అందిస్తాయని అభిప్రాయపడ్డారు. 'ఫూలే' కేవలం ఒక సినిమా మాత్రమే కాదని, సమాజంలో మార్పు కోసం పోరాడిన ఇద్దరు మహనీయులు ఎదుర్కొన్న అడ్డంకులను, వారి త్యాగాలను కళ్లకు కట్టే ఒక చారిత్రాత్మక దృశ్యకావ్యమని చిత్ర బృందం పేర్కొంది. సమానత్వం, విద్య, మానవత్వం, సామాజిక బాధ్యత వంటి విలువలను గుర్తుచేసే ఈ చిత్రాన్ని నేటి యువత, విద్యా ర్థులతో పాటు ప్రతిఒక్కరూ థియేటర్లలో చూసి ఆదరించాలని, ఈ మంచి ప్రయత్నాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి మీడియా సైతం సహకరించాలని మేకర్స్ విజ్ఞప్తి చేశారు.

'హైందవ' వాయిదా వెనుక అసలు కథ ఇదేనా?



టాలీవుడ్‌లో సినిమాల విడుదల తేదీలు మారడం ఇప్పుడు సర్వసాధారణంగా మారిపోయింది. భారీ బడ్జెట్ చిత్రాల నుంచి చిన్న, మీడియం రేంజ్ సినిమాల వరకు ఏదో ఒక కారణంతో వాయిదాల బాట పడుతున్నాయి. ఇప్పటికే 'ఫౌజీ', 'స్పిరిట్' వంటి భారీ చిత్రాల విడుదల తేదీల్లో మార్పులు చోటుచేసుకోగా, 'వారణాసి' విషయంలోనూ అనేక చర్చలు సాగుతున్నాయి. తాజాగా వాయిదాల జాబితాలోకి బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తున్న 'హైందవ' కూడా చేరింది. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ చిత్రాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే ఈ నిర్ణయం వెనుక ఓటీటీ ఒప్పందాలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయ నే ప్రచారం జరుగుతోంది. సినిమా షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తయ్యాయని, ఫస్ట్ కాపీ కూడా సిద్ధంగా ఉందని తెలిసింది. అయినప్పటికీ ఓటీటీ సంస్థల నుంచి ఎదురైన కొన్ని అభ్యంతరాల కారణంగానే విడుదలను వాయిదా వేయాల్సి వచ్చిందని ఇన్‌సైడ్ టాక్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటించిన మరో చిత్రం 'టైసన్ నాయుడు' డిసెంబర్‌లో విడుద లకు సిద్ధమవుతోంది.